www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## ధనుష్ శ్రీకాంత్ 'గోల్డెన్' షూట్

**బధిరుల ఒలింపిక్స్‌లో సత్తా చాటిన హైదరాబాద్ షూటర్**

ప్రపంచ రికార్డు ప్రదర్శనతో స్వర్ణం కైవసం

రాష్ట్ర సర్కారు నజరానా రూ. 1.20 కోట్లు

బధిరుల ఒలింపిక్స్‌లో ఇది మూడో పసిడి పతకం

11



సోమవారం | 17-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 229 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి పూర్తి, నక్షత్రం: చిత్త తె. 5:01 తదుపరి స్వాతి, వర్జ్యం: ఉ.11:07-12:55, దుర్ముహూర్తం: మ.12:22-1:07, మ.2:36-3:21, అమృతఘడియలు: రా.9:51-11:39, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:24, సూర్యాస్తమయం: 5:35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## కవిత రాక్షసి



కారణజన్ముడి కడుపున పుట్టడం దురదృష్టకరం

వ్యాపారాన్ని కాపాడుకునేందుకే రేవంత్‌తో కుమ్మక్కు

హరీశ్‌రావుకు ఆమె క్షమాపణ చెప్పాలి

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర వ్యాఖ్యలు

నిజామాబాద్‌లో చెల్లని రూపాయి.. ఇక్కడ చెల్లుతుందా

ఎమ్మెల్యే మాణిక్‌రావు ఎద్దేవా.. ఆమె కాంగ్రెస్ ట్రాప్‌లో పడ్డారు: పార్టీ విప్ వివేకానంద

12ఏళ్లలో సీఎంలు బదులుకు ఏమీ చేయలేదు.. కేసీఆర్, రేవంత్‌లపై కవిత విమర్శ

బీఆర్ఎస్ వాళ్ల కామెంట్లకు జాగృతి కౌంటర్ ఉంటుందని హెచ్చరిక

'కర్మ హిట్స్ బ్యాక్' అని ఎవరిని ఉద్దేశించి అన్నారంటే.. 'జైతెలంగాణ' అంటూ సమాధానం

13

## కలిసి నడవాలి

**చర్చల ద్వారానే రెండు రాష్ట్రాల సమస్యలకు పరిష్కారం**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరిస్తా

రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానంలో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

ప్రభుత్వ జీవోలు, ఉత్తర్వులు ఇకపై తెలుగులోనే: సీఎం రేవంత్

**మరోమారు కేంద్రంపై ఒత్తిడి తెద్దామా?**

కోర్టు సూచన మేరకు ఎన్నికలకు వెళదామా?

సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి బీసీలకు 42%కోసం పోరాడదామా?

నేడు క్యాబినెట్ భేటీ.. స్థానిక ఎన్నికలపై చర్చ

13



ఫిలింసిటీలో జరిగిన కార్యక్రమంలో ఉల్లాసంగా మాట్లాడుకుంటున్న సీఎంలు



## పెళ్లి కోసం పసికందు బలి

12

కొడుకు వరుసయ్యే శిశువును బలిస్తే

తమకు సంబంధాలు వస్తాయని..

16 రోజుల వయసున్న పసికందును

కాళ్లతో తొక్కి చంపిన నలుగురు యువతులు

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘటన

# తెలుగంటే తక్కువ.. ఆంగ్లంపై మక్కువ

**మాతృభాషలో మాట్లాడేందుకూ ఇష్టపడని గ్రూప్-1 అధికారులు**

- శిక్షణ అంతా ఇంగ్లిషులోనే.. మచ్చుకైనా కనిపించని తెలుగు
- ఇతర రాష్ట్రాలకు భిన్నంగా తెలంగాణలో ఇంగ్లిషులో శిక్షణ ప్రణాళిక
- గ్రూప్-1కు ఎంపికైన 563 మందిలో 90శాతం ఆంగ్ల మాధ్యమమే
- పాలన వ్యవహారాల్లో తెలుగు పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం
- సివిల్ సర్వీస్ తరహాలో తెలుగు తప్పనిసరిగా నేర్చుకోవాలంటున్న నిపుణులు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్చార్డీ)లో సివిల్ సర్వీసెస్ అధికారులకు శిక్షణనిచ్చే సీనియర్ అధికారి ఒకరు ఇటీవల గ్రూప్-1కు ఎంపికైన అభ్యర్థుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన తెలుగులో తన శిక్షణ ప్రారంభించగానే.. అభ్యర్థులంతా అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగులో వద్దని, ఇంగ్లిషులో చెప్పాలని కోరారు. దీనితో ఆయన ఇంగ్లిషులోనే కొనసాగించారు. తెలుగు రాష్ట్రంలో అత్యున్నత సర్వీసులకు ఎంపికైన గ్రూప్-1 అధికారులు మాతృభాషకు ఇస్తున్న విలువ ఇది. ఇటీవల ఎంపికైన అధికారులు కనీసం తెలుగు మాట్లాడేందుకు కూడా సిద్ధంగా లేరని, తెలుగులో ప్రశ్నిస్తే ఇంగ్లిషులో సమాధానం ఇస్తున్నారని ఆ ఉన్నతాధికారి ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో గ్రూప్-1 శిక్షణ అంతా స్థానిక భాషలోనే జరుగుతుండగా.. తెలంగాణలో మాత్రం పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. తెలంగాణలో దాదాపు 11 ఏళ్ల అనంతరం గ్రూప్-1 పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఎంపికైన 562 మందికి సెప్టెంబరు 27న సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించారు. వారికి కేటాయించిన శాఖలకు సంబంధించిన శిక్షణ కూడా ప్రారంభమైంది. ఎక్సైజ్ శాఖకు కేటాయించినవారికి ఎక్సైజ్ అకాడమీలో, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖకు ఎంపికైనవారికి మాసబ్ ట్యాంక్‌లోని ఎంఏయూడీ కార్యాలయంలో, పంచాయతీరాజ్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల వారికి ఆయా అకాడమీల్లో శిక్షణ కొనసాగుతోంది. అయితే గతానికి భిన్నంగా అధికారులు ఈసారి శిక్షణ ప్రణాళిక అంతా ఇంగ్లిషులోనే రూపొందించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఇలాంటి శిక్షణలు అంతా తెలుగులోనే జరిగేవి. కానీ ఇప్పుడు శిక్షణ ఇంగ్లిషులోనే





మిగతా 14వ పేజీలో...



సీజేఐ గవాయ్‌ని సన్మానిస్తున్న ఏపీ సీఎం బాబు

## ఎస్సీలకూ క్రీమీలేయర్ ఉండాల్సిందే!

**ఆ తీర్పు ఇచ్చినప్పుడు నన్ను తీవ్రంగా విమర్శించారు**

అయినా తీర్పునకు కట్టుబడి ఉన్నా

ఐఏఎస్ కొడుకు, కూలీ బిడ్డ సమానమా?

ఎస్సీల్లో ఉపవర్గీకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాం

ప్రాథమిక హక్కుల రక్షణలో కోర్టులదే కీలక పాత్ర

న్యాయం చివరి పౌరుడి వరకు చేరాలి

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యలు

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు

జస్టిస్ గవాయ్ మానవతావాది: బాబు

14

# భూత వైద్యులు

**ఢిల్లీ పేలుళ్ల కేసులో వైట్‌కాలర్ ఉగ్రవాదంపై పోలీసుల దృష్టి**



ఆచూకీ లేకుండా పోయిన 15 మంది డాక్టర్లు

మరో 200 మందిపైనా దర్యాప్తు సంస్థల నిఘా

ప్రియాంక శర్మ అనే వైద్యురాలి అరెస్టు, విడుదల

ఆమె సెల్‌ఫోను, ఓ సిమ్ కార్డు సీజ్

ఉమర్ నబీ సహచరుడు రషీద్ అలీ అరెస్టు

పేలిన ఐ20 కారు రిజిస్ట్రేషన్ రషీద్ పేరిటే

శ్రీనగర్, నవంబరు 16: ఢిల్లీ పేలుళ్ల కేసులో దర్యాప్తు సంస్థలు లోతుగా విచారణ చేస్తున్నాయి. ఇందులో భాగంగా వైట్ కాలర్ ఉగ్రవాదంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. అయితే, ఢిల్లీ పేలుడుతోపాటు వైట్‌కాలర్ ఉగ్రవాదంతో సంబంధం ఉన్న 15 మందికి పైగా డాక్టర్లు ప్రస్తుతం ఆచూకీ లేకుండా పోయారని పోలీసు వర్గాలు తెలిపాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా, కశ్మీరుల్లో ఉగ్రవాద కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న మరో 200 మంది వైద్యుల కదలికలపైనా నిఘా వర్గాలు కన్నేసి ఉంచినట్టు వెల్లడించాయి. మరోవైపు, ఉగ్రవాద చర్యలకు కేంద్ర బిందువుగా మారిన అల్‌ఫలా యూనివర్సిటీ ల్యాబ్‌లోనే అమ్మోనియం నైట్రేట్ పేలుడు పదార్థం తయారైందని, పాక్ ఉగ్రవాద నేత మసూద్ అజర్ సోదరి మార్గదర్శకత్వంలో లఖ్‌నవూ డాక్టర్ షాహిన్ సయీద్ ఈ కార్యక్రమాలకు సారథ్యం వహించిందని తెలుస్తోంది. కాగా, ఎర్రకోట వద్ద జరిగిన పేలుడుకి కారణమైన ఐ20 కారును నడిపిన వ్యక్తిని డాక్టర్ ఉమర్ నబీగా గుర్తించిన పోలీసులు అతడితో సంబంధమున్న ఐదుగురు వైద్యులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. ఈ వైద్యులకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్టు తేలడంతో ఆయా వైద్యులతో కలిసి చదువుకున్న, పని చేసిన వైద్యులపైనా పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ప్రియాంక శర్మ అనే వైద్యురాలిని పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ పేలుడు కేసులో అరెస్టయిన డాక్టర్ అదీల్‌కు ప్రియాంక శర్మతో పరిచయం ఉంది. అనంత్‌నాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల మాజీ ఉద్యోగైన అదీల్.. కాల్ డేటా ఆధారంగా పోలీసులు ప్రియాంక శర్మను గుర్తించారు. హరియాణాలోని రోహ్‌టక్‌కు చెందిన ప్రియాంక శర్మను అనంత్‌నాగ్‌లో ఆమె నివాసముంటున్న ఇంట్లోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ అనంతరం విడుదల చేశారు. ప్రియాంక శర్మ సెల్‌ఫోను, ఓ సిమ్ కార్డును స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు.



### నబీ సహచరుడి అరెస్టు

ఎర్రకోట వద్ద పేలుడుకు గురైన ఐ20 కారును నడిపిన డాక్టర్ ఉమర్ నబీ సహచరుడు అమీర్ రషీద్ అలీ అనే వ్యక్తిని ఎన్ఐఏ ఆదివారం

మిగతా 2వ పేజీలో...



## గజ గజ..

రాష్ట్రంలో మరింత పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

ఆదివారం అత్యల్పంగా సిర్పూర్‌లో 7.4 డిగ్రీలు

10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. ఇతర జిల్లాలకు యెల్లో అలర్ట్

శేరిలింగంపల్లిలో 10 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు


రాబోయే రెండుమూడు రోజులు మరింత చలి

వాతావరణ కేంద్రం వెల్లడి

14

# డయాలిసిస్ దోపిడీ

**ప్రైవేటు ఏజెన్సీలకు భారీగా 'లాభం'**



ఒక్కో డయాలిసిస్‌కు రూ.1820 చెల్లిస్తున్న ప్రభుత్వం

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఇవే సేవలకు రూ.1350

సర్కారీ కేంద్రాల్లో భారీగా ధర పెంపు.. గత ప్రభుత్వ హయాంలో నిర్ణయం

2022 వరకు రూ.1375.. ఆ తర్వాత రూ.1820

అధికారులు, ఏజెన్సీలు మిలాఖతై పెంచుకున్నట్లు ఆరోపణలు

డయాలిసిస్ కేంద్రాలకు ఉచితంగా స్థలం, విద్యుత్తు, నీరు ఇస్తున్న సర్కారు

పీపీపీ పద్ధతిలో రక్తశుద్ధి సేవలు.. అడ్డగోలు పెంపుపై ప్రభుత్వం ఆగ్రహం

పూర్తిస్థాయి విచారణకు రంగం సిద్ధం.. రేట్లు తగ్గించే యోచన

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ డయాలిసిస్ సేవల పేరిట అడ్డగోలు దోపిడీ జరుగుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వమే ఆయా కేంద్రాలకు భూమి, నీళ్లు, విద్యుత్తు అందిస్తోంది.. అటువంటప్పుడు ప్రైవేటు సెంటర్ల కంటే తక్కువ ధరకు సేవలు అందించాల్సిన డయాలిసిస్ కేంద్రాలు వాటికంటే ఎక్కువ రేట్లు వసూలు చేసి ఆ మొత్తాన్ని ప్రభుత్వం నుంచి వసూలు చేస్తూ ఖజానాకు నష్టం కలిగిస్తున్నాయి. దీని వెనుక డయాలిసిస్ సేవలందించే ప్రైవేటు ఏజెన్సీల లాబీ, నాటి ప్రభుత్వంలోని కొందరు ఉన్నతాధికారులతోపాటు ఆరోగ్యశ్రీలోని అధికారుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై ప్రభుత్వం తాజాగా ఆరా తీసినట్లు సమాచారం. త్వరలోనే పూర్తిస్థాయి విచారణ జరిపించటంతోపాటు పెంచిన ధరలను తగ్గించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఏపీలోనే కిడ్నీ పేషంట్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా డయాలిసిస్ కేంద్రాలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఏర్పాటు చేశారు. వీటికి నెలవారీ బిల్లుల చెల్లింపు, పర్యవేక్షణ, ఆడిటింగ్, టెండర్లు మొదలైన పనులన్నింటినీ

మిగతా 12వ పేజీలో...

# ఐ బొమ్మ క్లోజ్

## బప్పం టీవీ కూడా బంద్

**తమను సవాలు చేసిన ఇమ్మడి రవితోనే ఆ వెబ్‌సైట్లను మూసివేయించిన పోలీసులు**

**రవి ఇంటి పేరే ఐ బొమ్మలో 'ఐ'.. రవిని కస్టడీకి కోరుతూ పోలీసుల పిటిషన్**

**మా అబ్బాయి ఇలా ఎందుకు చేశాడో తెలియదు : రవి తండ్రి అప్పారావు**

హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐ బొమ్మ, బప్పంటీవీల్లో పైరసీ సినిమాల ఆట ముగిసింది. 'మా దగ్గర కోట్ల మంది డేటా ఉంది. మా మీద ఫోకస్ చెయ్యకండి, మమ్మల్ని ఆపలేరు.. వెతకలేరు' అంటూ గతంలో తమకు సవాలుకు విసిరిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవితోనే పోలీసులు ఆ వెబ్‌సైట్లను మూసి వేయించారు. ఇమ్మడి రవిని శనివారం అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు.. అతని వద్ద నుంచి వెబ్ లాగిన్‌లు, సర్వర్ వివరాలు తీసుకొని అతనితోనే ఆయా సైట్లను మూసివేయించారు. పోలీసులు సాధించిన ఈ విజయంపై సినీ పరిశ్రమ నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్టు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు ఇమ్మడి రవిని శనివారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు అతడికి రిమాండ్ విధించింది. అయితే, కేసు దర్యాప్తులో భాగంగా రవిని మరింత లోతుగా విచారించేందుకు రవిని ఏడు రోజుల కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. రవిని అదుపులోకి తీసుకొని లోతుగా విచారిస్తే..ఈ పైరసీ వ్యవహారం వెనక మరెవరు ఉన్నారో తెలుస్తుందని పోలీసులు





మిగతా 3వ పేజీలో...



బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు..

## నేడు సుప్రీంలో విచారణ



గత నెల 31తో ముగిసిన గడువు..

పొడిగించాలని కోర్టును కోరిన స్పీకర్

స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలంటూ కేటీఆర్ పిటిషన్

ఆ 10 మందిని అనర్హులుగా ప్రకటించాలని మరో పిటిషన్

12

## మార్చిలోపు మరో 7 ప్రయోగాలు

2027లో గగన్‌యాన్.. 2028లో చంద్రయాన్-4

12

చంద్రుడిపై నుంచి నమూనాలు తీసుకొస్తాం

వరుస ప్రయోగాలతో ఇస్రో బిజీ బిజీ..

రాకెట్ల ఉత్పత్తి 3 రెట్లు పెంచేందుకు కృషి

ఇస్రో చైర్మన్ వి నారాయణన్



జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత..

## హిందువుల్లో కసి పెరిగింది

మనమంతా ఓటు బ్యాంకుగా మారాలి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మతం మారిన వారు తిరిగి రావాలి

హిందూ ధర్మం కోసం పని చేయాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

13





# భూత వైద్యులు

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేసింది. పేలుడుకు గురైన ఐ20 కారు రషీద్ అలీ పేరు మీదే రిజిస్ట్రేషన్ జరిగిందని అధికారుల తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని పంపోరేకు చెందిన రషీద్.. కారు కొనుగోలు విషయంలో నబీకి సహకరించేందుకు ఢిల్లీకి వచ్చాడని, ఎర్రకోట సమీపంలో అదే కారు పేలిందని అధికారులు పేర్కొన్నారు. ఇక, డాక్టర్ ఉమర్ నబీ అక్రమ మార్గాల ద్వారా రూ.20 లక్షల నగదు అందుకున్నట్టు పోలీసు దర్యాప్తులో తేలింది. ఇందుకు సంబంధించి పలువురు హవాలా డీలర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్టు తెలిసింది. నబీ నగదు రూపంలో చెల్లింపులు చేసి హరియాణా లోని నుహ్‌లో పెద్ద ఎత్తున ఎరువులు కొనుగోలు చేసినట్టు గుర్తించామని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

### ఆ 9ఎంఎం కార్ట్రిడ్జ్‌లు అక్కడికి ఎలా వచ్చాయి ?

ఎర్రకోట సమీపంలో నవంబరు 10న పేలుడు జరిగిన ప్రాంతంలో మూడు 9 ఎంఎం కార్ట్రిడ్జ్‌లను గుర్తించిన ఢిల్లీ పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ మూడింటిలో రెండు లైవ్ రౌండ్లు కాగా ఒకటి ఖాళీ కార్ట్రిడ్జ్. అయితే, పేలుడు జరిగిన ప్రదేశంలోకి ఆ 9ఎంఎం కార్ట్రిడ్జ్‌లు ఎలా వచ్చాయి ? అనేది ప్రస్తుతం కీలకంగా మారింది. ఎందుకంటే 9ఎంఎం బుల్లెట్లను ఆర్మీ, పోలీసు వారు మాత్రమే ఉపయోగిస్తారు. పైగా, ఘటనాస్థలంలో పిస్టల్ లేదా మరే ఆయుధం కూడా లభించలేదు. ఘటనాస్థలిలో విధుల్లో ఉన్న సిబ్బందికి ఇచ్చిన బుల్లెట్ల రికార్డులను కూడా దర్యాప్తు అధికారులు తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి ఘటనాస్థలిలో దొరికిన కార్ట్రిడ్జ్‌లకు సంబంధం లేదని గుర్తించారు. దీంతో ఆ 9 ఎంఎం కార్ట్రిడ్జ్‌లు అక్కడికి ఎలా వచ్చాయనేది ప్రశ్నగా మారింది.

### కొడుకు, సోదరుడి అరెస్టులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వైట్ కాలర్ ఉగ్రవాదం ఆరోపణలపై పోలీసులు తన కుమారుడు, సోదరుడిని అరెస్టు చేయడంతో మనస్తాపం చెంది జమ్మూకశ్మీర్‌కు చెందిన ఓ వ్యాపారి ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన బిలాల్ అహ్మద్ వానీ(50) అనే వ్యాపారి శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకున్నాడు. తీవ్రమైన కాలిన గాయాలతో ఆస్పత్రిపాలైన బిలాల్ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. వైట్‌కాలర్ ఉగ్రవాదంతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో బిలాల్ కుమారుడు జసిర్ బిలాల్(22), సోదరుడు నవీల్ వానీని పోలీసులు కొద్ది రోజుల క్రితం అరెస్టు చేశారు. ఇక, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులున్నారన్న సమాచారం మేరకు జమ్మూకశ్మీర్‌లోని కిష్టావర్ జిల్లా జైలులో నిఘావర్గాలు ఆదివారం పొద్దుపోయే వరకూ సోదాలు చేశాయి.

## ఒకే డోర్ నంబరు.. 177 మంది ఓటర్లు

» చెన్నై పెరుంబాక్కం కాలనీలో ఇలాంటి కేసులెన్నో..

చెన్నై, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఒకే డోర్‌నంబరులో 177 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. దీంతో వచ్చే ఏడాది జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉంది. ఇది తమిళనాడు రాజధాని నగరం చెన్నై శివారు పెరుంబాక్కంలోని పునరావాస కాలనీలోని పరిస్థితి. ఈ కాలనీలో 200 నుంచి 250 వరకు ఉన్న బ్లాకుల్లో 26 వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి సంబంధించిన పత్రాలపై సంపూర్ణ చిరునామాలు లేవు. వీరి చిరునామాలను అసంపూర్తిగా, ఇష్టానుసారంగా నమోదు చేశారు. అనేకమంది పత్రాలపై ఒకే చిరునామాలు ముద్రించారు. దీంతో ఈ ప్రాంతంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఒకే డోర్‌నంబరు ఉండటంతో ఓటు హక్కును కోల్పోతామని ఇక్కడి ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ కాలనీలో నివసిస్తున్న కుటుంబాలకు ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేసినప్పటికీ వాటిలో ముప్పావు శాతం వరకూ అసంపూర్తి చిరునామాలే ఉన్నాయి. కాలనీలో నివసిస్తున్న మూడువేల కుటుంబాలకు మాత్రమే సంపూర్ణమైన చిరునామాలున్నాయి. రోజు మొత్తమ్మీద 24 ఫారంలు మాత్రమే పంపిణీ చేయగలిగానని, సరైన అడ్రస్‌లు లేకపోవడంతో ఓటర్లను గుర్తించడం కష్టంగా మారిందని ఒక మహిళా బీఎల్‌వో ఆవేదన వ్యక్తం చేశారు. తాను 935 మంది ఓటర్ల వివరాలు సేకరించాల్సి ఉందని, ఇప్పటికి 150 మంది(16%) వివరాలు మాత్రమే సేకరించగలిగానని చెప్పారు. ఇంకా రెండు వారాల గడువు మాత్రమే ఉందని తెలిపారు.

## దలైలామా జీవితకథ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దలైలామా తొలి మూల హిందీ జీవిత చరిత్రను న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ అరవింద్ యాదవ్ ఈ గ్రంథాన్ని రచించారు. పద్మవిభూషణ్ డాక్టర్ కరణ్‌సింగ్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించగా, తొలి ప్రతిని పద్మవిభూషణ్ డాక్టర్ మురళీమనోహర్ జోషీ అందుకున్నారు. దలైలామా ప్రతినిధిగా గెషే దోర్జీ దందూల్ హాజరయ్యారు.

# విరుగుడు లేని విషం

## ఆముదం గింజల్లో ప్రమాదకర రెసిన్.. 2 ఉప్పు రవ్వలంత రెసిన్ తిన్నా మనిషి మృతి

» ఈ విషానికి విరుగుడే లేదు

» తాజాగా రెసిన్‌పై జైషే కన్ను





మొహియుద్దీన్

న్యూఢిల్లీ, నవంబరు 16: రెండు ఉప్పు రవ్వలు ఎంత పరిమాణంలో ఉంటాయి? కంటికి అతి సమీపంలో పెట్టుకొని చూస్తే కానీ కనిపించనంత కదా? అంత తక్కువ పరిమాణంలో తిన్నా మనిషిని చంపగల విషం ఒకటుంది.. అదే రెసిన్. ఈ విషానికి ప్రపంచంలో ఎక్కడా విరుగుడే లేదు. అది శరీరంలోకి వెళ్తే 36 నుంచి 72 గంటల్లో మనిషి చనిపోతాడు. మనదేశంలో విధ్వంసం సృష్టించాలని కుట్రలు చేస్తున్న ఉగ్రవాదులు ఇప్పుడు ప్రమాదకరమైన ఈ విషంపై కన్నేశారు. ఇటీవల గుజరాత్ ఉగ్రవాద నిరోధక విభాగం (ఏటీఎస్) పోలీసులు అరెస్టు చేసిన హైదరాబాదీ వైద్యుడు మొహియుద్దీన్ రెసిన్‌ను తయారుచేసే పనిలో ఉన్నట్లు తేలటంలో నిఘా, దర్యాప్తు వర్గాలు ఉలిక్కిపడ్డాయి.

### ఆముదం గింజల నుంచి తయారీ..

రెసిన్‌ను ఆముదం గింజల నుంచి తయారుచేస్తారు. దీనిని సాధారణ వ్యక్తులు తయారుచేయటం అంత తేలిక కానప్పటికీ అసాధ్యం మాత్రం కాదని నిపుణులు చెబుతున్నారు. ఆముదం గింజలను గుజ్జుగా మార్చి ప్రత్యేక విధానంలో దాని నుంచి రెసిన్‌ను తీస్తారు. ఇటీవల గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేసిన మొహియుద్దీన్ వద్ద 4 కిలోల ఆముదం గుజ్జు లభించటంతో తీగ లాగగా రెసిన్ తయారీ విషయం బయటపడింది.

### తేలికగా లభ్యం

సాధారణంగా ఆముదాలు ఎవరికైనా తేలికగా లభిస్తాయి. మనదేశంలోని చాలా రాష్ట్రాల్లో రైతులు ఆముదం పంట పండిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని మెట్ట ప్రాంతాల్లో కొంతకాలం క్రితం వరకు ఇది ప్రధాన పంటగా ఉండేది. హైదరాబాద్‌లోని మూసీ నది వెంట చిత్తడి ప్రాంతాల్లో ఆముదం మొక్కలు విరివిగా పెరుగుతాయి. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ ఆముదాలు అమ్ముతున్నారు. ఎందుకు, ఏమిటి అనే ప్రశ్నలు వేయకుండానే ఆర్డర్ చేసిన వెంటనే ఇంటికే డెలివరీ చేస్తున్నారు. ఇప్పటివరకు ఉగ్రవాద వ్యతిరేక దర్యాప్తు సంస్థలుగానీ, నిఘా వర్గాలుగానీ, ప్రభుత్వాలుగానీ ఎవరైనా రెసిన్‌ను దుర్వినియోగం చేస్తే ఎలా అనే అంశంపై పెద్దగా దృష్టి పెట్టలేదు.

**లక్షణాలు**

- ముక్కుద్వారా రెసిన్ శరీరంలోకి వెళ్తే శ్వాస తీసుకోటంలో తీవ్ర సమస్య ఏర్పడుతుంది. దీంతో రోగి త్వరగా మరణిస్తాడు.
- నోటిద్వారా రెసిన్‌ను తీసుకుంటే వాంతులు, విరేచనాలు అవుతాయి. కాలేయం, మూత్రపిండాలు త్వరగా పాడవుతాయి.
- ఇంజెక్షన్ ద్వారా ఇది శరీరంలోకి వెళ్తే అవయవాలన్నింటినీ త్వరగా నాశనం చేస్తుంది.

### విరుగుడే లేదు..

రెసిన్ విషానికి ఇప్పటివరకు సరైన విరుగుడే లేదని వైద్యులు తెలిపారు. శరీరంలో ఈ విషం ఉందా లేదా? అనేది నిర్ధారించటం కూడా అంత తేలిక కాదని చెబుతున్నారు. 'శరీరంలో రెసిన్‌ను గుర్తించటానికి లిక్విడ్ క్రోమటోగ్రఫీ వంటి ప్రత్యేక పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఈ పరీక్షలు ఒకేసారి ఎక్కువ మందికి నిర్వహించటం సాధ్యం కాదు. రోగికి ఉన్న లక్షణాలను బట్టి తెలుసుకోవాల్సి ఉంటుంది. శ్వాస సంబంధ లక్షణాల ద్వారా రెసిన్ దాడిని తెలుసుకోవటం కాస్త తేలిక. రెసిన్‌కు విరుగుడు లేదు. ఇతర మార్గాల ద్వారా రోగిని బ్రతికించటానికి ప్రయత్నించాల్సిందే. అది కూడా రోగి ఎలా స్పందిస్తున్నాడు అనేదానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. రెసిన్‌ను ముక్కు ద్వారా పీల్చితే త్వరగా చనిపోతారు' అని ఢిల్లీలోని గంగారామ్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ నీరజ్ త్యాగి తెలిపారు.

**రెండు రవ్వలు చాలు:** రెసిన్ కలిసిన రెండు రవ్వల ఉప్పు తిన్నా మనిషి చనిపోతాడు.

**రూపం:** రెసిన్‌ను పొడర్‌గా, తేలికగా ఆవిరయ్యే సెమీ లిక్విడ్ (పొగమంచులాగా)గా, పెల్లెట్లుగా కూడా తయారు చేయవచ్చు. ఇది నీటిలో, మామూలు యాసిడ్‌లో తేలికగా కలిసిపోతుంది.

**ఎలా పనిచేస్తుంది?:** శరీరం జీవ కణాలతో నిర్మితమై ఉంటుంది. ఆ కణాల మనుగడకు ప్రొటీన్ అవసరం. రెసిన్ శరీరంలోకి వెళ్లగానే జీవకణాల్లోకి ప్రొటీన్ వెళ్లకుండా అడ్డుకుంటుంది. దీంతో జీవకణం చనిపోతుంది. అలా శరీరంలోని ఒక్కో అవయవం పాడవుతుంది. చివరకు రెసిన్ శరీరంలోకి ప్రవేశించిన 36 నుంచి 72 గంటల్లో (విషం శరీరంలోకి ప్రవేశించే విధానాన్ని బట్టి) మనిషి మరణిస్తాడు.

### గతంలో బయటపడిన 'రెసిన్' ఘటనలు..

- 1978 సెప్టెంబర్‌లో లండన్‌లో బల్గేరియన్ తిరుగుబాటు నేత జార్జీ మార్కోవ్‌ను రెసిన్ పెల్లెట్ పేల్చి హత్యచేశారు.
- 2024 జూలైలో బ్రిటన్‌లోని సౌత్‌పోర్ట్ ప్రాంతంలో కత్తిపోట్లకు పాల్పడిన దుండగులు రెసిన్‌ను కూడా తయారుచేసేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో బయటపడింది.
- 2000 సంవత్సరం సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వచ్చిన ఒక పార్సిల్‌లో రెసిన్‌ను గుర్తించారు.
- 2018 జూన్‌లో జర్మనీలోని కలాగ్నేలో సైఫ్ అల్లాహ్ అనే ఓ ట్యునీషియా జాతీయుడు, అతడి భార్య కలిసి ఇంట్లోని వంటగదిలోనే కాఫీ గ్రైండర్ ద్వారా రెసిన్‌ను తయారుచేసేందుకు ప్రయత్నించి పోలీసులకు దొరికిపోయారు. వీరు భారీ మొత్తంలో ఆముదం గింజలను కొనటంతో అనుమానం వచ్చిన పోలీసులు.. వారి ఇంట్లో సోదాలు చేయగా విషయం బయటపడింది. వీరికి ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

## లోకం తీరు




## యూపీలో ఇద్దరు బ్రిటిష్ వైద్యుల అరెస్టు

» పత్రాలు లేకుండా అక్రమంగా నేపాల్ నుంచి ప్రవేశం

న్యూఢిల్లీ, నవంబరు 16: తగిన పత్రాలు లేకుండా దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన ఇద్దరు బ్రిటిష్ వైద్యులను ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు మహిళ కావడం గమనార్హం. నేపాల్ నుంచి అక్రమంగా వస్తుండగా బహరాయిచ్ జిల్లా రూపైదెహా సరిహద్దు వద్ద శనివారం సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ) పట్టుకొని పోలీసులకు అప్పగించింది. బ్రిటిష్ పాసుపోర్టులు ఉన్న వారిద్దరిని డాక్టర్ హస్సన్ అమ్మాన్ సలీం (35), డాక్టర్ సుమిత్ర షకీల్ ఒలీవియా (61)గా గుర్తించారు. సలీం ప్రస్తుత చిరునామా మాంచెస్టర్ కాగా, తండ్రి మహమ్మద్ సలీం పాకిస్థాన్ మూలాలు ఉన్న వ్యక్తి. అమ్మాన్ సలీం గతంలో మూడుసార్లు పాకిస్థాన్ వెళ్లినట్టు తెలిసింది. సుమిత్ర చిరునామా గ్లౌసెస్టర్ కాగా, స్వస్థలం కర్ణాటకలోని ఉడిపి. తండ్రి పేరు జాన్ ఫ్రెడరిక్. నేపాల్‌లోని నేపాల్‌గంజ్‌కు చెందిన స్థానిక ఆస్పత్రి ఆహ్వానం మేరకు అక్కడికి వచ్చినట్టు వారు చెప్పారని ఎస్ఎస్‌బీ 42వ బెటాలియన్ కమాండర్ గంగాసింగ్ ఉదావత్ తెలిపారు. వారి వద్ద భారత్ వీసా లేదని చెప్పారు. ఇటువైపు ఎందుకు వచ్చారో పత్రాలను తనిఖీ చేస్తున్న సమయంలో సంతృప్తికరమైన సమాధానం కూడా ఇవ్వలేదని చెప్పారు.

# ఢిల్లీలో కారు పేలుడుకు 'మదర్ ఆఫ్ సైతాన్'?



» అత్యంత అస్థిరమైన పేలుడు పదార్థం.. వేడి, రాపిడి, తాకిడితో పేలే స్వభావం

» టీఏటీపీకి ఉన్న ఆ అస్థిరత్వం వల్లనే ఆకస్మికంగా పేలి ఉండొచ్చని అంచనా

న్యూఢిల్లీ, నవంబరు 16: 'మదర్ ఆఫ్ సైతాన్'.. ఢిల్లీలో ఎర్రకోట వద్ద కారు పేలుడుకు ఉగ్రవాదులు ఉపయోగించిన పేలుడు పదార్థం ఇదేనా? ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారులు.. తొలుత ఈ పేలుడుకు ఉపయోగించిన 'ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) తయారీకి టెర్రరిస్టులు పెద్ద ఎత్తున అమ్మోనియం నైట్రేట్ వాడి ఉంటారని భావించారు. కానీ వారు.. 'మదర్ ఆఫ్ సైతాన్'గా పిలిచే అత్యంత అస్థిరమైన, ప్రమాదకరమైన రసాయనాల సమ్మేళనాన్ని అమ్మోనియం నైట్రేట్‌తో కలిపి వినియోగించినట్టు ఇప్పుడు భావిస్తున్నారు. దాని సాంకేతిక నామం.. ట్రైఏసిటోన్-ట్రైపెరాక్సైడ్ (టీఏటీపీ). 2-3 కిలోల అమ్మోనియం నైట్రేట్‌కు ఫ్యూయల్ ఆయిల్, ఈ టీఏటీపీని కలిపి ఈ పేలుడు పదార్థాన్ని తయారుచేశారని.. దాని బరువు 40-50 కిలోల దాకా ఉంటుందని అంచనా. పేలిపోయిన ఐ20 కారు వెనుక సీటులో ఒక పెద్ద సంచి ఉండడాన్ని దర్యాప్తు అధికారులు సీసీ టీవీ ఫుటేజీలో గుర్తించారు. అది సీటులో దాదాపు సగ భాగం మేర ఆక్రమించి ఉందని.. ఉగ్రవాదులు తయారుచేసిన ఐఈడీ ఎంత పెద్దదో చెప్పడానికి అదే సంకేతమని దర్యాప్తు అధికారులు పేర్కొంటున్నారు. కాగా.. ఆరోజు బాంబు పేలినప్పుడు దాని ప్రకంపనలు భూగర్భంలో 50 మీటర్ల వరకూ వ్యాపించాయని, కారులో ఉన్న ముగ్గురి ఉగ్రవాదుల శరీరభాగాలు సైతం 50 మీటర్ల విస్తీర్ణంలో చెల్లాచెదురుగా పడ్డాయని అధికారులు చెబుతున్నారు.

### తేలిగ్గా దొరికే రసాయనాలతోనే

టీఏటీపీకి అత్యంత అస్థిరమైన పేలుడు పదార్థంగా పేరుంది! వేడి, రాపిడి, షాక్, స్థిరవిద్యుత్తు వంటివాటికి స్పందించే టీఏటీపీని తయారుచేయడం, తరలించడం, కలపడం.. చాలా ప్రమాదకరం. అందరికీ సులువుగా దొరికే హైడ్రోజన్ పెరాక్సైడ్, ఎసిటోన్ వంటి రసాయనాలతో అత్యంత సులభంగా తయారుచేయగలిగే 'మిలటరీ గ్రేడ్' పేలుడు పదార్థమిది. ఈ టీఏటీపీ ఆధారిత పేలుడుపదార్థాలు.. ఒక టీఎన్‌టీ శక్తిలో దాదాపు 80 శాతం మేర ప్రభావం చూపుతాయని సీనియర్ భద్రతాధికారి ఒకరు తెలిపారు. కాగా.. టీఏటీపీని పేల్చడానికి ఎలాంటి డిటొనేటరూ అక్కర్లేదు. కేవలం వేడి ఎక్కువగా ఉంటే చాలు పేలిపోతుంది. కిందటి శుక్రవారం (నవంబరు 14న) శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో పేలుడుకు కారణమిదే. ఎర్రకోట వద్ద కారు పేలుడుకు కూడా ఈ సున్నితత్వమే కారణమై ఉంటుందని.. అది ఆత్మాహుతి దాడి అయ్యుండకపోవచ్చని, పేలుడు పదార్థాన్ని తరలిస్తుండగా ఆకస్మికంగా పేలిపోయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా ఇలాంటి పేలుళ్లకు కుట్ర పన్నినప్పుడు ప్రాణనష్టం మరింత ఎక్కువగా ఉండడానికి పదునైన లోహపుముక్కలు, బాల్ బేరింగ్స్ వంటివాటిని వాడుతుంటారు. ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో అలాంటివేవీ లేకపోవడం.. అది ఆకస్మిక పేలుడు అయ్యుండొచ్చన్న వాదనకు మద్దతునిస్తోందని అధికారులు గుర్తుచేస్తున్నారు. వేడి, రాపిడి, తాకిడి వంటివాటివల్ల టీఏటీపీ ప్రాథమిక పేలుడు పదార్థంగా పనిచేసి ఉండొచ్చని.. ఆక్సిడైజర్‌గా పనిచేసే అమ్మోనియం నైట్రేట్, ఫ్యూయల్ ఆయిల్ కారణంగా పేలుడు తీవ్రత బాగా పెరిగిందని వారు విశ్లేషిస్తున్నారు.

### 2015లో ఫ్రాన్స్‌లో 130 మంది మృతి

మదర్ ఆఫ్ సైతాన్ బాంబు (టీఏటీపీ)ను.. విద్రోహులు గతంలో చాలా చోట్ల పేలుళ్లకు వినియోగించారు. ఉదాహరణకు.. 2005లో లండన్‌లోని ప్రజా రవాణా వ్యవస్థనే లక్ష్యంగా చేసుకుని జరిగిన నాలుగు ఆత్మాహుతి దాడులకు ప్రధానంగా ఉపయోగించింది టీఏటీపీనే. ఆ పేలుళ్లలో 52 మంది చనిపోయారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో 2015లో జరిగిన ఆత్మాహుతి దాడులకూ వాడింది టీఏటీపీనే. ఆ పేలుళ్లలో 130 మంది ప్రాణాలు కోల్పోయారు. 2016 మార్చి నెలలో బ్రసెల్స్‌లో జరిగిన ఆత్మాహుతి దాడుల్లో 32 మరణించారు. పేలుడు వాడింది.. టీఏటీపీ. 2017 మే నెలలో ప్రముఖ సింగర్ అరియానా గ్రాండే ఈవెంట్‌లో పేలుడుకు సూసైడ్ బాంబర్ వినియోగించింది టీఏటీపీ ఐఈడీ. ఆ పేలుడు కారణంగా 22 మంది చనిపోయారు.

# యూపీ విపక్షానికి 'బిహార్' ఫీవర్!

» ఎన్డీయే విజయం, బీజేపీ స్ట్రాటజీపై ఉత్తరప్రదేశ్ ప్రతిపక్షాల్లో గుబులు

» ఇండియా కూటమి భవితపై చర్చ

» 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు



లఖ్‌నవూ, నవంబరు 16: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్(యూపీ)లో చర్చ మొదలైంది. 2027లో యూపీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రాజకీయంగా ఈ ఎన్నికలు ప్రతిపక్షాలకు అత్యంత కీలకంగా మారాయి. దీంతో బిహార్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి అనుసరించిన విధానాలను యూపీలో కూడా అనుసరిస్తే ఏమేరకు విజయం దక్కుతుందన్నది సందేహంగా మారింది. మరీ ముఖ్యంగా 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో యూపీలో విపక్షాలు భారీగా లబ్ధి పొందాయి. అయితే.. ఇప్పుడు బిహార్ ఫలితం తర్వాత.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ తరహా విజయం.. ప్రజల ఆదరణ లభించేనా అన్నది కీలకంగా మారింది. ఇక, బిహార్ ఫలితం యూపీ అధికార పార్టీ బీజేపీలో మరింత ఉత్సాహాన్ని నింపగా అదేసమయంలో విపక్ష శిబిరంలో మాత్రం అనేక సందేహాలు, వ్యూహాత్మక నిర్ణయాలపై సమీక్ష, కూటమి నేతల్లో అనుమానాలను రాజేసింది. ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై చేసిన తీవ్ర వ్యాఖ్యలు కూడా చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ పార్టీని ముస్లిం లీగ్‌తో పోల్చడమే కాకుండా మావోయిస్టు పార్టీ అని సంబోధించారు. అంతేకాదు.. కాంగ్రెస్ ఇక, చీలికలు పేలికలుగా మారుతుందన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించే కాకుండా యూపీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోదీ చాలా వ్యూహాత్మకంగా చేసిన వ్యాఖ్యలేనని పరిశీలకులు చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలపై యూపీలో తీవ్ర చర్చ సాగుతోందని అంటున్నారు. యూపీ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య స్పందిస్తూ.. "మగధ తర్వాత ఇప్పుడు అవధ్." అంటూ.. బిహార్ తరహా విజయాన్నే యూపీలోనూ సొంతం చేసుకుంటామని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. అంతేకాదు, బిహార్‌లో బీజేపీ అనుసరించిన వ్యూహాన్నే యూపీలోనూ అనుసరించనున్నట్టు చెప్పారు. యూపీ విపక్షం సమాజ్ వాదీపార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్.. బిహార్ ఫలితంపై స్పందిస్తూ.. బీజేపీపై విమర్శలు గుప్పించారు. "బీజేపీ.. రాజకీయ పార్టీకాదు. రాజకీయ మోసకారి" అని వ్యాఖ్యానించారు. అయితే, ఇదేసమయంలో బీజేపీ అనుసరించిన ఎన్నికల వ్యూహాలను ప్రతిపక్షాలు కూడా నేర్చుకోవాలని పేర్కొనడం విశేషం.

### ఎస్పీ-కాంగ్రెస్ బంధం కొనసాగేనా

2024 పార్లమెంటు ఎన్నికల్లో యూపీలోని 80 లోక్‌సభ స్థానాల్లో ఎస్పీ-కాంగ్రెస్‌ల కూటమి 43 స్థానాలను దక్కించుకుంది. అయితే..ఇప్పుడు బిహార్ ఎన్నికల అనంతరం.. ఈ రెండు పార్టీలు 2027 వరకు కలిసే కొనసాగుతాయా? అనే సందేహాలు తెరమీదకి వచ్చాయి. ఈ రెండు పార్టీలూ పైకి 'అంతా బాగానే ఉంది.' అని వ్యాఖ్యానిస్తున్నా రాజకీయాలు మాత్రం ఆవిధంగా లేదన్నది విశ్లేషకుల మాట. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత అఖిలేశ్ యాదవ్, రాహుల్‌గాంధీల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. నాటి పరిణామాలను రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

### రేపు ఏఐసీసీ ఇన్‌చార్జుల భేటీ

న్యూఢిల్లీ, నవంబరు 15: 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)ల్లో ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై చర్చించడానికి కాంగ్రెస్ పార్టీ ఆయా రాష్ట్రాల ఏఐసీసీ ఇన్‌చార్జులు/ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసింది. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఈ భేటీ జరుగుతుంది. బిహార్ ఫలితాలపైనా ఈ సందర్భంగా సమీక్షిస్తారు. కాగా.. తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గోవా, గుజరాత్, రాజస్థాన్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీవుల్లో ఇప్పటివరకు 48.67 కోట్ల 'సర్' ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశామని కమిషన్ ప్రకటించింది. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, బెంగాల్లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

# బిహార్ సీఎంగా నితీశే!

» 19 లేదా 20న ప్రమాణ స్వీకారం

» మంత్రివర్గ ఫార్ములా కూడా ఖరారు!

» బీజేపీకి 15-16; జేడీయూకు 14 పదవులు



నితీశ్‌కు డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, నవంబరు 16: బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమారే కొనసాగుతారా? మరోసారి ఆయనే సీఎంగా బాధ్యతలు చేపడతారా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. ఈ నెల 19 లేదా 20న బిహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుందని చెబుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో జరిగిన సమావేశంలో బిహార్ మంత్రివర్గ ఫార్ములాను ఖరారు చేసినట్లు సమాచారం. నితీశ్‌నే సీఎంగా కొనసాగించాలని ఆ భేటీలో నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గంలో సింహభాగం పదవులు బీజేపీకే దక్కనున్నట్లు తెలుస్తోంది. 15-16 పదవులు కాషాయ పార్టీకి, 14 పదవులు జేడీయూకు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ పార్టీ ఎల్జేపీకి మూడు, మరో కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝి పార్టీ హిందుస్థానీ అవామ్ మోర్చా(హెచ్ఏఎం)కు ఒకటి, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం)కు ఒకటి చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.

### ఇదీ ప్రక్రియ..

బిహార్‌లో 18వ అసెంబ్లీ ఏర్పాటుకు సంబంధించి ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాలను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు వివరిస్తారు. సోమవారం నితీశ్‌కుమార్ క్యాబినెట్ సమావేశం నిర్వహిస్తారు. 17వ శాసనసభను రద్దు చేస్తూ తీర్మానం ఆమోదిస్తారు. అనంతరం ఆయన తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. కూటమి నేతలు సమావేశమై ఎన్డీయే శాసనసభాపక్ష నేతను ఎన్నుకుంటారు. బుధ లేదా గురువారం సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని భావిస్తున్నారు. ప్రధాన మంత్రి మోదీ షెడ్యూల్‌ను బట్టి ప్రమాణ స్వీకార తేదీని ఖరారు చేయనున్నారు. నితీశ్ పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణం చేయనుండడం విశేషం. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరుకానున్నారు.

# ప్రపంచబ్యాంకు రుణంతో ఓట్ల కొనుగోలు

» 1.25 కోట్ల మంది మహిళలకు రూ.14 వేల కోట్లు పంచిపెట్టారు

» నితీశ్ ప్రభుత్వ 'మహిళలకు 10 వేలు' పథకంపై జన్‌సురాజ్‌పార్టీ ఆరోపణలు

పట్నా, నవంబరు 16: బిహార్ ఎన్నికల వేళ 'ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకం' కింద మహిళలకు రూ.10 వేల చొప్పున నితీశ్ కుమార్ ప్రభుత్వం జరిపిన పంపకాలపై ప్రశాంత్‌కిశోర్‌కు చెందిన జన్‌సురాజ్‌పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. ప్రపంచబ్యాంకు నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణం నుంచి ఈ మొత్తాన్ని పంచారని, ఇది రూ.14,000 కోట్లకు సమానమని పేర్కొంది. పార్టీ జాతీయాధ్యక్షుడు ఉదయ్‌సింగ్ విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 'అసెంబ్లీ ఎన్నికల ఫలితాన్ని డబ్బులిచ్చి కొనుగోలు చేశారు. జూన్ 21వ తేదీ నుంచి పోలింగ్ ప్రారంభమయ్యే తేదీ వరకూ దాదాపు రూ.14 వేల కోట్లు పంచిపెట్టారు. ప్రభుత్వధనం ఖర్చు చేసి ఓట్లు కొన్నారు. ప్రపంచ బ్యాంకు నుంచి ఈ డబ్బులు తీసుకున్నట్లు సమాచారం ఉంది' అని తెలిపారు. దీనిపై పూర్తి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. జన్‌సురాజ్‌పార్టీ అధికారప్రతినిధి పవన్‌వర్మ కూడా ఈ అంశంపై మాట్లాడుతూ.. వేరే ప్రాజెక్టు కోసం ప్రపంచబ్యాంకు నుంచి తీసుకున్న రూ.21 వేల కోట్ల నుంచి ఒక కోటీ 25 లక్షల మంది మహిళలకు రూ.10 వేల చొప్పున పంచారని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావటానికి కేవలం గంట ముందు ఈ తాయిలాల పంపిణీ మొదలైందని ఆరోపించారు. మొత్తంగా రూ.14 వేల కోట్లు పంచిపెట్టారని, ఖజానా ఖాళీ అయిపోయినట్లు తెలిసిందన్నారు.

# మాకు రక్షణ ఏదీ?

- మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినుల ఆందోళన
- ప్రహరీ లేదు.. బాత్‌రూంలకు తలుపుల్లేవు
- రాత్రి హాస్టల్ ఎదుట రోడ్డుపై బైఠాయింపు
- అదే సమయంలో ఆకతాయిల బెదిరింపులు
- డీఈవో విచారణ.. ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్


మోడల్ స్కూల్ ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

వెంకటాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ మోడల్ స్కూల్ విద్యార్థినులు శనివారం రాత్రి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో అనేక సమస్యలున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, సమస్యలను చెబితే సిబ్బంది అసభ్యకరంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలు రాత్రివేళల్లో హాస్టల్ ప్రాంగణంలోకి చొరబడి ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. బాత్‌రూంలకు తలుపులు, మంచాలు లేవని తెలిపారు. ఈ హాస్టల్‌లో 50 మంది విద్యార్థినులు ఉంటున్నారు. సుమారు 30 మంది శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో హాస్టల్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. మిగతా 20 మంది హాస్టల్‌లోనే ఉండి చదువుకుంటున్నారు. ఈ క్రమంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు హాస్టల్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని హల్‌చల్ చేశారు. 'మీ ఎస్‌వో మమ్మల్ని పంపింది. డోర్ తీయండ'ని గద్దించారు. 'వీళ్లు డోర్ తీస్తలేరు.. గన్స్ తీయండిరా వీళ్ల సంగతి చూద్దామ'ని బెదిరించారు. లోపలున్న విద్యార్థినులు కేకలు వేయగా ధర్నా చేస్తున్న విద్యార్థినులు రావడంతో ఆ వ్యక్తులు పారిపోయారు. హాస్టల్‌లో సమస్యలపై నిరసనకు దిగిన తమను గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించడంపై విద్యార్థినులు ఆదివారం కూడా హాస్టల్ ఎదుట బైఠాయించారు. 'హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళల్లో అనేకసార్లు ఆకతాయిలు వచ్చి తలుపులు కొడుతున్నారు. మాకు రక్షణ కల్పించండ'ని విద్యార్థినులు కోరారు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. గతంలో కంప్యూటర్, ఫర్నిచర్ ఎత్తుకెళ్లిన ఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. వారి ఆందోళనతో ఇన్‌చార్జి డీఈవో సిద్ధార్థ రెడ్డి, తహసీల్దార్ గిరిబాబు వచ్చి హాస్టల్‌ను పరిశీలించి, విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత, హాస్టల్ పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్, ఇతర మౌలిక వసతులపై సమీక్షించారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందున కేర్‌టేకర్ ఏ.కవిత, ఏఎన్ఎం జ్యోతి, వాచ్‌మెన్ టీ అంజలిని సస్పెండ్ చేశారు. హాస్టల్‌లో సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. 'లైటింగ్ పునరుద్ధరణ పనులను ప్రారంభించాం. సోమవారం బాత్‌రూం డోర్లు, గీజర్లు ఏర్పాటు చేయిస్తాం. హాస్టల్ ఎస్‌వోపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామ'ని చెప్పారు.


నిడిగొండ వద్ద లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరు ప్రయాణికుల మృతి.. ఆరుగురికి గాయాలు
- జనగామ జిల్లా నిడిగొండ వద్ద ప్రమాదం

రఘునాథపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):జనగామ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మరమ్మతుకు గురై రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఓ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సులోని ఇద్దరు ప్రయాణికులు మరణించగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద వరంగల్ -హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వెళ్తున్న ఓ లారీ మరమ్మతుకు గురై నిడిగొండ వంతెన దిగిన తర్వాత బస్టాండ్ సమీపంలో నిలిచిపోయింది. లారీ ఆగిపోయిన కొద్ది నిమిషాల వ్యవధిలో హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు 16మంది ప్రయాణికులతో ఆర్టీసీ రాజధాని బస్సు అటుగా వచ్చింది. అతివేగంతో వచ్చిన ఆ బస్సు రోడ్డు మీద ఆగి ఉన్న ఇసుక లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగంలో కూర్చొని ఉన్న హైదరాబాద్ దోమలగూడకు చెందిన పూలమాటి ఓంప్రకాష్ (75), హన్మకొండ బాలసముద్రంకు చెందిన నవజీత్ సింగ్(52) ప్రాణాలు కోల్పోయారు.గుర్రపు రవికిరణ్, గుర్రపు స్వరాజ్యలక్ష్మి, నంద కిషోర్, మురళీకృష్ణ, హర్షవర్ధన్, మరో ప్రయాణికుడు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వాహనాన్ని రోడ్డు మీదే నిలిపేసిన లారీ డ్రైవర్, అతి వేగంతో ఆర్టీసీ బస్సును నడిపిన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

# చిన్న గుడ్డు.. పెద్ద మోసం!

### అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, హాస్టళ్లకు గుడ్ల సరఫరాలో కాంట్రాక్టర్ల కక్కుర్తి

- గుడ్డు బరువు 45-52 గ్రాములుండాలని నిబంధన
- ఆయా కేంద్రాలకు చేరుతున్నవి 30-40 గ్రాముల్లోపే
- తక్కువ ధరకు కొనుగోళ్లు
- నెలలో 3 సార్లు రవాణా చేయాల్సి ఉండగా.. ఒకటి, రెండుసార్లతో సరిపెడుతున్న కాంట్రాక్టర్లు
- ఎక్కువ రోజులు నిల్వ ఉండి పోవడంతో కుళ్లిపోతున్న గుడ్లు


సికింద్రాబాద్‌లోని ఈస్ట్‌మారేడుపల్లిలోని ఓ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుళ్లిపోయిన గుడ్లు

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, హాస్టల్ విద్యార్థులకు అందించే గుడ్లలోనూ కాంట్రాక్టర్లు కక్కుర్తి చూపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తక్కువ బరువు కలిగిన గుడ్లు సరఫరా చేస్తూ మోసానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు సరఫరా చేయాల్సిన గుడ్డు బరువు 45-52 గ్రాములు ఉండాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే గుడ్డు బరువు 30-40గ్రాములు మించట్లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా 5.38కోట్ల గుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. గతానికి భిన్నంగా ఈ సారి జిల్లా కొనుగోలు కమిటీల(డీపీసీ) ఆధ్వర్యంలో ఏకీకృత టెండర్లు నిర్వహించగా.. ప్రతి జిల్లాలో ఒక కాంట్రాక్టరే అన్ని ప్రభుత్వ సంస్థలకు గుడ్లు అందిస్తున్నారు. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5.50-రూ.6.30 చెల్లిస్తున్నా.. నిర్ణీత నిబంధనలు పాటించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

#### ఇది చిన్న గుడ్డు కథాకమామీషు..

కోడి గుడ్డులో చిన్నది, పెద్దది అనే తేడా ఏంటి? కాంట్రాక్టర్లు చిన్న గుడ్లనే మాత్రమే ఎలా సేకరిస్తున్నారు? అంటే.. దీని వెనుక పెద్ద తతంగమే సాగుతోందన్న సమాధానం వస్తోంది. సాధారణంగా కోళ్లకు అందించే దాణా, వాటి రకాన్ని బట్టి 18-20 వారాల్లో గుడ్డు పెట్టే దశ మొదలవుతుంది. కోడి జీవిత కాలం 100వారాలనుకుంటే.. 500 రోజుల పైగా గుడ్లు పెడుతుంది. 23-25 వారాల వయస్సున్న కోళ్లు పెట్టే గుడ్డు బరువు 30-40 గ్రాముల లోపే ఉంటుంది. ఇలా ప్రతి కోడి దాదాపు 35 నుంచి 40 రోజుల పాటు చిన్నసైజులో ఉండే గుడ్లను పెడతాయి. పౌల్ట్రీ పరిభాషలో వీటిని బుల్లెట్ గుడ్లుగా వ్యవహరిస్తారు. సాధారణ గుడ్డుతో పోల్చితే.. వీటి(ప్రీమెచ్యూర్‌ఎగ్)లో పోషకాలు తక్కువగా ఉంటాయి. కోడి పెరుగుతున్న కొద్దీ గుడ్డు బరువు 50-60 గ్రాములకు చేరుతుంది. డిమాండ్ దృష్ట్యా వీటిని ఢిల్లీ, ముంబైతోపాటు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్‌లో అంతగా డిమాండ్ లేని చిన్న సైజు గుడ్లను కాంట్రాక్టర్లు తక్కువ ధరకు సేకరించి.. గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లకు తరలిస్తున్నారు. జీవో ఎంఎస్ నంబర్ 16లో ప్రభుత్వం కచ్చితమైన మార్గదర్శకాలను పేర్కొన్నా.. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు. కొన్నిచోట్ల అధికారులు అభ్యంతరం చెప్పినా.. బడా కాంట్రాక్టర్లు వారి మాటలు పెడచెవిన పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాదు.. ప్రతి పది రోజులకు ఒకసారి చొప్పున నెలలో మూడు సార్లు ఆయా కేంద్రాలకు గుడ్లను సరఫరా చేయాల్సి ఉండగా.. ఆ నిబంధనకూ కాంట్రాక్టర్లు తూట్లు పొడుస్తున్నారు. రవాణా ఖర్చు తగ్గించుకోవడానికి ప్రతి నెలా ఒకటి, రెండు విడతల్లోనే గుడ్లు సరఫరా చేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో విద్యార్థులకు అందించే సమయానికి కొన్ని గుడ్లు పాడైపోతున్నాయి. దీంతో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారు. వాస్తవానికి అగ్‌మార్క్ ఉన్న గుడ్లనే సరఫరా చేయాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. గుడ్ల బరువు, నాణ్యతను తనిఖీ చేయాల్సిన మహిళా శిశు సంక్షేమ శాఖ, గురుకులాల సొసైటీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

#### చర్యలు తీసుకుంటాం

చిన్న సైజు, పాడైపోయిన గుడ్లను సరఫరా చేసే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మహిళాశిశు సంక్షేమశాఖ కమిషనర్ శృతి ఓజా తెలిపారు. అన్ని చోట్ల తనిఖీలు చేపట్టాలని.. ఇప్పటికే అధికారులను ఆదేశించామని వెల్లడించారు. వారిచ్చే నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా, నెలలో రెండు సార్లు మాత్రమే గుడ్లను సరఫరా చేస్తామని కాంట్రాక్టర్లు తమ దృష్టికి తెచ్చారని.. రానున్న రోజుల్లో మూడు సార్లు పంపేలా చర్యలు తీసుకుంటామని జేడీ అక్కేశ్వర్‌రావు తెలిపారు.


యాదగిరిగుట్ట ప్రధానాలయ తిరువీధుల్లో భక్తుల రద్దీ

## భక్తులతో కిక్కిరిసిన యాదగిరి క్షేత్రం

- ఖజానాకు రూ.1.04కోట్ల ఆదాయం

యాదగిరిగుట్ట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవు కావటంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. 1,06,700మంది భక్తులు నృసింహుడిని దర్శించుకున్నారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మ దర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.1,04,52,688 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. 1,862మంది దంపతులు సత్యదేవుని వ్రతాలు చేయించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

## రేపు శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల లక్కీడిప్ కోటాను టీటీడీ మంగళవారం ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలను విడుదల చేస్తారు. భక్తులు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు.

● 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన టికెట్లనూ జారీ చేయనున్నారు. ● 24వ తేదీన ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణిట్రస్టు టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగుల టోకెన్లు విడుదల చేస్తారు. ● 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదుల కోటాను జారీ చేస్తారు. భక్తులు వీటిని 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు.

## శ్రీవారి సేవలో జస్టిస్ సూర్యకాంత్


శ్రీవారి ఆలయం ముందు తదుపరి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు

తిరుమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి పద్మావతి అతిథిగృహంలో బసచేసిన ఆయన.. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మహద్వారం వద్దకు చేరుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కిన జస్టిస్ సూర్యకాంత్.. తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనకు ఆశీర్వచనాలు చేశారు. చైర్మన్, ఈవో, అదనపు ఈవో ఆయనకు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

## వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కారు దూసుకెళ్లిన ఘటనలో కానిస్టేబుల్ మృతి

- పోలీస్ కుటుంబం ఓ సోదరుడిని కోల్పోయింది: ఎస్పీ నర్సింహ


కమలాకర్ (ఫైల్)

నాగారం, సూర్యాపేట క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలను తనిఖీ చేస్తుండగా కారు దూసుకెళ్లిన ఘటనలో సూర్యాపేట జిల్లా నాగారం కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. నాగారం మండలం నాగారం బంగ్లా గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారు వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కానిస్టేబుల్ శీలం కమలాకర్ (34), ఏఆర్ కానిస్టేబుల్ పెరుమాళ్ల అశోక్ తీవ్రంగా గాయపడగా, ఓ యూట్యూబ్ చానల్ రిపోర్టర్ సునీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కమలాకర్‌ను హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. కమలాకర్ స్వస్థలం కోదాడ మండలం గుడిబండ. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. అశోక్, సునీల్‌లు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీఐ తెలిపారు. కారు ఆచూకీ కోసం అయిదు బృందాలతో గాలిస్తున్నట్లు చెప్పారు. విధి నిర్వహణలో కానిస్టేబుల్ మృతి చెందడం బాధాకరమని ఎస్పీ కొత్తపల్లి నరసింహ అన్నారు. ఆదివారం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కానిస్టేబుల్ కమలాకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## పుట్టపర్తికి ఆధ్యాత్మిక శోభ

- వేడుకగా సాగుతున్న సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

పుట్టపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ప్రశాంతి నిలయంతోపాటు ప్రధాన వీధుల్లో ప్రత్యేక స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్‌లో రోజూ సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిత్రావతి నదిలో ఏర్పాటు చేసిన లేజర్‌షో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆదివారం సాయికుల్వంత్ మందిరంలో ప్రముఖ సంగీత విద్వాంసులు ఉస్తాద్ అలీఖాన్, అమాన్ అలీ బంగాష్ బృందం సరోద్ వాయిద్యంతో భక్తులను అలరింపజేశారు. వేడుకల నాలుగోరోజు ఆదివారం భక్తులకు పెద్దఎత్తున నారాయణ సేవ(అన్నదానం) చేశారు.


స్వశక్తి చీర డిజైన్ ఖరారు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు(ఫైల్)

## 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీకి సర్వం సిద్ధం

- 67లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండేసి చీరలు
- ఇందిరాగాంధీ జయంతి రోజున ముహూర్తం
- ఇప్పటికే జిల్లాల్లోని గోదాములకు సరఫరా

సిరిసిల్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మహిళా శక్తి పథకం కింద రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈనెల 19న ఇందిరాగాంధీ జయంతి రోజున 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళకు రెండేసీ చీరలను అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే అన్ని జిల్లాల గోదాములకు చీరలు చేరుకున్నాయి. ఇందుకు సంబంధించిన డిజైన్లను చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో టెస్కో రూపొందించింది. వాటి ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. నాణ్యమైన చీరలను అందించే దిశగా పలు చర్యలు తీసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి సిరిసిల్ల నేతన్నలకు ఉపాధినిచ్చాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చీరల్లో నాణ్యత లేదన్న కారణంతో వాటి పంపిణీ నిలిపివేసింది. దీంతో వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోయింది. నేతన్నల ఆత్మహత్యలు, ఆందోళనలు వంటి పాత పరిస్థితులు పునరావృతం అవుతాయన్న ఆందోళన నేపథ్యంలో.. బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

#### మరమగ్గాల కార్మికులకు చేతి నిండా పని...

స్వశక్తి మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా, సిరిసిల్లలో మరమగ్గాలు ఎక్కువగా ఉండడంతో అక్కడి వస్త్ర పరిశ్రమకే ప్రభుత్వం ఎక్కువ ఆర్డర్లు ఇచ్చింది. దీంతో సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఉపాధి భరోసానిస్తున్నాయి. గతంలో జీవనోపాధి కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లిన అనేక మంది కార్మికులు ఇప్పుడు గ్రామాల్లోనే చేతి వృత్తిలో నిమగ్నమయ్యారు. దీంతో మరమగ్గాల చప్పుళ్లు మొదలయ్యి, నేతన్నలకు చేతినిండా పని దొరికింది. జిల్లాలో జియో ట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(మ్యాక్స్)ల ద్వారా 9,600 మరమగ్గాలపైన 1.3 కోట్ల చీరల ఉత్పత్తి కొనసాగుతోంది. మొదట్లో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో చీరల ఉత్పత్తి వేగంగా జరగలేదు. క్రమంగా లక్ష్యం దిశగా.. వేగాన్ని పెంచడంతో చివరకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. మొత్తం 4.30కోట్ల మీటర్ల మేర వస్త్రం అవసరమవుతుందని అధికారులు అంచనా వేయగా, ఇప్పటికే 3.2 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తిని పూర్తి చేసి చివరి దశకు చేరుకున్నారు.

# 'ఐ బొమ్మ' క్లోజ్

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. కాగా, రవిపై నమోదైన తీవ్ర నేరం దృష్ట్యా అతనికి ఇప్పట్లో బెయిల్ వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.

#### ఐ బొమ్మలో ఐ అంటే ఇమ్మడి

ఏపీలోని విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి తన ఇంటి పేరులోని మొదటి అక్షరం ఐ ని తీసుకొని ఐ బొమ్మ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించాడు. ముంబైలో ఎంబీఏ పూర్తి చేసిన ఇమ్మడి రవి.. రెండు ఐటీ సంస్థలకు సీఈవోగా పని చేశాడు. కొన్నేళ్లకు ఆ ఉద్యోగం మానేసి నేరాల బాటపట్టాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లాడిన రవి.. ఐదేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లి ఐబొమ్మ కార్యకలాపాలు మొదలు పెట్టాడు. కొత్త సినిమాని విడుదలైన రోజే దొంగచాటుగా థియేటర్లలో వీడియో తీయించడం, వాటిని వెంటనే ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం చేస్తుండేవాడు. అలాగే ఓటీటీలో విడుదలైన సినిమాలను కూడా హెచ్‌డీ ప్రింట్‌తో ఐబొమ్మలో అప్‌లోడ్ చేసేవాడు. ఐబొమ్మ దెబ్బకు సినీ నిర్మాతలు, ఓటీటీ సంస్థలు తీవ్రంగా నష్టపోయేవి. ఈ క్రమంలో సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తుల మేరకు ఐబొమ్మపై తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. దీంతో మమ్మల్ని ఆపలేరు, వెతకలేరు అంటూ పోలీసులను సవాలు చేస్తూ ఐబొమ్మ వెబ్‌సైట్‌లో రెండేళ్ల క్రితం ఓ పోస్టు ప్రత్యక్షమైంది. ఈ పోస్టు సోషల్ మీడియాలో దుమారమే రేపగా.. కేసును పోలీసులు మరింత సవాలుగా తీసుకున్నారు. అయితే, పోలీసు నిఘా పెరగడంతో తెలివి ప్రదర్శించిన రవి బప్పం టీవీ పేరిట మరో ఖాతా ప్రారంభించి కొంతకాలంగా అందులో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేస్తున్నాడు. ఐబొమ్మ నిర్వాహకులను ఎలాగైనా పట్టుకుంటామని మూడు నెలల క్రితం అప్పటి హైదరాబాద్ సీపీ ఆనంద్ కూడా ప్రకటించారు. ఈ క్రమంలో నెదర్లాండ్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇమ్మడి రవిని.. కూకట్‌పల్లిలోని అతడి నివాసంలోనే అరెస్టు చేసిన పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. కాగా, కూకట్‌పల్లిలోని రెయిన్‌బో విస్టా ఫేజ్-2 అపార్ట్‌మెంట్‌లో రవికి ఓ ఫ్లాట్ ఉందని పోలీసులు గుర్తించారు. రవి అప్పుడప్పుడు అక్కడికి వచ్చి వెళుతుంటాడని, రవికి సంబంధించిన ఇతర వివరాలు తమకు తెలియని ఆ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు తెలిపారు.

#### ఎందుకు ఇలా చేశాడో తెలియదు

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి తండ్రి ఇమ్మడి అప్పారావు విశాఖపట్నంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రవి ఎందుకు ఇలా చేశాడో తమకు తెలియదని చెప్పారు. రవి రాంగ్ రూట్‌లో వెళ్లాడని, ఆ సంగతిని ఇక పోలీసులే చూసుకుంటారని పేర్కొన్నారు. తాము చూసిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరించిన రవి.. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని చెప్పారు. కొన్నాళ్లకు ఆమె నుంచి విడాకులు తీసుకున్నాడని తెలిపారు.

# ఆ 'గంట'లో ఏం జరిగింది?

### గుంతకల్లు నుంచి కోమలి వరకు ప్రయాణించిన సమయమే కీలకం

- ఆ దిశగానే సీఐ సతీశ్ కేసు దర్యాప్తు


పత్తికొండలో కొవొత్తుల ర్యాలీ చేస్తున్న సతీశ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు

అనంతపురం క్రైం/పత్తికొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతిపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సతీశ్ కుమార్ మరణం మిస్టరీగా మారిన నేపథ్యంలో 72 గంటలుగా అనంతపురం జిల్లా పోలీసులు ఈ కేసుపైనే కసరత్తు చేస్తున్నారు. ఆదివారం ఘటనా స్థలం అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమలి గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. మూడు బొమ్మలను ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి తోసేసి.. అవి ఎక్కడ పడ్డాయి?. ఎంత దూరంలో పడిపోయాయనే విషయాలను పరిశీలించారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో రెండున్నర గంటలపాటు ఘటనా స్థలంలో దర్యాప్తు చేశారు. చెన్నై-ఎగ్మోర్ ట్రైన్ నుంచి సతీశ్ కుమార్ బరువుతో ఉన్న మూడు బొమ్మలను కిందకు తోసేశారు. ఆ సీన్ మొత్తాన్ని డ్రోన్ కెమెరాలతో రికార్డు చేశారు. సీఐ సతీశ్ ప్రయాణించిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని పలు బోగీల్లో పాత నేరస్తులు, పలు కేసుల్లో సాక్షులుగా ఉన్నవారు ప్రయాణించినట్లు పోలీసులు గుర్తించారు. సుమారు 13 మంది పలు కేసులున్న నేరస్తులు వారిలో ఉన్నట్టు తేల్చారు. ఏ-1 బోగీలో ముగ్గురు, ఎస్-4లో ఒకరు, ఎస్-5లో ఇద్దరు, ఎస్-6లో ఇద్దరు, ఎస్-7లో ఇద్దరు, బీ-1లో ఒకరు, బీ-5లో ఒకరు, బీ-6లో ఒకరు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా, ఈ కేసు చిక్కుముడి వీడాలంటే.. సతీశ్ కుమార్ గుంతకల్లు నుంచి కోమలి వరకు ప్రయాణించిన 'గంటే' కీలకమని పోలీసులు భావిస్తున్నారు. ఆ సమయంలో ఏం జరిగిందో తేల్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జూటూరు, కోమలి మధ్యనే ఆయన విగతజీవిగా మారారు. గంట సమయంలో ట్రైన్‌లో ఏం జరిగిందన్న దానిపై దృష్టి సారిస్తే.. కొంత వరకు సతీశ్ మరణానికి సంబంధించి 'కీలక సమాచారం లభించే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు వేగవంతం చేశారు.

#### సతీశ్‌ది ముమ్మాటికీ హత్యే: సోదరులు

సీఐ సతీశ్ కుమార్‌ది హత్యేనని ఆయన సోదరులు ఆరోపించారు. సతీశ్‌కుమార్‌కు నివాళులు అర్పిస్తూ ఆదివారం కర్నూలు జిల్లా పత్తికొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలి వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. కొందరు కావాలనే ఆత్మహత్య అని ప్రచారం చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణచేసి నిందితులను గుర్తించాలని డిమాండ్ చేశారు.

# వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

### రెండు రోజుల సాహిత్య ఉత్సవం

మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీల్లో ఉ.9 నుండి రా.9గం.లవరకు జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతాయి. ముఖ్యఅతిథి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ. కందుల దుర్గేష్ ప్రారంభిస్తారు. మండలి బుద్ధప్రసాద్. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, పాపినేని శివశంకర్, డీ. మునిరత్నం నాయుడు, ఆర్.డి. విల్సన్ అతిథులుగా వస్తారు. జి. లక్ష్మీనరసయ్య, ఖాదర్ మొహియుద్దీన్, చల్లపల్లి స్వరూపరాణి, జి.వి. రత్నాకర్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 92464 15150.

కలిమిశ్రీ

### సప్పా ఎక్సలెన్స్ అవార్డు

నాట్య గురువు సప్పా దుర్గా ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ప్రతీ ఏటా ఇచ్చే సప్పా ఎక్సలెన్స్ అవార్డు 2025 కోసం సాహిత్య విభాగంలో శిఖామణి ఎంపిక అయ్యారు. నవంబర్ 23 ఉదయం రాజమహేంద్రవరంలో అవార్డుల ప్రదాన సభ ఉంటుంది. ఈ అవార్డుకు సంగీత, సాహిత్య, కళా, సామాజిక తదితర రంగాలలో వంశీ రామరాజు, ఆర్. మల్లికార్జున రావు, పొత్తూరి సుబ్బారావు, హేమసుందర్ ఎంపికయ్యారు.

నటరాజ నృత్య నికేతనం

### తిరుమల రామచంద్రపై ప్రసంగం

రాజాం రచయితల వేదిక 130వ సమావేశం నవంబరు 23 ఉ.10గంటల నుంచి విజయనగరం జిల్లా, రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. సమావేశంలో 'హంపి నుండి హరప్పా దాకా – తిరుమల రామచంద్ర జీవన పోరాటం' అంశంపై పొట్నూరు కోటిబాబు ప్రసంగిస్తారు. అధ్యక్షత నల్ల రవికుమార్. వివరాలకు: 98857 58123.

గార రంగనాథం

### గురజాడ విశిష్ట పురస్కారం

గురజాడ సాంస్కృతిక సమాఖ్య సంస్థ, విజయనగరం శాఖ నిర్వహించిన కవితల పోటీలో విజేతలుగా నిలిచిన ఐదుగురు: పోతూరి సీతారామరాజు, గంగవరపు సునీత, మహమ్మద్ అప్సర వలిషా, ఇనపకుర్తి చినసత్యనారాయణ, చళ్లపిళ్ల శ్యామల. నవంబర్ 30న జరిగే సభలో వీరికి న్యాయమూర్తి మానవేంద్ర రాయ్ చేతుల మీదుగా రెండువేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేయబడతాయి. ఈ ఏడాది గురజాడ విశిష్ట పురస్కారాన్ని కొలకలూరి ఇనాక్ స్వీకరిస్తారు.

ఎం. వెంకటేశ్వరరావు

### ఎమ్మెస్సార్ కథల పోటీ

మలిశెట్టి సీతారామ్ స్మారకార్థం నిర్వహిస్తున్న కథల పోటీకి ఔత్సాహిక రచయితల నుండి కథలకు ఆహ్వానం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3 వేలు, రూ.2వేలు. ఎంపిక చేసిన కథలతో 'కథా ప్రపంచం 2025' పుస్తకం వస్తుంది. కథల పోటీ వివరాలకు ఫోన్: 93947 82540, వాట్సాప్: 9985013234. కథలను నవంబరు 30లోపు ఈమెయిల్: msrtelugusahityam@gmail.comకు పంపాలి. అలాగే ఒక సీనియర్ సాహితీవేత్తకు మలిశెట్టి సీతారామ్ స్మారక జీవన సాఫల్య సాహితీ పురస్కారం (రూ.11,116/–), మరొక సాహితీ వేత్తకు మలిశెట్టి సీతారామ్ స్మారక వార్షిక సాహితీ పురస్కారం (రూ.10వేలు) అందజేస్తాం.

మలిశెట్టి శ్యాం ప్రసాద్

### కవిత్వ సంపుటాలకు ఆహ్వానం

వట్టికోట ఆళ్వారు స్వామి సాహిత్య కళా పీఠం ఆధ్వర్యంలో తుల యాదయ్య స్మారక జాతీయ పురస్కారం 2025 కొరకు కవిత్వ సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. సాహిత్యకారులకు రూ.6116/– నగదుతో జీవన సాఫల్య పురస్కారంతోపాటు; 2024లో ప్రచురితమైన కవిత్వ సంపుటాలలో ఎంపికైన సంపుటికి రూ.5116/– నగదుతో పురస్కారం అందజేస్తాం. ప్రోత్సాహకంగా ఒక యువ కవి కవిత్వ సంపుటికి రూ.2116/– నగదుతో పురస్కారం ఇస్తాం. మీ కవిత్వ సంపుటాలను డిసెంబర్ 31లోగా చిరునామా: తుల శ్రీనివాస్ ఇం.నెం: 12–107/ఎ, సంతోష్ నగర్, నకిరేకల్, నల్లగొండ, తెలంగాణ – 508 211కు పంపాలి. మరిన్ని వివరాలకు: 99485 25853

తుల శ్రీనివాస్

### ఉమ్మడిశెట్టి అవార్డు

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు పరిశీలనకు కవులు 2025లో ప్రచురితమైన తమ కవితా సంపుటాలు నాలుగు ప్రతులను జనవరి 10, 2026లోపు చిరునామా: రాధేయ, చైర్మన్, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, అనంతపురం – 515001, ఫోన్ – 9985171411కు పంపాలి. ఎంపికైన కవితా సంపుటికి రూ.6వేల నగదు బహుమతితోపాటు, కవికి షీల్డ్‌తో సన్మానం ఉంటుంది.

రాధేయ

### ధీరజ్‌కోట్ల పురస్కారాలు

ధీరజ్‌కోట్ల పురస్కారాలు–2025లో ఎమ్బీఎస్ ప్రసాద్ 'వశీకరణం' కథా సంపుటి రూ.10000 ప్రథమ బహుమతికి ఎంపికైంది. రూ. 1,116 ద్వితీయ బహుమతులకి పాలగిరి విశ్వప్రసాద్, స్వరాజ్య పద్మజ, మునిసురేష్ పిళ్లె, దేశరాజు, బి.మురళీధర్, వెల్చేరు చంద్రశేఖర్, గొర్తి వాణి శ్రీనివాస్‌ల కథా సంపుటాలు ఎంపికయ్యాయి. విశిష్ట పురస్కారానికి టిఎస్ఏ కృష్ణమూర్తి; యువ రచయిత పురస్కారానికి దొండపాటి కృష్ణ, బాల సాహిత్య పురస్కారానికి వాసుకి నూచెర్ల, ఆత్మీయ పురస్కారానికి కేతు పద్మమ్మ ఎంపికయ్యారు.

పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి

## అందేశన

సుకుమారమైన సుందరమైన
అందమైన జీవితం కాదది
కారం మెతుకులతో కడుపు నింపుకున్న గరీబ్‌తనం
కడుపునిండా కాయిపాయిగా తినలేదు!
కంటి నిండా నిద్రపోలేదు!
జీవితమంతా అందేశననే!

పల్లె మమకారాన్ని ప్రకృతి ఆత్మను
వాడి నింపుకొని పొలిమేర గాసేది
పోత లింగమయి
ఆధిపత్యాల మీద ఝుంఝూమారుతమై
జే గంటలు మోగించిన కవీంద్రుడు

భగభగ మండి బాధల అగ్గి గుండాల్లో
మరిగిన అక్షరాలను గురి జూసి
పాటల వొడిసెల విసిరేది

బతుకు సంచాలమై ఆకలితో అలమటించి
నెత్తిమీద అవమానాల వొల్లెడను
తలకిరీటం ధరించి రగరగా మండేది

ఆ కంఠం కంచు జమిడికె మోత
ఆ పదాలు నిప్పుల ప్రవాహమై
లోకాన్ని మేలుకొలిపేది

బడిబాట తొక్కని ఆ పాదాలకు
విశ్వవిద్యాలయాలు తలవంచేది
శిల్ప నైపుణ్యాలు కవితా నిర్మాణ సొగసులు
అలంకార శాస్త్రాలు
పిల్లికూనలై తన కాలి అందెలతో కలిసి నడిచేది

మనిషి గుండె ముక్కలు శెక్కలై దుక్కిస్తున్నప్పుడు
మానవత్వపు పల్లవుల ఊటశెల్మె దూప తీర్చేది

రగుతాన్ని అక్షరాలుగా మలిసి
బొండిగె నరాలు తెగేతట్టు రాగమెత్తి పాడి
పాండిత్యం కాదు పాటకు
తన ఊపిరితో పాణం పోసేది

అణచబడ్డ జాతి నుండి ఆత్మగౌరవ జెండై
తెలంగాణ తల్లికి పాటతో పట్టాభిషేకం జేసి
పరిగె పరిగె పులుకు పులుకు పులుకాషిబతుకును
మొగులు నిండా విరపూయించిన పాటల సింగిడి
పెదవాగు వొడ్డుకు పుట్టి
రేబర్తి జీవపరిమళాలతో వెలిగే తెలంగాణ కీర్తి

(లోక కవి అందెశ్రీకి)

■ పొన్నాల బాలయ్య
✆ 99089 06248




# రచయిత, పాత్రల రహస్య బంధం

కల్పన కల్పనే; వాస్తవం వాస్తవమే. పాత్రలు పాత్రలే; వ్యక్తులు వ్యక్తులే. తెలియందెవరికి? అయితే పాఠకులు, రచయితలు కల్పిత పాత్రల్ని వాస్తవ వ్యక్తులుగా భావించటం ఒక కళారహస్యం. బాల్య కౌమారాల్లో, 'చందమామ' గహన మాంత్రిక గుహల్లో, అడవుల్లో కథానాయకుడే కాదు, ఈ చదివే పిల్లాడూ తిరుగాడేవాడు. అది రసాత్మక దూరం (aesthetic distance) లేకపోవటం. ఆ దూరం లేనప్పుడు చదువరి కథ లోపలి మనిషే అవుతాడు. అలాగే రచయిత కూడా భావనా ప్రపంచంలో తన పాత్రలతో కలిసి తిరుగుతుంటాడు. అతని ఊహాలోక విహారాన్ని బట్టి ఆ తిరుగుడు ఉంటుంది. దాన్ని పుస్తకం మూసేసినట్టు ఆపేసి, వెలుపలికి వచ్చేవాళ్ల హాయి వేరు.

అపారమైన కావ్య ప్రపంచంలో కవే బ్రహ్మ అని, అతని అభిరుచికి అనుగుణంగా ఆ ప్రపంచం ప్రవర్తిల్లుతుందని ఆనందవర్ధనుడు అనే ఆలంకారికుడు చెప్పాడు. సాహిత్య సృష్టి అనేది రెండో ప్రపంచం. ఆ ప్రపంచంలో అనేక పాత్రలు పుడతాయి, పెరుగుతాయి, మాట్లాడతాయి, ఏడుస్తాయి, నవ్వుతాయి. అవి రచయిత మనస్సులో పుట్టి, పాఠకుల మనస్సులో నివాసం ఏర్పరచుకుంటాయి. ఇక్కడే Wayne C. Booth (The Rhetoric of Fiction) తెలిపిన విశేషమైన సంగతి చెప్పుకోవాలి. పాత్ర నిర్మాణాన్ని రచయిత, పాఠకుల సహసృష్టిగా అతను భావించాడు. అంటే రచయిత చేసే రూపకల్పనతో పాటు పాఠకుడు ఆ



పాత్రల స్వరూప స్వభావాలను తన ఊహలతో, నిర్ధారణలతో కలిపి ఏర్పరుచుకుంటాడన్నమాట. అది రచయిత కల్పనకి కాస్త వేరుగా ఉండవచ్చు. ఒక పాత్ర ప్రవర్తన లేదా మొత్తం వాచకం కూడా రచయితకి పెడగా విభిన్న పాఠకులకి విభిన్నంగా తోచవచ్చు. అంటే పాత్రల భిన్న కోణాలతో పాటు వాటిని గమనించే పాఠకుల దృష్టి కోణం కూడా ఉంటుంది.

కథ లేదా నవల రచనాక్రమంలో రచయిత అంతరంగంలో జరిగే రసచర్య (alchemy) బహుశా అందరికీ తెలియకపోవచ్చు. రచయిత పాత్రను సృష్టించటం అంటే అతని మనస్సులో ఒక కొత్త ప్రాణి జన్మించటమే. అతను తన ఆలోచనలతో, అనుభవాలతో, సమాజ పరిశీలనతో పాత్రల్ని రూపొందించి, జీవరేఖ దిద్దుతాడు. ఈ క్రమంలో రచయిత, పాత్రల మధ్య ఒక ఒక ఆత్మీయ సంబంధం నెలకొంటుంది. అవి అతని మనస్సులో సజీవంగా తిరుగాడుతుంటాయి. ప్రపంచంలో మన ఆత్మీయులు కళ్లముందు లేకున్నా మానసిక ప్రపంచంలో ఉంటారు. అది ద్వితీయ వాస్తవికత (second reality). అట్లాగే ఈ క్రమంలో రచయిత తన పాత్రతో 'మాట్లాడుతూ' ఉంటాడు. పాత్ర రచయితతో మాట్లాడుతుంది. రచయితకు, అతని పాత్రలకు మధ్య 'సంభాషణ' సాహిత్య సృష్టిలో ఒక మర్మం. ప్రారంభంలో పాత్రలు రచయిత ఆజ్ఞకు లోబడి నడుస్తాయి. కథనం లోతుకు వెళ్లే కొద్దీ, మారే కొద్దీ అవి రచయిత కాదనలేని విధంగా స్వతంత్ర వర్తన కోరుకుంటాయి. రచయిత అనుకున్న ముగింపును పాత్ర కాదనవచ్చు కూడా! అది రచయితకీ సంతోషమే. సృజన క్రమంలో ఈ అన్యోన్యచర్య మానసిక సంక్లిష్ట విశేషం. పాత్రలు, రచయిత ఎదురుబొదురుగా నిలబడే సృజనాత్మక వాదోపవాద సందర్భాలు తెర వెనుక అత్యంత రసవత్తర ఘట్టాలు.

కథలో గమ్య గమన సుస్థిర జ్ఞానం గల రచయితలకైతే ఆయా పాత్రల జీవన యాత్ర మొత్తం మనోగతమే. ఎక్కడా అది బెసగదు. మొదటినుంచి చివరదాకా ఆ మనోగతి చొప్పున అవి సాగిపోతాయి. నాబోటి అసంతృప్త రచయిత, యజమాని లాగా ఆ పాత్రని కాసేపు అటు తిరగమంటాడు, అంతలోనే ఇటు మెల్లగా నడవమని, కాదు కాదు, అటు లగెత్తమని, ఇదుగో ఈ మాటలు కాదు, ఆ పలుకులు వల్లించమని నానా తిప్పలు పెడతాడు. చూసి చూసి, 'ఇక చాల్లే సంబడం' అని అది తోచిన నాలుగు ముక్కలు చెప్పేసి, 'వీడ్కోలు' చెప్పి నచ్చిన దారిన వెళ్లిపోతుంది. ఇక సదరు 'యజమాని' హాయిగా పడక్కుర్చీలో జేరగిలబడతాడు! కనుకనే రచనాక్షేత్రంలో కొంత దూరం వెళ్లినాక, పాత్రలు తమ మాట వినటం లేదని, వాటి దారి అవి చూసుకున్నాయనీ రచయితలు అనటం కద్దు.

హృదయానుభూతి గాఢత గల రచయితకు, అతని పాత్రలకు మధ్య ఒక మానసిక, భావోద్వేగ సంబంధం ఏర్పడుతుందనుకుంటాను. విశిష్ట పాత్రలు రచయితకు కోల్పోరాని వాస్తవ వ్యక్తులుగా, అంతరంగ స్నేహితులుగా మారతాయి. కనుమోడ్పులో, మెలకువలో అతని పక్కనే ఉంటాయి. వాటి ఊపిరి అతనికి సోకుతుంటుంది. రచన ముగిసినా ఆ బంధం తెగదు. అట్లా పాత్రలతో ఆ ఆత్మీయత చదువరులకూ ఏర్పడుతుంది. వాటిని వాళ్లెప్పటికీ కోల్పోరు. ఇక నైపుణ్యం గల నిర్మమకార రచయితలు సాధారణంగా తమ పాత్రలతో వ్యక్తిగత భావోద్వేగాలను మేళవించరు. కథనం మీద వాటి 'పెత్తనం' ఒప్పుకోరు. అక్కడ వాళ్లకున్న బాధ్యత పాత్రలను ఉన్నవి ఉన్నట్లు చూపించటం మాత్రమే గాని వాటితో కలిసి మెలగటం కాదు. కనుక వాటి ఊపిరి తాకనంత కాస్త ఎడంగా నిలబడతారు. అది దోసతీగ బంధం. అది detached attachment. దీన్నే 'impassibilite' (impassivity) అన్నాడు Flaubert. అంటే పాత్రల సంవేదనలతో రచయిత తన భావోద్వేగాలను మేళవించకపోవటం. ఈ 'రసాత్మక' దూరం పాత్రలను మరింత సమంగా చిత్రించేటందుకు సాయపడవచ్చు. కాగా, వృత్తిపర/ వ్యాపార రచయితలకు పాత్రలతో యాంత్రిక సంబంధం తప్ప ఎలాంటి హృదయ సంబంధం ఉండదు. అది total detachment. వాళ్లు పాత్రలకు ఆమడ దూరంలో నిలబడతారు. 'అవసరం' అనుకుంటే వాటిని నయానా భయానా ఏ ఏట్లోనో దూకించగలరు!

సానుకూల పాత్రలు రూపొందే క్రమంలో ఉన్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటాయి. రచయితే అలా రూపొందించినా ఆ పాత్రల్లోని విలక్షణత వ్యతిరేక క్రమంలో రచయిత మీద తిరిగి ప్రభావం చూపించవచ్చు. అతని వ్యక్తిత్వాన్ని అంతో ఇంతో మెరుగు పరచవచ్చు. ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తులూ అప్పుడప్పుడు అనివార్యంగా కష్టాల కడలిలో కదలిపోతారు. ఆ అనివార్యత కోమల మనస్కుడైన రచయితనీ బాధిస్తుంది. నా పాత్రల వేదన నేను అనుభవించిన వేదనే అన్నాడు శరత్ చంద్రుడు. అయినా అతను నిస్సహాయుడు. ఆ పాత్రల జీవనయాత్రలో అనవసర జోక్యం చేసుకునే అధికారం రచయితకి లేదు. అయితే ఇది అందరి విషయంలో అనలేం. కొంతమంది నిరంకుశులూ ఉంటారు! (నిరంకుశాః కవయః) వాళ్ల పాత్రలు కిక్కురుమననీకుండా వేలు చూపిస్తూ నడిపిస్తారు!

ఒక్కొకసారి రచయితే పాత్రగా రూపాంతరం చెందుతాడు. అందీ అందని తన ఆశయాలకు ప్రతీకగా ఒక పాత్రని సృష్టిస్తాడు. అందులో తన ప్రతిబింబాన్ని చూసుకొని సంతోషిస్తాడు. అది ఇచ్ఛాపూర్వక ఆలోచన (wishful thinking). ముఖ్యంగా అతని అనుభవాలే సానుకూల/ ప్రధాన పాత్రల అనుభవాలుగా మారతాయి. తనలోని కలల్ని, ఆశల్ని, ఆశాభంగాల్నీ పాత్రల ద్వారా వ్యక్తం చేస్తాడు. (రచయిత చెప్పలేని సంగతుల్ని పాత్రలు చెపుతాయి.) అవి అతని సంపూర్ణ అనుభవాలు కావచ్చు; పాక్షిక అనుభవాలు కావచ్చు. అవి పరాయి అనుభవాలుగా, ప్రథమ పురుషలో చెప్పవచ్చు; లేదా 'నేను'గా ఉత్తమ పురుషలో చెప్పవచ్చు. అయితే ఉత్తమ పురుషలో 'నేను'గా ఉన్నది రచయిత కానక్కర లేదు. అంటే అక్కడ కథకుడు (నేను) వేరు; రచయిత వేరు. ఆ అనుభవాలన్నీ రచయిత అనుభవాలేనని కొంతమంది పొరపాటు పడుతుంటారు.

రచయిత పాత్రల్ని గాక సజీవ వ్యక్తుల్ని సృష్టించాలన్నాడు హెమింగ్వే. అంటే నిజ జీవితంలో తారసపడిన మనుషుల్ని ఎత్తుకొచ్చి కథలో నిలపటం కాదు. అలా అయితే వాస్తవ వ్యక్తులకు ప్రతిరూపాలు తయారవుతాయి. ఆ వ్యక్తుల పట్ల కోపతాపాలు ఈ ప్రతిరూపాల మీద తీర్చుకునే వాళ్లూ అక్కడక్కడ తగులుతారు. అది మట్టం తక్కువ పని. అట్లా కాక కంటిముందు మనుషుల స్వభావానికి మరో రూపం ఇవ్వవచ్చు. ఆయా వ్యక్తుల గుణగణాలు గమనించి, రంగరించి వేరే మూసలో పొయ్యాలన్నమాట. ఆ గుణగణాలు ఎంత సహజంగా, మట్టసంగా అమరితే ఆ పాత్రలు అంతగా సజీవ వ్యక్తులు అవుతాయి. అందుకే మార్క్వెజ్, నిజ జీవితంలో వ్యక్తులే తన రచనల్లో వేరే రూపం దాల్చారన్నాడు. అదే అభిప్రాయం మహాశ్వేతాదేవి కూడా వెలిబుచ్చింది.

ఒక ఆదర్శ/ సౌందరాత్మక/ ఆత్మసౌందర్యాత్మక పాత్రను కల్పించినప్పుడు బహుశా అది ఆ రచయితతో మానసిక సహజీవనం చేస్తుందనుకుంటాను. ఈ క్రమంలో రచయిత స్వీయ కల్పితపాత్రతో ప్రేమలో పడటం సాధ్యమేనా!? సాధ్యమే అని నా అనుభవం. ('మట్టి గుండె'లో సీత, 'సముద్రం'లో వనమాలి, 'స్పర్శ'లో మణిమాల ఇప్పటికీ నన్ను మక్కువతో పలకరిస్తారు.) అది అవాస్తవ వాస్తవం. కథా నవలారచనలో ఒకానొక రహో రసాయనిక ప్రక్రియ. అది మామూలు చదువరులకు అవగతం కాదు. అందరు రచయితల అనుభవమూ కాకపోవచ్చు.

'I love my characters as if they were my children' అన్నాడు దొస్తోయెవ్‌స్కీ. నిజానికి ప్రతి ముఖ్యపాత్రా అతని ఆత్మవాచకమే/ స్వరమే. అవి తన అంతస్తత్వాన్ని అన్వేషించటానికి సాయపడ్డాయి కనుక వాటిని ప్రేమించాడు. ఆ చీకటి వెలుగుల, సందేహాత్మక, మేధాసంపన్న, స్వయం వ్యక్త పాత్రలన్నీ అతని విరూపాలే. బహుశా 'క్రైమ్ అండ్ పనిష్మెంట్'లో

> **'సీతాయాః చరితం పుణ్యమ్' అన్న వాల్మీకికి, ద్రౌపదిని 'పుణ్య గంధ' అన్న వ్యాసుడికి వారితో ఆత్మీయ బంధం ఉందా? లేక స్థిత ప్రజ్ఞులుగా వారిని గమనించారా? శకుంతలను అంపకం చేసేటప్పుడు కణ్వ మహర్షితో పాటు కాళిదాసుకీ 'వైక్లబ్యం'తో కన్నులు చెమ్మగిల్లి ఉంటాయా? 'శ్రీకాంత'లో రాజ్యలక్ష్మిని శరత్ ప్రేమించాడా? 'పథేర్ పాంచాలి'లో చిన్నారి దుర్గ మరణం విభూతి భూషణ్‌నీ బాధించి ఉంటుందా? ఇవన్నీ జవాబు తెలియని ప్రశ్నలు.**

విచ్ఛిన్న పాత్ర రాస్కోల్నికోవ్‌లో దొస్తోయెవ్‌స్కీ ఉండే ఉంటాడు. ప్రిన్స్ మిష్కిన్ ('ద ఇడియెట్') లాంటి సంపూర్ణ సజ్జనుల్ని కల్పించటం కష్టమని అతను గ్రహించాడు. ఇక టాల్‌స్టాయ్ అన్నా కరెనినాని ప్రేమించినా ఆమెను సమర్థించలేదు.

ఒక కవికి, లేదా రచయితకి తాము సృష్టించిన పాత్రలతో ఎలాంటి అంతరానుబంధం ఉందో తేల్చలేము. బాగా వెనక్కి వెళితే 'సీతాయాః చరితం పుణ్యమ్' అన్న వాల్మీకికి, ద్రౌపదిని 'పుణ్య గంధ' అన్న వ్యాసుడికి వారితో ఆత్మీయ బంధం ఉందా? లేక స్థితప్రజ్ఞులుగా వారిని గమనించారా? శకుంతలను అంపకం చేసేటప్పుడు కణ్వ మహర్షితో పాటు కాళిదాసుకీ 'వైక్లబ్యం'తో కన్నులు చెమ్మగిల్లి ఉంటాయా? 'శ్రీకాంత'లో రాజ్యలక్ష్మిని శరత్ ప్రేమించాడా? 'పథేర్ పాంచాలి'లో చిన్నారి దుర్గ మరణం విభూతిభూషణ్‌నీ బాధించి ఉంటుందా? ఇవన్నీ జవాబు తెలియని ప్రశ్నలు. తెలుగులో ఏయే రచయితలకి తమ పాత్రల పట్ల నిర్మమకారం, లేదా భావోద్వేగ సంబంధం ఉందో తెలియదు. అయితే గురజాడకి మధురవాణి పట్ల, ఉన్నవకి 'మాలపల్లి'లో రామదాసు పట్ల, రామస్వామికి 'శంబుకవధ'లో శంబుకుడి పట్ల, శ్రీపాదకి 'కలుపు మొక్కలు'లో శేషాచలం పట్ల, బుచ్చిబాబుకి 'చివరికి మిగిలేది'లో అమృతం పట్ల, సీతాదేవికి 'మట్టి మనిషి'లో వరూధిని పట్ల, బైరాగికి 'దరబాను' పట్ల లోలోపల ఏదో మమకారం ఉందనిపిస్తుంది. మరెన్నో ఉదాహరణలతో మనం ఆలోచించవచ్చు. అయితే ఈ ఉండటం, లేకపోవటం అనేది ఆ రచనాశిల్పానికి గీటురాయి కాదు. కాకపోతే రచయిత ఆత్మీయ/ భావోద్వేగ బంధంలో రూపొందిన పాత్రలు పాఠకుల భావోద్వేగాలతో తేలిగ్గా అంటుకుపోతాయి. ఆప్యాయంగా మనసు లోగిలిలోకి వచ్చి కూర్చుంటాయి. ఒకందాన తొలగిపోవు.

మరొక సంగతి. రచయిత నిరాశోపహతుడైనప్పుడో, ఒంటరి గుహలో కూరుకుపోయిన క్షణాల్లోనో అతడు కల్పించిన, జీవం పోసిన, ప్రేమించిన ఏదో ఒక దయామయ ధీర పాత్ర చటుక్కున ప్రత్యక్షమై అతనిని అక్కున జేర్చుకుంటుందా? ఏదో ఒక సంకల్ప సాధనం చేతికిచ్చి, ముందుకు పదమని ప్రేమగా చెపుతుందా? అట్లాగే ఒకానొక ఉదాత్త కవిత తదనంతర కాలంలో తన జన్మదాతకే స్ఫూర్తినిచ్చే సందర్భాలుంటాయా? నన్నడిగితే అవునంటాను.

■ పాపినేని శివశంకర్
✆ 85008 84400

# గోడలను ఛేదించే పదవిన్యాసం


గోడలకు వ్యతిరేకంగా కవులు రచయితలు, కళాకారులు కలం ఎక్కుపెట్టటం, గళాలు విప్పటం ఈరోజు మొదలు కాలేదు. వ్యత్యాసాల ఆధిపత్యాల నిచ్చెనమెట్ల వ్యవస్థల ఉనికి నుండి అనుభవానికి వచ్చే నొప్పి, వేదన వ్యక్తులకు తమ పురోగమనానికి అవరోధంగా ఉన్న గోడల గురించిన స్పృహ కలిగిస్తుంది. ఈ స్పృహకు సామూహిక స్వరం ఇవ్వటమే సాహిత్య కళా రంగాలు చేస్తున్న పని.

గోడలు.. నాలుగు గోడలు, వాటిని కలుపుతూ ఒక పై కప్పు.. గది, అలాంటి కొన్నిగదులతో కూడిన ఇల్లు జీవిత సౌఖ్యానికి, భద్రజీవితానికి, బాంధవ్యాలకు ప్రతీక. నిజమే కానీ కాలక్రమంలో అది కుటుంబ సభ్యుల మధ్యనే కనిపించని అధికారపు గోడలను ఎన్నింటినో ఆకాశమంత ఎత్తున నిర్మించింది. నాలుగు గోడల ప్రయివేటు ప్రపంచంపై ఆధిపత్యం స్థాపించుకొని, సామాజిక ఆర్థిక రాజకీయ నిర్మాణాల పబ్లిక్ ప్రపంచంలోకి పురుషులు విస్తరించిన క్రమం స్త్రీల జీవితాన్ని నాలుగు గోడలకు కుదించింది. పబ్లిక్ ప్రపంచంలోకి వచ్చిన మగవాళ్ల మధ్య సామాజిక ఆర్థిక అధికార సంబంధపు అడ్డుగోడలెన్నో లేచి భిన్న సమూహాలుగా వాళ్ళను చీల్చాయి. ఈ క్రమంలో ఆడైనా, మగైనా ఊపిరాడక ఇబ్బంది పడ్డవాళ్లే. గాయపడ్డవాళ్లే. గోడలను పడగొట్టి స్వేచ్ఛను, సమానత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలని ఆరాటపడ్డవాళ్లే.

స్వేచ్ఛగా పుట్టి సర్వత్రా సంకెళ్ళలో ఉన్న మనిషి విముక్తికై చేసిన పెనుగులాట చరిత్ర చాలా ప్రాచీనం. మానవ సంబంధాలలో అడ్డుగోడల నిర్మాణం లైంగిక సంబంధాల నియంత్రణతో మొదలైంది. స్వేచ్ఛగా పుట్టిన మనిషి, స్వేచ్ఛాయుత లైంగిక సంబంధాలను అనుభవించిన మనిషి 'ఒక స్త్రీకి ఒక పురుషుడు, ఒక పురుషుడికి ఒక స్త్రీ' అన్న నియమానికి లొంగి జీవించలేని స్థితి నుండి వచ్చినవే– గోడలు దూకటం, గోడలు పగలగొట్టటం అన్న భావనలు. 17వ శతాబ్ది కథా కావ్యం 'శుకసప్తతి'లో మదవతి కథ ఉంది. భర్త పరాయిదేశం వెళ్ళినప్పుడు అత్తమామల నిఘా పట్ల ఆమెలో కలిగిన అసహనం పెరటి గోడలను కూలగొట్టగల పెనువానను ఆకాంక్షించటంలో ధ్వనిస్తుంది.

గోడలు కులానికి, మతానికి, అధికారానికి, ఆస్తులకు, ఆచారాలకు సంబంధించినవి ఏవైనా కావచ్చు. అవి 'మనం'గా ఉండే జనాన్ని 'మీరు' 'మేము' అన్న ప్రత్యర్థి సమూహాలుగా మారుస్తాయి. 'మీరు' స్థానంలో 'అదృష్టవంతుల'ను 'మేము' స్థానంలో 'అభాగ్యుల'ను నిలిపి, శ్రీశ్రీ 1937లో వ్యత్యాసం కవితను రాసాడు. అదృష్టవంతులు అంటే సంపదలు, సౌఖ్యాలు పోగేసుకొన్నవాళ్ళు. వాళ్ళ జీవితం వడ్డించినవిస్తరి. అభాగ్యులు సంపదకు పరాయీకరించబడ్డవాళ్లు. విస్తరే దొరకని, గోడలే లేని బయలు జీవితం వీళ్లది. ఈ వ్యత్యాసాల ప్రపంచాన్ని సమానత్వ విలువ మీద పునర్నిర్మించటం కోసం గోడలను పగలగొట్టటమే కవులు, రచయితలు, కళాకారుల పని.

"నా గతిని ఆకట్ట/ నన్నదుపులో పెట్ట ఎన్ని శాస్త్రాల కట్టడాలో/ ఎన్నెన్ని నీతుల గోతులు/.../.../ ఎన్ని కులాల అనుపాతాలు/ ఎన్ని కులగోత్రాల మడికట్లు/ ఎన్ని సంప్రదాయాల నాచు," అంటూ స్వేచ్ఛాయుత సహజ జీవనాన్ని నియంత్రించే వ్యవస్థల పట్ల, నీతుల పట్ల కాళోజి నిరసనస్వరం అయినాడు. ప్రపంచపు బాధను తమ బాధగా చేసుకొన్న శ్రీశ్రీ, కాళోజీ వంటి కవులే కాదు, స్వీయాత్మక సంవేదనలతో, వ్యక్తిగత సమస్యలతో వేగిపోతూ అంతర్ముఖులై ప్రపంచానికి పెడముఖం పెట్టారని విమర్శకు గురైన బుచ్చిబాబు వంటి రచయితలు కూడా జీవితంలో మానవుల పురోగమనానికి అడ్డుగా ఉన్న సామాజిక ఆర్థిక నైతిక గోడల పట్ల అసహనం, కోపం కనబరచినవారే. కులం, అస్పృశ్యత, స్థిరపడిన లైంగిక నైతిక విలువలు, ప్రాంతీయ విభేదాలు, ఆర్థిక అసమానతలు, సమాన అవకాశాల లేమి మొదలైనవి మనిషికీ మనిషికీ మధ్య అడ్డుగోడలై అసంతృప్తికి, అశాంతికి కారణమవుతున్న స్థితిని బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' నవల ఇతివృత్తంలో అంచెలంచెలుగా నిరూపించాడు. చలం,




> **కవులకు, రచయితలకు ఏది రాయాలో, ఏది రాయకూడదో, ఏది చెప్పాలో, ఏది మరుగు పరచాలో తెలియచెప్పే సిలబస్ ఏకపక్షంగా రూపొందుతున్నది. ఈ వర్తమాన సంక్షోభం 'నెత్తురు మండే/ శక్తులు నిండే' యువతను నిలబడనిస్తుందా? నిద్రపోనిస్తుందా? గోడలపట్ల అసహనంతో, ఆంక్షలపట్ల నిరసనతో, అన్యాయం పట్ల ఆగ్రహంతో వాళ్ళు సకల కళలలో తమ అస్తిత్వాన్ని చాటుకొంటున్నారు. దానిని ఒక చోట దృశ్యమానం చేయగలిగితే స్ఫూర్తిదాయకంగా ఉంటుందని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ యువజన సాహిత్యోత్సవాలు నిర్వహిస్తున్నది.**

త్రిపురనేని రామస్వామి చౌదరి వంటి రచయితలు ఎందరో సంప్రదాయానికి ఎదురీదే నూతన భావప్రపంచానికి యువతను మేల్కొల్పారు. ఆ విధంగా హేతువు, ప్రశ్న మౌలిక విలువలుగా గోడలను ఛేదించే శక్తిని అక్షరాలలో, పదాలలో, వాక్యాలలో దట్టించి వదిలిన తెలుగు సాహిత్య సంవిధానాన్ని మనమిప్పుడు అధ్యయనం చేయవలసి ఉంది. దాని ప్రభావశీల పాత్రను అంచనా వేయవలసి ఉంది.

నిజానికి గోడలు చాలా పాతవే. నాని నాని కూలిపోవటానికి, కరిగిపోవటానికి సిద్ధంగా ఉన్నవే. అటువంటప్పుడు పడదోయటం సులభం కావాలి. కానీ వాటిని నిలబెట్టి, మరింత ఘనీభవింప చేయటానికి రాజ్యం మునుపెన్నడూ లేనంత ప్రత్యక్షంగా పూనుకొంది. ఎన్ని గోడలు ఉంటే, ప్రజలు ఎంతగా భిన్న సమూహాలుగా చీలిపోయి ఉంటే, ఆయా సమూహాలన్నీ ఎంత అధికారపు మత్తులో ఉంటే అంత సులువుగా రాజ్యాధికారం అమలు చేయటానికి వీలవుతుంది. అందుకే ఈ కాలాన అది మంచి చెడుల నిర్ణేత అయింది. వాటిమధ్య రేఖ చెదరకుండా చూడటమే పాలన అయింది. హేతు చింతన, ప్రశ్న నేరాల జాబితాలోకి చేరాయి. కవులకు, రచయితలకు ఏది రాయాలో, ఏది రాయకూడదో, ఏది చెప్పాలో, ఏది మరుగుపరచాలో తెలియచెప్పే సిలబస్ ఏకపక్షంగా రూపొందుతున్నది. అది అన్యాయం, అత్యాచారం, అప్రజాస్వామికం అన్నవాళ్ళంతా నేరగాళ్లయ్యారు. "న్యాయస్థానాలు, రక్షకభట వర్గాలు, చెరసాలలు, ఉరికొయ్యలు" పౌర జీవితంలోకి చొచ్చుకు వచ్చాయి.

ఈ వర్తమాన సంక్షోభం 'నెత్తురు మండే/ శక్తులు నిండే' యువతను నిలబడనిస్తుందా? నిద్రపోనిస్తుందా? రాజ్యాంగం వలన లభించిన స్వేచ్ఛా సమానతలు, స్వాతంత్ర్య సౌభ్రాతృత్వాలు ఆచరణలో వాస్తవం కావటానికి ఆ గోడలే అడ్డు అని తెలిసాక పడదోసుకొంటూ వెళ్లటం అనివార్యం అవుతుంది. గోడలపట్ల అసహనంతో, ఆంక్షలపట్ల నిరసనతో, అన్యాయం పట్ల ఆగ్రహంతో యువతరం కవిత్వమై నినదిస్తున్నారు. పాటై ప్రవహిస్తున్నారు. కథ అయి కదం తొక్కుతున్నారు. నవలై ఆధునిక ఇతిహాసం రచిస్తున్నారు. సకల కళలలో తమ అస్తిత్వాన్ని చాటుకొంటున్నారు. దానిని ఒక చోట దృశ్యమానం చేయగలిగితే స్ఫూర్తిదాయకంగా ఉంటుందని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఈ నవంబర్ 22 న హైదరాబాద్‌లో యువజన సాహిత్యోత్సవాలను నిర్వహిస్తున్నది. సాహిత్య సామాజిక సాంస్కృతిక ఉద్యమకారులను, కవులను, రచయితలను, కళాకారులను అభిప్రాయాలు కలబోసుకుందాం రమ్మని ఆహ్వానిస్తున్నది.

('సమూహ యూత్ లిటరేచర్ ఫెస్టివల్' నవంబర్ 22న ఉదయం 9.30 నుంచి రాత్రి 8 గంటల వరకు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి, హైదరాబాద్‌లో జరుగుతుంది.)

■ కాత్యాయనీ విద్మహే

## సత్ఫలితాలిచ్చిన ప్రత్యేక లోక్ అదాలత్

వరంగల్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక లోక్అదాలత్ ద్వారా 5,025 కేసులు పరిష్కారమైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. సైబర్ క్రైం కేసుల్లో రూ.89లక్షలకు పైగా రీఫండ్‌ను బాధితులకు అందచేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. 1,011 ఎఫ్ఐఆర్ కేసులు, 1,281 ఈ-పెట్టి కేసులు, 2,533 డ్రంకెన్ డ్రైవ్, ఎంవీఐ చట్టం కేసులు పరిష్కారమైనట్లు వివరించారు. లోక్అదాలత్ సద్వినియోగానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# పత్తిష్టంభన!




## నేటి నుంచి జిన్నింగ్ మిల్లులు బంద్

- సీసీఐ నింబధనలపై కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ ఆగ్రహం
- ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్
- ఇప్పటికే కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్నరైతులు
- పత్తి కొనుగోళ్లపై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఆగమాగం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పత్తి కొనుగోళ్లపై గందరగోళం నెలకొంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తీరుపై రైతులు, జిన్నింగ్ మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కపాస్ యాప్ రిజిస్ట్రేషన్, తేమశాతం, అంతర్ జిల్లాల పరిధిలోనే అమ్మకాలపై రైతులు, ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలో జిన్నింగ్ మిల్లులకు పత్తి అలాట్‌మెంట్‌పై మిల్లర్లు మండిపడుతున్నారు. సీసీఐ పూటకో నిబంధనను తీసుకవచ్చి రైతుల పైన, మిల్లర్లపై రుద్దుతుండటంతో పత్తి అమ్మకాల పైన తీవ్ర ప్రభావం చూపుతోంది. సీసీఐ ఆనాలోచిత నిర్ణయాలపై సోమవారం నుంచి మిల్లుల బంద్‌కు కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ అసోషియేషన్ పిలుపునిచ్చింది. దీంతో ఇప్పటికే కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఆగమాగం అవుతుండంతో పాటు రోజుల తరబడి నిల్వ ఉంటే పత్తిలో తేమశాతం మరింత పెరుగుతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది.

### సీసీఐ వర్సెస్ జిన్నింగ్ మిల్లర్లు

ఈ సీజన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు 5,14,904 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలుకు మార్కెటింగ్ శాఖ గుర్తించింది. సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేసే పత్తి కోసం జిన్నింగ్ మిల్లుల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పత్తి కొనుగోలు ప్రక్రియకు ముందే జిన్నింగ్ మిల్లులతో సీసీఐ పంచాయతీకి దిగింది. పాత నిబంధనలను మార్చటంతో మిల్లులను సీసీఐకి అద్దెకు ఇచ్చేందుకు మిల్లర్లు నిరాకరించారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో జిన్నింగ్ మిల్లులకు ఒక పత్తి బేల్‌కు రూ.1,440లు చెల్లించేందుకు సీసీఐ ముందుకు వచ్చింది. దీంతో అక్టోబరు 24 నుంచి సీసీఐ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే జిన్నింగ్ మిల్లులను సీసీఐ మూడు కేటగిరీలుగా వర్గీకరించింది. ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరిట వర్గీకరించి పత్తి కొనుగోళ్లకు మిల్లులను కేటాయిస్తుంది. కపాస్ యాప్‌లో తొలుత ఎల్-1 మిల్లుల జాబితానే సీసీఐ ప్రదర్శిస్తోంది. ఆ మిల్లుల్లో సామర్థ్యం పూర్తయితే ఎల్-2కు, ఆ తరువాత ఎల్-3 మిల్లులకు అవకాశం ఇస్తుంది. అసలే వర్షాలకు పత్తి దిగుబడి భారీగా తగ్గింది. ఎల్-1, ఎల్-2 మిల్లుల సామర్థ్యం పూర్తి అయ్యేదెప్పుడో.. ఎల్-3 మిల్లులకు కేటాయించేదెప్పుడో అనే ఆందోళన మిల్లర్లలో వ్యక్తం అవుతోంది. ఈ విధానంపై జిన్నింగ్ మిల్లర్లు అభ్యంతరం చెప్పుతున్నారు. అన్ని మిల్లుల్లో కొనుగోళ్ల ఒకేసారి (మిగతా 7వ పేజీలో)

### ఆందోళన బాటలో మిల్లర్లు

తమ డిమాండ్లపై సీసీఐ దిగి రాకపోవటంతో జిన్నింగ్ మిల్లర్లు ఆందోళన బాట పడుతున్నారు. తొలుత నవంబరు 6వ తేదీ నుంచి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ పిలుపునిచ్చింది. అయితే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు జోక్యం చేసుకుని, తాను సీసీఐ చర్చిస్తానని, రైతులకు నష్టం జరుగకుండా మిల్లుల్లో కొనుగోళ్ల చేయాలని మంత్రి కోరారు. దీంతో జిన్నింగ్‌మిల్లుల బంద్‌కు వెనక్కి తగ్గారు. అయితే పది రోజులు గడుస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోగా, ఇప్పటి వరకు చాలాచోట్ల ఎల్-1 కింద ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లులకే పత్తిని కేటాయిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఎల్-1 కింద ఎంపిక చేసిన 28మిల్లుల్లోనే కొనుగోళ్ల మొదలు పెట్టారు. దీంతో ఎల్-2, ఎల్-3 కింద ఎంపిక చేసిన మిల్లులకు పత్తి రాకపోవటంతో మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కాకపోవటంతో పాటు సీసీఐ తన నిబంధనలను సడలించేందుకు ఆసక్తిగా లేకపోవటంతో సోమవారం నుంచి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ పిలుపునిచ్చింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్ల నిలిచిపోనున్నాయి.

## ప్రతిభ ఉంటే ప్రపంచం నీవైపే



క్రీడా పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, పాల్గొన్న శాట్ చైర్మన్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, మేయర్, తదితరులు

7వ పేజీలో..

- అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం చెమటోడ్చాలి
- ఓరుగల్లు ఖిల్లా క్రీడాకారులకు పుట్టినిల్లు
- యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- హనుమకొండ జేఎన్ఎస్‌లో క్రీడా పాఠశాల ప్రారంభం

కఠోరదీక్ష, పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే ప్రపంచమే నీవైపు చూస్తుందని రాష్ట్ర యువజ న, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. హనుమకొండ జహవర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా పాఠశాలను ఆదివారం మంత్రి వాకిటి శ్రీహరి లాంఛనంగా ప్రారంభించారు. క్రీడా పాఠశాల ద్వారా భవిష్యత్తు క్రీడాకారులను తయారుచేసుకోవచ్చున్నారు. ఒలింపిక్స్‌లో మనం వెనుకబడి ఉన్నామని, తెలంగాణ క్రీడాకారులు ఆ లోటును భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా టోక్యోలో జరుగుతున్న డెఫ్‌లింపిక్స్‌లో 10మీటర్ల షూటింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన హైదరాబాద్‌కు చెందిన ధనుష్‌శ్రీకాంత్‌కు మంత్రి రూ.1కోటి 20లక్షల పారితోషికాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. - వరంగల్ స్పోర్ట్స్

## నెత్తురోడిన జాతీయ రహదారి

- జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- నిడిగొండ వద్ద బ్రేక్‌డౌన్‌తో నిలిచిన ఇసుక లారీ
- వేగంగా ఢీకొన్న ఆర్టీసీ రాజధాని బస్సు
- ఇద్దరి మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

రఘునాథపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బ్రేక్ డౌన్‌తో ఆగిపోయిన ఇసుక లారీని ఆర్టీసీ రాజధాని బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు ప్రయాణికులు దుర్మరణం చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..

వరంగల్-హైదరాబాద్ (163) జాతీయ రహదారిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి గోదావరి ఇసుక లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఇంజన్‌కు సంబంధించిన జాయింట్‌తో పాటు డైపారం ఊడిపోవడంతో బ్రెక్ లైనర్స్ పట్టుకొని నిడిగొండ బ్రిడ్జి దిగిన తర్వాత బస్టాండు సమీపంలో అర్ధరాత్రి 1.45గంటలకు ఆకస్మాత్తుగా ఆగిపోయింది. దీంతో అప్రమత్తమైన లారీ డ్రైవర్ గుదె మల్లేశం.. లారీ దిగి రోడ్డుపైకి వచ్చి సెల్‌కు సంబంధించిన టార్చ్ లైటుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను లారీ ఆగిపోయిన విషయాన్ని తెలియజేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు 16మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు వేగంగా వచ్చి ఆగి ఉన్న ఇసుక లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగంలో కూర్చున్న హైదరాబాద్ దోమలగూడకు చెందిన పూలమాటి ఓంప్రకాష్ (75), హనుమకొండ బాలసముద్రంకు చెందిన నవజీత్ సింగ్(52) మృతి చెందారు.




ఇసుకలారీని ఢీకొన్న ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు

అలాగే బస్సులో ప్రయాణిస్తున్న గుర్రపు రవికిరణ్, గుర్రపు స్వరాజ్యలక్ష్మి, నంద కిషోర్, మురళీకృష్ణ, హర్షవర్ధన్‌తోపాటు మరొకరికి తీవ్ర గాయాలు కాగా, 108లో జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు డ్రైవర్‌తోపాటు ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా జాతీయ రహదారిపై లారీని నిలిపిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు. సంఘటన స్థలాన్ని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో పాటు జనగామ డిపో మేనేజర్ స్వాతి సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

## మోడల్ స్కూల్ విద్యార్థినుల అరిగోస



- వెంకటాపూర్‌లో సౌకర్యాల లేమిపై ఆందోళన
- రాత్రి రోడ్డుపై బైఠాయించి నినదించిన విద్యార్థినులు
- అదే సమయంలో హాస్టల్ వద్ద ఆకతాయిల హల్‌చల్
- విచారణ చేపట్టిన డీఈవో.. ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

7

విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్న డీఈవో, తహసీల్దార్

## పేదల సొమ్ము దోచిందెవరో..?!

- ఆరోగ్యశ్రీ నిధుల మాయంపై విజిలెన్స్ విచారణ వేగవంతం
- 2021-24 మధ్య ఎంజీఎంలో పని చేసిన వైద్యాధికారులపై నజర్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల స్పందన

వరంగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ ఎంజీఎంలో ఆరోగ్యశ్రీ నిధుల గోల్‌మాల్‌పై విజిలెన్స్ విచారణలో వేగం పెంచింది. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ఎంజీఎం ఆరోగ్యశ్రీలో అక్రమాలు ఎలా జరిగాయో వివరంగా కథనం ప్రచురించంతో విజిలెన్స్ అధికారులు విచారణలో వేగం పెంచారు. 2021-24 మధ్యకాలంలో ఆరోగ్యశ్రీ పథకం కింద జరిగిన ఆపరేషన్ల వివరాలను సేకరిస్తున్నారు. ఈ పథకం కింద ఎంజీఎంకు మంజూరైన రూ.29.30కోట్ల నిధుల్లో అక్రమార్కులు మేసింది ఎంత అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ప్రధానంగా 2021-24లో వరంగల్ ఎంజీఎంలో సూపరెంటెండెంట్‌లుగా, సీనియర్ అసిస్టెంట్‌లుగా, వివిధ విభాగాల్లో కీలకంగా పనిచేసిన కొంతమంది వైద్యులు, ప్రొఫెసర్లను వ్యక్తిగతంగా విజిలెన్స్ అధికారులు కలిసి విచారిస్తున్నారు. వీరితోపాటు వారి కుటుంబసభ్యులు ఆధార్ కార్డులు, బ్యాంకు స్టేట్‌మెంట్‌లను తీసుకుంటున్నారు. ఎంజీఎంలో పని చేసిన కాలంలో వీరి ఆర్థిక లావాదేవిలు ఎలా ఉన్నాయనే కోణంలో విచారిస్తున్నట్లుగా సమాచారం. వీరికి వచ్చే ఆదాయం ఎంత..? పోగేసిన ఆస్తులు ఎంత? అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నట్లుగా తెలిసింది.

కాగా, ఆరోగ్యశ్రీ పథకంలో పేదల సొమ్మును నొక్కేసిన అక్రమార్కులపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందనే ప్రచారం జరుగుతోంది. ఎంజీఎంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ఓ అధికారి నుంచి కీలక సమాచారాన్ని విజిలెన్స్ అధికారులు రాబట్టినట్లుగా సమాచారం. అలాగే కొంతమంది పేషెంట్ల వివరాలను కూడా తీసుకుని, వారిని కూడా విచారించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా తెలిసింది. మొత్తం రూ.29.30కోట్ల నిధుల్లో ఎంత మేర నకిలీ బిల్లులతో వైద్యులు మాయం చేశారనేది వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం కూడా ఎంజీఎం అక్రమాలపై దృష్టి పెట్టడంతో వారం పదిరోజుల్లోనే విజిలెన్స్ నివేదిక ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

## గాయత్రీ నమోస్తుతే..

- నేత్రపర్వంగా హోమ యాగాలు
- తరలివచ్చిన వేలాది మంది దంపతులు
- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ
- హరిద్వార్ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన పండితులు




యాగశాలలో మంత్రి కొండా సురేఖకు ప్రసాదం అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ హంటర్ రోడ్డులోని బీఎస్‌కే గ్రౌండ్‌లో గాయత్రి పరివార్ వరంగల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాయత్రి హోమాలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. వందలాది హోమగుండాలను ఏర్పాటు చేసి ఒక్కో గుండం వద్ద నాలుగు జంటల చొప్పున యాగంలో కూర్చోబెట్టారు. హరిద్వార్ నుంచి వచ్చిన పండితులు భక్తి శ్రద్ధలతో హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వేడుక అత్యంత వైభవంగా కొనసాగింది. వరంగల్‌లో మొదటిసారిగా ఈయాగం నిర్వహించినట్లు పండితులు తెలిపారు. గాయత్రిదేవి అనుగ్రహం కోసం.. విశ్వకల్యాణం కోసం హోమాలు నిర్వహించామన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలని కూరుతూ పూజలు చేశామన్నారు.

### ప్రతీ ఒక్కరు పాటించాలి

గాయత్రి హోమం చేయడం వల్ల కుటుంబంలో సుఖసంతోషాలు కలుగుతాయని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ అన్నారు. యాగశాలను సందర్శించిన మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఒక్కరు గాయత్రిమాత మంత్రం జపించాలని కోరారు.

అనంతరం మంత్రి కొండా సురేఖను సన్మానించారు. యాగంలో దాదాపు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. యాగం అనంతరం అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో యాగం నిర్వాహికులు.. గాయత్రి పరివార్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మానుకోటలో వ్యభిచార స్థావరం గుట్టు రట్టు

- పోలీసుల అదుపులో నలుగురు మహిళలు
- నాలుగు సెల్‌ఫోన్లు, రూ.4 వేల నగదు స్వాధీనం

మహబూబాబాద్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మానుకోట జిల్లా కేంద్రంలో రహస్యంగా నడుపుతున్న హైటెక్ వ్యభిచార స్థావరం గుట్టు రట్టైంది. టౌన్ సీఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారం తెల్లవారు జామున మెరుపు దాడి చేశారు. వ్యభిచార గృ హం నిర్వాహకురాలుతో పాటు మరో ముగ్గురు మహిళలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఈ ఘటనా స్థలంలో నాలుగు సెల్ ఫోన్లతో పాటు, రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకుని, పోలీసులు కేసునమోదు చేశారు. సీఐమహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళ పట్టణంలోని పత్తిపాక రోడ్‌లోని ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన కొందరు మహిళలను అక్కడకు రప్పించి, కొంతకాలంగావ్యభిచార కార్యకలాపాలు జరుపుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. అక్కడ కొంతకాలంగా నిఘాపెట్టి, పక్కా సమాచారంతో వ్యభిచార స్థావరంపై దాడి నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో ఇల్లును అద్దెకు తీసుకొని వ్యభిచార కార్యకలాపాలు జరుపుతున్న నిర్వాహకురాలితో పాటు మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. కాగా, పట్టుబడిన మహిళల్లో ఇద్దరు పట్టణశివారు ఓ గ్రామానికి చెందిన వారుండగా, మరో మహిళ నర్సంపేట బైపాస్ ప్రాంతానికి చెందిన మహిళ ఉన్నట్లు సమాచారం.

### నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తామని గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.

# బస్సు ప్రయాణం బేజారు

- ప్రధాన రూట్‌లలో రెట్టింపు సంఖ్యలో జనం
- అదనపు సర్వీసులు నడపని అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్

తొర్రూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో బస్సులు కిక్కిరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందికరంగా ప్రయాణిస్తు న్నారు. ఆక్యుపెన్సీ రెట్టింపు సంఖ్యలో ప్రయాణీకులు ఎక్కుతున్నా రు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచపోవడం, సిబ్బం ది సైతం అరకొరగానే ఉండడంతో జిల్లాలోని 2 డిపోల నుంచి హైదరాబాద్ నగరంతో పాటు ఇతర పట్టణాలకు వెళ్లే బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణీకులు వెళ్తున్నారు. డ్రైవర్, కండక్టర్‌ల కు ఇబ్బందులు తప్పడం లేదు. రద్దీ రూట్‌లలో సర్వీసులు పెంచా లనే డిమాండ్ ఉన్నా పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఏర్పడు తున్నాయి. మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు పల్లె వెలు గు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో గత 23 నెలలుగా ప్రయాణీకుల సంఖ్య భారీగా పెరిగింది. పెరిగిన ప్రయాణీకులకు అనుగుణంగా బస్సుల సంఖ్య లేదు. సూపర్ డీలక్స్ మినహా మిగతా బస్సులన్నీ ఆక్యుపెన్సీకి మించి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇలాంటి సమయాల్లో ప్రమా దాలు జరిగితే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నిల్చునేందుకు చోటు లేకుండా ప్రయాణించడం, అత్యవసర పరిస్థితుల్లో దిగేందు కు వీలు లేకపోవడం, రద్దీతో డ్రైవర్‌లు నియంత్రణ కోల్పోవడం వంటి ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. గత వారం రోజులుగా రాష్ట్రంలో రెండు, మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

### 70శాతం ఉచిత ప్రయాణమే

జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలో రోజు 80వేల నుంచి 90వేల మంది ప్రయాణీకులు బస్సుల్లో రాక పోకలు సాగిస్తున్నారు. వీరిలో 65శాతం నుంచి 70 శాతం మహిళ లు ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేస్తుండటంతో గతంలో 60 శాతం ఉన్న ఆక్యుపెన్సీ 90శాతం పెరిగింది. తాజాగా మహ బూ బాబాద్ డిపోలో 90శాతం, తొర్రూరు డిపోలో 92శాతంగా ఆక్యు పెన్సీ రేషో ఉండగా రద్దీ మార్గాల్లో ఓఆర్ వందశాతం నమోదవుతున్నాయి.

### జిల్లాలో బస్సు సర్వీసులు

మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో 74బస్సులు ఉండగా వాటిలో 50 ఆర్టీసీ, 24అద్దె బస్సులు 100 మంది డ్రైవర్లు, 125మంది కండక్టర్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు 30వేల మంది ప్రయాణీకులు ఖమ్మం, సూర్యాపేట, ఇల్లందు, వరంగల్ రూట్‌ల లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. తొర్రూరు డిపో పరిధిలో 94 బస్సులు ఉండగా 49 ఆర్టీసీ, 44 అద్దె బస్సులు ఉన్నాయి. 111 మంది డ్రైవర్‌లు, 86 మంది కండక్టర్‌లు విధులు నిర్వహిస్తున్నా రు. ఈ డిపో పరిధిలో ప్రధానంగా జగద్గిరిగుట్ట, ఉప్పల్, హనుమకొండ రూట్‌లలో అత్యధికంగా సర్వీసులు నడుపుతు న్నారు. ప్రధానంగా ఆర్టీసీ డిపోలకు మహాలక్ష్మీ ద్వారా అత్యధిక ఆదాయం ఉన్నా సర్వీసులు నడపడంలో మాత్రం అధికారులు సరైన శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



బస్సు సామర్థ్యానికి మించి ఎక్కుతున్న ప్రయాణికులు

### అదనపు డ్యూటీలతో ఇబ్బందులు

డిపోల్లో సరిపడ సిబ్బంది లేక సతమతమవుతున్నారు. డ్రైవర్ల కొరత ఎక్కువగా ఉంటుంది. దీంతో డ్రైవర్లకు అదనపు విధులు కేటాయిస్తున్నారు. విశ్రాంతి లేకపోవడం, అత్యవసర, వ్యక్తిగత పనులతో విధులు నిర్వర్తించలేమని చెప్తున్నా అధికారులు డూటీ లు చేయాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు అధికారుల మాటలు వినకపోతే వేధింపులు తప్పవని అదనపు డూటీలు చేస్తున్నారు. తొర్రూరు డిపోలో ప్రధానంగా ఉప్పల్ రూట్‌లో నడిచే డీలక్స్ బస్సులు సర్వీస్ పూర్తైనా ఉన్నతాధికారుల మెప్పు కోసం అధికారులు రిపేర్‌లు చేయించి మరీ నడిపిస్తున్నా రని, ప్రయాణీకుల భద్రత, సౌకర్యాల దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని బస్సు సర్వీసులు నడపాలని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు.

## సమాజ చైతన్యం కోసం
# 'ప్రజ్ఞాభారతి' సదస్సులు



గ్రంథాలను పరిచయం చేస్తున్న కోవెల సంతోష్, కస్తూరి మురళీకృష్ణ

హనుమకొండ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతోపాటు సమాజంలో సంస్కృతి, ధార్మిక భావనలాంటి అంశాల్లో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రజ్ఞాభారతి విశేష కార్యక్రమాలను నిర్వహిస్తూ తనకంటూ ఒక స్థానం సంపాదించుకుందని ఆచార్య ఎల్లప్రగడ సుదర్శన్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని ఐఎంఏ హాలులో ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ఎండ్ ఆఫ్ ద ఎర నిజాం సురల్ ఆఫ్ లాస్ట్ డే' తెలుగు భాషలోకి అనువదించిన కొత్త గ్రంథాన్ని ప్రముఖ రచయిత కస్తూరి మురళీకృష్ణ పరిచయం చేయగా మరో ప్రముఖ రచయిత, పాత్రికేయుడు కోవెల సంతోష్ కుమార్ తాను రాసిన కల్లోల భారతం నేపథ్యాన్ని ఈ కార్యక్రమంలో వివరించారు. దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదం పేరుతో విచ్ఛిన్నకర శక్తులు పెట్రేగిపోతూ దేశ సమగ్రతకు శాంతికి ఎలా విఘాతం కల్పిస్తున్నారో తద్వారా ప్రజలు పడే బాధలను వివరించినట్లు చెప్పారు. ఈ రెండు గ్రంథాలు హైదరాబాద్‌లో ఆవిష్కరణ జరగగా వరంగల్ సాహితీ లోకానికి ఆదివారం ప్రత్యేకంగా పరిచయం చేశారు. సహృదయ అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు, ఆచార్య రామాచంద్రమౌళి, సామిత్రి లక్ష్మణాచార్య, మల్యాల మనోహర్‌రావు, తదితర అనేక మంది భిన్న రంగాల ప్రముఖులు పాల్గొన్న కార్యక్రమం ప్రజ్ఞా భారతి పక్షాన బాలకృష్ణ వందన సమర్పణతో ముగిసింది. ఈ సందర్భంగా ఇరువురు గ్రంథకర్తలను ప్రజ్ఞాభారతి నిర్వాహకులు సత్కరించారు.

## ఇళ్ల పంపిణీ చేయకుంటే ఓటమి తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

తొర్రూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో పేదల ఆగ్రహానికి గురికాక తప్పదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బందు సాయిలు అన్నారు. ఆదివారం తొర్రూరులోని విశ్రాంతి భవనం వద్ద పట్టణంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంచాలని దీక్షలు చేస్తున్న వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పేదలు గంప గుత్తగా ఓట్లువేసి గెలిపించారని, పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చి ఎన్నికల తర్వాత వారిని మర్చిపోవడం సిగ్గుచేటు అన్నారు. సామాజిక వేత్త డొనికెన కుమారస్వామి దీక్షలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అశోక్, యాకూబ్, దర్గయ్య, రవి పాల్గొన్నారు.

## కేసు జాప్యంపై ఎస్పీకి ఫిర్యాదు

మరిపెడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ బృందం ఇటీవల మరిపెడలోని నకిలీ వైద్యులను గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అక్కడి పోలీసులు కేసు నమోదు చేయడంపై జాప్యం చేస్తుండడంతో ఆదివారం మెడికల్ కౌన్సిల్ బృందం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథన్ కేకన్‌కు ఫిర్యాదు చేశారు. మరిపెడబంగ్లాలో గత కొంత కాలంగా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న నకిలీ వైద్యులను పట్టుకొని ఎస్పీకి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయట్లేదని వివరించారు. ఈ మేరకు మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు డాక్టర్ నరేశ్‌కుమార్, డాక్టర్ వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## జీడికల్‌లో వైభవంగా చక్రస్నానం

లింగాలఘణపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం సు ప్రసిద్ధ జీడికల్ పుణ్యక్షేత్రంలో కార్తీక మాస బ్రహ్మోత్సవ వేడుక ల్లో భాగంగా ఆదివారం శ్రీరామ చంద్రస్వామి వారికి జీడిగుండం, పాలగుండాల్లో చక్రస్నానం వైభ వంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన చక్రస్నానం కార్యక్ర మంలో ఆలయ అర్చకులు భార్గ వాచార్యులు, మురళీధరాచార్యులు తో పాటుగా వేదపండితులు శ్రీని వాసాచార్యులు,బీట్కూరు విజయ సారధిచార్యులు ఆలయ సంప్ర దాయ కైంకర్యాలు నిర్వహించారు. చక్రస్నానం అనంతరం గుట్టమీది నుంచి మాడవీధుల గుండా స్వామివారిని మేళతాళాల నడుమ పల్లకిసేవలో ఊరేగించారు.

కార్యక్రమంలో ఈవో చిందం వంశీ, రిటైర్డు ఈవో కెకె రాములు, ఆలయ ఛైర్మన్ ఏలె మూర్తి ఆలయ సిబ్బంది భరత్‌కుమార్, మల్లేశంతో పాటుగా భక్తులు పాల్గొన్నారు.



పాలగుండంలో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

## కార్మికుల పక్షం సీఐటీయూ

- రాష్ట్ర కార్యదర్శి మాధవి




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి

మరిపెడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ ఎప్పటికీ అసంఘటిత కార్మికుల పక్షం నిలుస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి అన్నారు. ఆదివారం సీఐటీయూ సంఘ విస్తృత సమావేశం కొండ ఉప్పలయ్య, కుమ్మరికుంట్ల జ్యోతి అధ్యక్షతన జరుగగా ఆమె పాల్గొని మాట్లాడారు. అనేక ఏళ్లుగా సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 28, 29 తేదీలలో మరిపెడ బంగ్లాలోని కనకదుర్గ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా మహాసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మహాసభలకు పెద్ద ఎత్తున వివిధ రంగాల అసంఘిటిత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, బెస్త సంపూర్ణ, దుండి వీరన్న, మల్సూర్, భిక్షం, ముత్తయ్య, వెంకన్న, వాసు, సైదులు, జామూర్తి, లీలాబాయి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

మరిపెడ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లంపేట విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టును మంగళవారం ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం ఛైర్ పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలచారి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్చుట, వోల్టేజీ హెచ్చు తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలున్న మీటర్లు మార్చడం, నూతన సర్వీస్‌ల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీరణ, సర్వీస్ పేరు మార్పు, సర్వీస్ రద్దు తదితర వాటికి సంబంధించిన విద్యుత్ వినియోగదారులు రాత పూర్వకంగా తమ ఫిర్యాదులు అందించవచ్చని ఆయన తెలిపారు.

## ఏఐకేఎంఎస్ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎం ఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మండలంలోని గుండంరాజుపల్లికి చెందిన బండపల్లి వెంకటేశ్వర్లు ఆది వారం ఎన్నికయ్యారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఆ సంఘం మహాసభలో వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సంఘ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతు కూలీల సమస్యలపై నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు.

## సత్యనారాయణస్వామి వ్రతంలో రెడ్యా

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన మంచాల గౌరి శంకర్ నూతన గృహప్రవేశం సందర్భంగా ఆదివారం ఆయన ఇంట్లో నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రత పూజలో మాజీ మంత్రి రెడ్యానాయక్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరిశంకర్ దంపతులను రెడ్యానాయక్ అభినందించారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# మేడారం భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- పలు రాతి కట్టడాల పనులు ప్రారంభం

తాడ్వాయి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మేడారంలో అభివృద్ధి పనులు సాగుతున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో కలెక్టర్ దివాకరతో కలిసి ఆమె ఆదివారం పర్యటించారు. దేవస్థానం శాశ్వత పనులు, మహా జాతర అభివృద్ధి పనులను పరిశీలించారు. వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను దర్శించుకున్నారు. శాశ్వత అభివృద్ధిలో భాగంగా పలు రాతి కట్టడాల పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. మహాజాతరకు ముందు వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు తరలివస్తున్న క్రమంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దని అన్నారు. మహా జాతరను విజవంతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. సమ్మక్క- సారలమ్మల కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తం చేయడానికి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రానున్న మహా జాతరలో హనుమకొండ నుంచి తాడ్వాయి వరకు వ్యాపారాలు చేసుకొనేందుకు వారికి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఇందుకు ఆర్థిక సహాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ రేగ కళ్యాణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మేడారంలో రాతి కట్టడాల పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

# బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుంటే అగ్గి రాజేస్తాం




రన్ ఫర్ సోషల్ జస్టిస్‌లో పాల్గొన్న బీసీ జేఏసీ నాయకులు

హనుమకొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు చేయకుంటే రాష్ట్రంలో అగ్గి రాజేస్తామని ఉమ్మడి వరంగల్ జేఏసీ ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ హెచ్చరించారు. రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు పబ్లిక్‌గార్డెన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించగానే బీసీ రిజర్వేషన్‌లను పక్కకు పెట్టి స్థానిక ఎన్నికలకు వెళ్తామనడం ద్వారా కాంగ్రెస్ అసలు రంగు బయటపడిందన్నారు. 42 శాతం రిజర్వేషన్ కోసం సీఎండీ ఢిల్లీకి వెళ్లి ఉద్యమించాలన్నారు. రాబోయేరోజుల్లో జరిగే ఎన్నికల్లో బీసీ, ఓసీల మధ్యలోనే పోటీ ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, బీసీ జేఏసీ నాయకులు కూరపాటి రమేశ్, బొనగాని యాదగిరి, మూగల కుమార్, డాక్టర్ చిర్ర రాజు, తుపాకుల రవి, సంగాని మల్లేశ్వర్, తుమ్మల శోభ రాణి, పద్మజ దేవి, ఆనందం, నాగరాజు, చంద్రమౌళి, జగన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు జిల్లాలను ఏకం చేయాలి

హనుమకొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏకం చేసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషిచేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర ఛైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అభ్యర్థించారు. ఆదివారం జరిగిన తెలంగాణ ఉద్యమకారుల వేదిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి అంటే కేవలం హైదరాబాద్ వరకే పరిమితమైపోయిందన్నారు. ఉత్తర తెలంగాణను పూర్తిగా విస్మరించారన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల రాష్ట్ర వేదిక కో- ఆర్డినేటర్ సోమ రామమూర్తి, విశ్రాంత అధ్యాపకులు బాబురావు, ధర్మేంద్ర, పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సంగాని మల్లేశ్వర్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఛైర్మన్ సాయిని నరేందర్, సమ్మయ్య, రాచకొండ ప్రవీణ్, సోమిడి శ్రీనువాస్, చాపర్తి కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

## ఓపీఎస్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న బత్తిని వెంకటరమణాగౌడ్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని మర్కజీ పాఠశాలలో ఆదివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటరమణగౌడ్, ప్రధాన కార్యదర్శి ఉప్పుల సతీష్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. రాయపర్తి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జయపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు; వర్ధన్నపేట- వి.సదానందం, అంజయ్య; వరంగల్- మీస నవీన్, ముసుగు రాములు; పర్వతగిరి- ఆనంద్ మోహన్, విజయభాస్కర్‌రావు; చెన్నారావుపేట-రమణయ్య, రామకృష్ణ; నర్సంపేట- చిర్ర ప్రసాద్, బొడిగె రమేశ్; నల్లబెల్లి-గిరిధర్, లక్ష్మయ్య; ఖానాపూర్-వెంకటేశ్వరాచారి, వీరన్న; గీసుగొండ- ఎ.ప్రసాద్, దుగ్గొండి- రామకృష్ణ, ఎం.సతీష్‌ను ఎన్నుకున్నారు.

## గంజాయి పట్టివేత

రేగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి పోలీసులు అరెస్టు చేశారు. గణపురం సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రేగొండ మండలంలోని కొత్తపల్లి(కె) గ్రామ శివారులో ఎస్సై దివ్య తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అటువైపు వచ్చారు. పోలీసులను చూసి వారు పారిపోయారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా వారి దగ్గర 2 కిలోల 300 గ్రాముల గంజాయి, 53 గంజాయి చాక్లెట్లు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బిహార్ రాష్ట్రానికి చెందిన రాము యాదవ్, కుందన్‌కుమార్, సంతోష్‌కుమార్‌గా గుర్తించామని అన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు.

## అటవీ ప్రాంతంలో బైక్ దహనం

కాటారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లి, వీరాపూర్ మధ్య అటవీ ప్రాంతంలో ఓ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుడు శంకరంపల్లికి చెందిన గొర్రెల కాపరి పర్శమేన శేఖర్ ఈ విషయం ఆదివారం వెల్లడించారు. శంకరంపల్లికి చెందిన పలువురు గొర్రెల పెంపకందారులు, కాపరులు గొర్రెలను మేత కోసం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో గుమ్మళ్లపల్లి అటవీప్రాంత సమీపంలో గొర్రెలను మేపడానికి వెళ్లారు. భోజనంతో పాటు ఇతర వస్తువు లను తెచ్చుకోవడానికి బైక్‌లను సైతం వెంట తీసుకెళ్లారు. శనివారం ఓ చోట బైక్‌ను పెట్టి గొర్రెలను మేత కోసం తోలుకెళ్లగా కొద్దిసేపటి శేఖర్‌కు చెందిన బైక్ పూర్తిగా కాలిపోతూ కనిపించింది. సంఘటన స్థలానికి వచ్చేసరికి దూరం నుంచి ఓ బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లినట్లు, కావాలనే ఎవరో బైక్‌ను కాలబెట్టినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బైక్ దగ్ధం సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## నకిలీ వైద్యుల వద్ద చికిత్స పొందొద్దు



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ నరేశ్ కుమార్

వరంగల్ మెడికల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అర్హత లేని నకిలీ వైద్యుల వద్ద చికిత్స పొందొద్దని డాక్టర్ వేములపల్లి నరేశ్ కుమార్ తెలిపారు. నర్సంపేట సమీపంలోని మంగళవారిపేటలో నకిలీ వైద్యులు నిర్వహించిన అర్షమొలల ఆపరేషన్ వికటించి తీవ్ర ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రజనీకాంత్ కేసును తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించినట్లు తెలిపారు. నకిలీ వైద్యుడు భైరు చిట్టిబాబు, అర్హతలేని వృద్ధురాలు కొత్తపల్లి కౌసల్య ఆపరేషన్ నిర్వహించిన ప్రదేశాన్ని డాక్టర్ వెంకటస్వామితో కలిసి డాక్టర్ నరేశ్ కుమార్ పరిశీలించారు. నకిలీ వైద్యులపై ఎన్ఎంసీ, టీఎంపీఆర్ చట్టాల ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు నరేశ్‌కుమార్ తెలిపారు.

## ముగ్గురు విద్యుత్ సిబ్బంది సస్పెన్షన్

### జగిత్యాల సర్కిల్‌లో మద్యం తాగిన ఘటనపై చర్య

రాంనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని జగిత్యాల సర్కిల్ టౌన్-1 సెక్షన్ కార్యాలయం ఓఅండ్ఎం స్టాఫ్ రూమ్‌లో శనివారం మద్యం పార్టీ చేసుకున్న ముగ్గురు అసిస్టెంట్ లైన్‌మెన్‌లు ఎ.ప్రభాకర్, జి.బాలకృష్ణ, వి.రాజశేఖర్‌లను సస్పెండ్ చేస్తూ టీజీ ఎన్పీడీసీఎల్ జగిత్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ ఘటనపై సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పందిస్తూ 17 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ సంస్థల ప్రాంగణాల్లో ఎలాంటి అనైతిక చర్యలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఉద్యోగి ప్రవర్తన నియామాలను ఉల్లంఘిస్తే విధుల్లో నుంచి తొలిగిస్తామని హెచ్చరించారు. దీనికి సంబంధించి హెచ్ఆర్‌డీ విభాగం నుంచి అడ్వైజరీ మెమోను జారీ చేసినట్లు పేర్కొన్నారు.

# పత్తిష్టంభన!

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది.

**పత్తి రైతులు పరేషాన్**

సీసీఐ నిబంధనలతో ఇప్పటికే ఆగమాగం అవుతున్న పత్తి రైతులు.. జిన్నింగ్ మిల్లుల బంద్ పిలుపుతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సీసీఐ ఈ ఏడాది కొత్తగా తీసుకువచ్చిన కపాస్ యాప్‌లో పత్తి అమ్ముకునేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవటం రైతులకు సవాల్‌గా మారింది. కపాస్ యాప్‌లో సూచించిన కేంద్రాల్లోనే పత్తి అమ్ముకోవాల్సి ఉండటంతో రైతులకు దూరభారం తప్పటం లేదు. దీనికి తోడు ఎకరాకు ఏడు క్వింటాళ్లే కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించటంతో పాటు కపాస్ యాప్‌లో ఈ మేరకు నిబంధనలను చేర్చటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు అంతర్ జిల్లా నిబంధనలను సీసీఐ తీసుకవచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోనే పత్తిని సీసీఐకి విక్రయించాలి. దీంతో చాలా మంది రైతులు పెద్ద మార్కెట్‌లో పత్తిని విక్రయించే అవకాశాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా జిన్నింగ్ మిల్లులు సోమవారం నుంచి బంద్‌కు పిలుపునివ్వటంతో రైతులు మరింత గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌తో పాటు జనగామ, మహబూబాబాద్, కేసముద్రం, పరకాల, ములుగు, భూపాలపల్లి, కాటారం తదితర వ్యవసాయ మార్కెట్‌లతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని అమ్ముకునేందుకు సోమవారం స్లాట్ బుక్ అయింది. శుక్రవారం వరకు కూడా రైతులు స్లాట్ బుక్ చేసుకున్నారు. రైతులు స్లాట్ బుక్ కావటంతో ఆగమేఘాల మీద చేనులో ఉన్న పత్తిని తీసి తేమ తగ్గాలని ఎండకు ఆర పెట్టారు. మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న వేళ.. జిన్నింగ్ మిల్లుల బంద్ రావటంతో రైతుల్లో తేమ టెన్షన్ పట్టుకుంది. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో తేమ శాతం మరింత పెరిగి మద్దతు ధర తగ్గే అవకాశం ఉందనే ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది. దీంతో ప్రవేటు వ్యాపారులను ఆశ్రయించటమా? లేదా ఇంకొన్నాళ్లు ఆగుదామా? అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు.

# తెలంగాణ అంటేనే పల్లె సౌందర్యం

- మన రాష్ట్ర సంస్కృతి మరెక్కడా లేదు
- దేవులపల్లి వాణి గ్రంథాల ఆవిష్కరణలో అంపశయ్య నవీన్



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న అంపశయ్య నవీన్ తదితరులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తరాల అంతరాలు లేకుండా తెలంగాణలోని 78 మంది కవుల కవిత్వం అంతా తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా ఉన్నాయని, తెలంగాణ అంటేనే పల్లె సంస్కృతికి ప్రధాన ఆయువుపట్టు అని ప్రముఖ నవలాకారుడు డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని వాగ్దేవి హాలులో నిట్‌కు చెందిన డాక్టర్ దేవులపల్లి వాణి కలం నుంచి జాలువారిన 'విశ్వపరిమళ వీచిక' కవితా సంపుటితోపాటు 78 మంది కవుల సాహిత్యంతో కూడిన యాసంగి ముచ్చట్లు గ్రంథాలను అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఐనంపూడి శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సాహిత్య సమావేశంలో నవీన్ మాట్లాడుతూ.. 1968 నుంచి 2024 వరకు సాగిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, విశ్వాసాలు, అలవాట్లు అన్ని కలగలిపిన ప్రముఖుల కవితలతో అక్షర సుమమాలలు అద్భుతంగా ఉన్నాయని, వాటన్నింటినీ ఒకచోట ఏర్చికూర్చిన డాక్టర్ వాణిదేవిని అభినందించారు. వాణిదేవి కవిత్వంలో అందె వేసిన చేయి అని పల్లె సౌందర్యాన్ని ప్రతిబింబించేలా కందిలి కవితను అద్భుతంగా రాసిందని ప్రశంసించారు. సాయంకాలానికల్లానే ఆ రాత్రి వెలుగులు పంచడానికి అందంగా ముస్తాబయ్యేది కందిలి అంటూ ఆమె రాసిన సాహిత్యాన్ని ఉదాహరించారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతీ అంశానికి స్పందించి ప్రతీ సందర్భాన్ని కవితామయం చేసిన దేవులపల్లి వాణి కలం సాహితీలోకంలో ప్రత్యేకమైందని అన్నారు. వెన్నెల మడుగు, సంపెంగల యాసంగి, శబ్దరాగం, అమ్మ ఇలా వాత్సల్యంగా నడిమిన కవితల సమూహంలో ప్రతీ కవితా పాఠకుడిని ఆసక్తికరంగా చదివింపజేసేలా రాసిన తీరును ప్రశంసించారు. ప్రముఖ రచయిత, గాయకుడు మిట్టపెల్లి సురేందర్ ప్రత్యేక అతిథిగా పాల్గొని తన పాటలతో సాహితీ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఐసీఎస్ వైస్ ప్రెసిడెంట్ దేవులపల్లి రమణ, కాకతీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు బన్న అయిలయ్య మాట్లాడుతూ.. ఓరుగల్లు సాహితీక్షేత్రంలో తనకంటూ సుస్థిర స్థానం సంపాదించుకున్న రచయిత్రిగా దేవుపల్లి వాణి ఉంటుందన్నారు. 33 కవితలు, మూడు గేయ కవితలు, గజల్, ఆంగ్ల అనువాద కవితల సమాహారం, విశ్వపరిమళ వీచిక అంటూ ఈ కావ్యమంతా సాహిత్య గుబాళింపేనని ఐనంపూడి శ్రీలక్ష్మీ అన్నారు. నెల్లుట్ల రమాదేవితో పాటు అనేక మంది సాహితీప్రియులతో సమావేశ హాలు కిక్కిరిసిపోయింది.

# క్రీడల్లో ప్రతిభ చూపితే ప్రపంచం నీవైపే..

- అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం చెమటోడ్చాలి
- ఓరుగల్లు ఖిల్లా క్రీడాకారులకు పుట్టినిల్లు
- యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- హనుమకొండ జేఎన్ఎస్‌లో క్రీడా పాఠశాల ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటలే శ్వాసగా కఠోర సాధనతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై విజయం సాధిస్తే యావత్ ప్రపంచం నీవైపు చూస్తుందని యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్)ఆదేశాలతో హనుకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా పాఠశాలను ఆదివారం మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలకు పుట్టినిల్లులాంటి ఓరుగల్లు ఖిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ, ఒలంపిక్స్ క్రీడల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన ఘనత ఇక్కడి క్రీడాకారులకు ఉందని కొనియాడారు. రూ.132 కోట్ల అంచనా వ్యయంతో హనుమకొండలో త్వరలో శాశ్వతంగా క్రీడా పాఠశాలను ఏర్పాటు చేస్తామన్నారు. స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారుడు, విజన్ కలిగిన సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకరావడానికి స్పోర్ట్స్ పాలసీ ప్రవేశపెట్టి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల సమష్టి కృషితో హనుమకొండలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేశామన్నారు.

జాతీయ, అంతర్జాతీయ, ఒలంపిక్స్ క్రీడల్లో ప్రతిభ చూపించి రాణించిన నిజామాబాద్‌కు చెందిన నిఖత్‌జరీన్, హైదరాబాద్‌కు చెందిన క్రికెటర్ మహ్మద్ సిరాజ్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన జీవాంజి దీప్తిలకు నగదు పారితోషికంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను అందించామని మంత్రి పేర్కొన్నారు. 4కోట్ల జనాభా కలిగిన తెలంగాణలో ఒలంపిక్స్‌లో ఒక్క స్వర్ణ పతకం తీసుకరాకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ జనాభా కంటే తక్కువగా ఉన్న సౌత్ కొరియా దేశ క్రీడాకారులు గడిచిన ఒలంపిక్స్‌లో పలు క్రీడల్లో 36స్వర్ణ పతకాలు సాధించారని గుర్తు చేశారు. క్రీడల్లో తెలంగాణ వెనుకబడటం సరికాదని, క్రీడల్లో రాణించడం కోసం క్రీడాకారులు అహర్నిషలు శ్రమించాలని సూచించారు. క్రీడారంగంలో ఉద్యోగ ఉపాధి, అవకాశాలు పెంచుతున్నామన్నారు. క్రీడా పాలసీ ద్వారా ప్రతీ జిల్లాలో ఆధునిక స్టేడియాలను, శిక్షణ కేంద్రాలను, క్రీడా పరికరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ హబ్ ఆఫ్ ఇండియాగా ఎదగడానికి స్పోర్ట్స్ పాలసీ ప్రధాన లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారిగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీని స్థాపించిందన్నారు. గురు వందనం కింద తెలంగాణ క్రీడా విభాగం కోచ్‌ల కోసం మొదటిసారిగా ప్రత్యేక సంక్షేమ పథకం ప్రారంభించదని, ఈ పథకం ద్వారా కోచ్‌లకు రూ.15లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తోందని తెలిపారు. యంగ్ ఇండియా - 2025 పేరుతో సమ్మర్ క్యాంపులు పెట్టి గ్రామీణస్థాయిలో క్రీడలను ప్రొత్సహిస్తామన్నారు. గ్రామీణస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం కప్ పోటీలను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించి క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్సులను అందించామన్నారు. తెలంగాణ క్రీడా పాఠశాలల్లో చదువుతూ క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు చదువులతో పాటు మూడు, ఆరు నెలలు, యేడాదికోసారి క్రీడల్లో పోటీలు నిర్వహించాలని మంత్రి సూచించారు. కాగా, టోక్యోలో జరుగుతున్న డెఫ్‌లింపిక్స్‌లో 10మీటర్ల షూటింగ్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ధనుష్‌శ్రీకాంత్ స్వర్ణ పతకం సాధించారని తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి అతడికి రూ.1కోటి 20లక్షల పారితోషికాన్ని అందించనున్నట్లు ప్రకటించారు.

సాట్ వీసీ అండ్ ఎం.డి. సోని బాలదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే వివిధ జిల్లా కేంద్రాల్లో మూడు క్రీడా పాఠశాలలు ఉండగా, ఇక్కడ హనుమకొండలో 4వ పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. సాట్ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. క్రీడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మూణ్నెళ్లకోసారి క్రీడా పోటీలు నిర్వహించాలని ఆయన సూచించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కృషితోనే జేఎన్ఎస్‌లో తాత్కాలికంగా క్రీడా పాఠశాల ప్రారంభమైందన్నారు. జేఎన్ ఎస్‌లోని బస్టాండ్ వైపు ఖాళీగా ఉన్న స్థలంలో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టేందుకు గతంలో ప్రణాళికలు రూపొం దించామని, ఇది నిర్మాణం చేయడం వలన డీఎస్ఏకు ఫండింగ్ చేకూరుతుందని ఎమ్మెల్యే నాయిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వరంగల్ నగరంలో క్రీడా పాఠశాల, అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించగా తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారని గుర్తు చేశారు. త్వరలో ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల ఓఆర్ఆర్ సమీపంలోని ప్రభుత్వ భూమిలో 20 ఎకరాల్లో పూర్తి స్థాయిలో క్రీడా పాఠశాలను నిర్మాణంతో పాటు క్రికెట్ స్టేడియం కోసం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు మాట్లాడుతూ.. డ్రగ్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తికి నగరంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలం నేటికీ అందలేదని, ఆ క్రీడాకారిణికి స్థలం అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని నాగరాజు కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహాశబరీష్ మాట్లాడుతూ... క్రీడా పాఠశాలలో ప్రస్తుతం 40మంది బాలురు, 40మంది బాలికలకు వసతి ఏర్పాటు చేయగా, ఇందులో 23 మంది బాలురు, 25 మంది బాలికలు 4వ తరగతిలో ప్రవేశాలు తీసుకున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఎమ్మెల్యేలు, జిల్లా అధికార యంత్రాంగం క్రీడా పాఠశాల వసతి గృహంలో చిన్నారులతో కలిసి భోజనం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు ఉన్నాధికారులు, డీఎస్‌ఏ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## విజయ డెయిరీ అభివృద్ధికి కృషి చేస్తా..

**రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

హనుమకొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని విజయ డెయిరీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని విజయ డెయిరీని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విజయ డెయిరీలోని వినియోగిస్తున్న మిషనరీ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డెయిరీలోని ల్యాబొరేటరీ, కోల్డ్‌రూమ్, మిల్క్ ప్యాకింగ్ విభాగాలను పరిశీలించారు. ఈ డెయిరీ 1969లో ప్రారంభించగా ప్రస్తుతం 15వేల లీటర్ల సామర్థ్యంతో డెయిరీ నడుస్తోందన్నారు. డెయిరీని ఆధునిక టెక్నాలజీలో లక్ష లీటర్ల సామర్థ్యంతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేలు, అధికారులకు ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌ను సమర్పించాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో విజయ డెయిరీ అవుట్‌లెట్‌ను మంత్రి వాకిటి శ్రీహరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదులుతున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

# చేపల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తా..

**రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

ధర్మసాగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్, ధర్మసాగర్ రిజర్వాయర్ మధ్య చేపల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కోసం కృషి చేస్తామని పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ఆయనతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ నాయకులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ చేపట్టి మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేతో కలిసి రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు.

రాష్ట్రంలోని మత్స్యకారుల కోసం ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తోందన్నారు. మత్స్యకారుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్టు ఆయన తెలిపారు. చేపలతో పాటు త్వరలో 300 చెరువుల్లో రొయ్యల పెంపకాన్ని చేపడుతామని తెలిపారు. మత్స్యకారులు నష్టపోకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువులు, రిజర్వాయర్ల తూముల వద్ద నుంచి చేపలు బయటకు పోకుండా ప్రత్యేక జాలీలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26,600 చెరువులు ఉండగా మొదటిసారి రాష్ట్రంలో 123.కోట్లతో చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. హనుమకొండ జిల్లాలో 2 కోట్ల 25 లక్షల చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. మత్స్యకారుల సభ్యులకు ఒక కోటి 40లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యల పట్ల మంత్రికి పూర్తి అవగాహన ఉందన్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నాలుగు వైపులా కాలువలు ఉన్నాయని వాటి వల్ల చేపలు బయటకుపోయి మత్స్యకారులు నష్టపోతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన వెంటనే స్పందించి తూములు, కాలువలు, గేట్ల వద్ద జాలీలను ఏర్పాటు చేస్తామని, మంత్రి మత్స్యకారులకు హామీ ఇచ్చారన్నారు. మత్స్య సహకార సొసైటీలలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు సభ్యత్వం ఇవ్వాలన్నారు. మరణించిన మత్స్యకార సొసైటీ సభ్యులకు అందాల్సిన పరిహారం అందడం లేదని, ప్రత్యేక దృష్టి పెట్టి పరిహారం అందించాలని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నిఖిల, జిల్లా కలెక్టర్ స్నేహ సశబరీష్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో రహదారులు కీలకం

- రోడ్ల నిర్మాణంలో నవ ఆవిష్కరణలకు వరంగల్ నిట్ కృషి
- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి
- రోడ్ల ప్రాజెక్టుల్లో జియో సింథటిక్స్‌పై వర్క్‌షాప్ షురూ



వర్క్‌షాపులో పాల్గొన్న డైరెక్టర్ సుబుధితో ఇతర ప్రతినిధులు

హనుమకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో, ముఖ్యంగా పరిశ్రమల విస్తరణలో రహదారుల వ్యవస్థబూ కీలక భూమిక పోషిస్తుందని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ సుబుధి అన్నారు. ఆదివారం 'వరంగల్ ఎన్ఐటీలో రోడ్డు నిర్మాణ ప్రాజెక్టుల్లో జియోసింథటిక్స్ వినియోగాలు' అనే అంశంపై 5రోజుల స్వల్పకాలిక శిక్షణా కోర్సు ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణంలో అత్యాధునికమైన పద్ధతులను, సరికొత్త మెటీరియల్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకుకోసం వరంగల్ ఎన్ఐటీ తన వంతు కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్, నవ ఆవిష్కరణల కోసం ఒక కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్-సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ) డైరెక్టర్ ప్రొఫెసర్ మనోరంజన్ పరీదా మాట్లాడుతూ.. సీఆర్ఆర్ఐ ల్యాబ్‌లను, సంస్థకు సంబంధించిన వెబ్‌సైట్‌నూ సందర్శించాల్సిందిగా వరంగల్ ఎన్ఐటీ విద్యార్థులను, కాబోయే సివిల్ ఇంజనీర్లను ఆహ్వానించారు. సీఆర్ఆర్ఐ ల్యాబ్‌ల్లో ఇంటర్న్‌షిప్‌తో పాటు ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నామన్నారు. సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ చీఫ్ సైంటిస్టు, ఐఎల్‌టీ అధిపతి, వరంగల్ నిట్ పూర్వ విద్యార్థి కాయిత రవీందర్ మాట్లాడుతూ.. ప్రయాణాల్లో, సరుకుల రవాణాలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వీలైనంతమేరకు తగ్గించడానికి రహదారుల నిర్మాణం, రవాణా ప్రణాళికల ఆవశ్యకతను వివరించారు. ప్రాజెక్టు డైరెక్టర్, చీఫ్ సైంటిస్టు డాక్టర్ పీఎస్ ప్రసాద్ ఎన్‌టీటీఎం కార్యక్రమం, ఇలాంటి ఫలవంతమైన కోర్సుల నిర్వహణలో వివిధ లక్షిత సంస్థల కృషిని తెలియజేశారు.

సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్టు, వర్క్‌షాపు సమన్వయకర్త డాక్టర్ జి.భరత్ కోర్సులోని అంశాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ నేషనల్ టెక్స్‌టైల్ మిషన్ (ఎన్ఐటీటీఎం) సౌజన్యం, ఎన్ఐటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ ఈ కోర్సును నిర్వహిస్తోంది. ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో చదివే బీటెక్ విద్యార్థులను సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ క్షేత్ర నిపుణులు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా వీరిని సిద్ధంగా ఉంచాలన్నదే ఈ కోర్సు లక్ష్యం. సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ చీఫ్ సైంటిస్టులు ప్రొఫెసర్ మనోరంజన తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. సివిల్ విభాగం అధిపతి డాక్టర్ జీవీ రమణ, డాక్టర్ ఎస్.శంకర్, డాక్టర్ వై.సుధీర్, ప్రొఫెసర్ ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థినుల అరిగోస

- జవహర్‌నగర్‌లో సౌకర్యాల లేమిపై ఆందోళన
- రాత్రి రోడ్డుపై బైఠాయించి నినదించిన విద్యార్థినులు
- అదే సమయంలో హాస్టల్ వద్ద ఆకతాయిల హల్‌చల్
- విచారణ చేపట్టిన డీఈవో.. ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్



మోడల్ స్కూల్ ముందు బైఠాయించిన విద్యార్థినులు

వెంకటాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని జవహర్ నగర్‌లో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థినులు శనివారం రాత్రి రోడ్డెక్కారు. హాస్టల్‌లో అనేక సమస్యలు నెలకొన్నాయని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని నినదించారు. సమస్యలను దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది తమ పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నారని నిరసన తెలిపారు. ప్రహరీ లేకపోవడంతో కొంతమంది ఆకతాయిలు రాత్రివేళల్లో లోపలికి చొరబడి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్‌రూంలకు డోర్లు లేక నానా అవస్థలు పడుతున్నామని, మంచాలు లేక కిందనే నిద్రపోతున్నామని అన్నారు.

**ఆకతాయిల హల్‌చల్**

జవహర్‌నగర్ మోడల్‌స్కూల్‌లోని హాస్టల్‌లో 50 మంది విద్యార్థినులు ఉంటున్నారు. తమకు ఎదురవుతున్న సమస్యలపై సుమారు 30 మంది విద్యార్థినులు హాస్టల్ ఎదుట శనివారం రాత్రి 10గంటల ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మిగతా 20మంది విద్యార్థినులు హాస్టల్‌లోనే ఉండి చదువుకుంటున్నారు. ఈ క్రమంలో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు హాస్టల్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని హల్‌చల్ చేశారు. 'మీ ఎస్‌వో మమ్మల్ని ఇక్కడికి పంపింది. డోర్ తీయండి' అంటూ హంగామా చేశారు. విద్యార్థినులు భయంతో డోర్ తీయకపోడంతో 'వీళ్ల డోర్ తీస్తలేరు.. గన్స్ తీయండిరా వీళ్ల సంగతి చూద్దాం' అనడంతో విద్యార్థినులు భయభ్రాంతులకు గురై తమ గదుల్లోకి వెళ్లిపోయారు. కిటికీల్లో నుంచి విద్యార్థినులు కేకలు వేయగా ధర్నా చేస్తున్న విద్యార్థినులు హుటాహుటిన హాస్టల్‌కు చేరుకోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు పారిపోయారు. చీకటి ఉండటం వల్ల వారిని గుర్తించలేకపోయామని విద్యార్థినులు తెలిపారు. గతంలో కూడా మూడు పర్యాయాలు కూడా ఇలాంటి సంఘటనల చోటు చేసుకున్నాయని అంటున్నారు.

**మళ్లీ ఆందోళనకు దిగిన విద్యార్థినులు**

ఇప్పటికే హాస్టల్‌లో అనేక సమస్యలు ఉండగా వాటిపై నిరసనకు దిగిన తమను గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించడం పట్ల విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఆదివారం కూడా హాస్టల్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తాము శనివారం రాత్రి నిరసనకు దిగగా అదే సమయంలో హాస్టల్‌లోనే ఉన్న విద్యార్థినులను నలుగురు దుండగులు బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగతాయిలు ఇలా రావడం ఇది కొత్తేమీ కాదని, ఇప్పటికే రెండు మూడుసార్లు ఇలా జరిగిందని తెలిపారు. విద్యార్థినులు నిరసనకు దిగారనే సమాచారాన్ని అందుకున్న ఇన్‌చార్జి డీఈవో సిద్ధార్థరెడ్డి అక్కడికి చేరుకున్నారు. హాస్టల్‌ను ఆయన సందర్శించి పరిశీలించారు. సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే తహసీల్దార్ గిరిబాబుతోపాటు పంచాయతీ కార్యదర్శి రఘు, ఆర్ఐ బొమ్మల రమేష్, వెంకటాపూర్ వీపీవో కూడా ఈవిషయంపై ఆరా తీశారు.

**ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్**

జవహర్‌నగర్ హాస్టల్‌లోని ముగ్గురు ఉద్యోగులను జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి సస్పెండ్ చేశారు. ఆయన టైప్ 4 హాస్టల్‌ను సందర్శించి భోజనం నాణ్యత, హాస్టల్ పరిశుభ్రత, తాగు నీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం, లైటింగ్, ఇతర మౌలిక వసతులపై సమీక్షించారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు స్పష్టమైన ఆధారాలు లభించడంతో కేర్‌టేకర్ ఎ.కవిత, ఏఎన్ఎం జ్యోతి, వాచ్‌మెన్ టి.అంజిలిని సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అలాగే జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పదిరోజుల్లో పరిష్కరిస్తామని డీఈవో సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. లైటింగ్ పునరుద్ధరణ పనులను ప్రారంభించామని, సోమవారం బాత్‌రూండోర్లు, గ్రీజర్లు కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. సోమవారం హాస్టల్ ఎస్‌వోపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

హనుమకొండ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో డిసెంబరు 1వ తేదీన గీత జయంతిని పురస్కరించుకొని ఈ నెల 22 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు భూపాలపల్లి శ్రీకృష్ణ కాలనీలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో, 23న జనగామలోని బాణాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, 25వ తేదీన ములుగులోని అరవింద ఉన్నత పాఠశాలలో, 29వ తేదీన వరంగల్ జిల్లా బట్టల బజార్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, 30వ తేదీన మహబూబాబాద్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో, డిసెంబరు 1వ తేదీన హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## భద్రకాళి గుడిలో కార్తీక దీపోత్సవం

వరంగల్ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం కార్తీకదీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మధ్యాహ్నం భక్తులకుఉచితంగా అన్నప్రసాదం అందించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులతో భద్రకాళి ఆలయమంతా కిటకిటలాడింది.



ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

# కోటలో పద్మశాలి వనభోజనాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ విద్య, వ్యాపార, ఆర్థిక, రాజకీయ, సామాజికరంగాలలో రాణించాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయశాఖామంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో పద్మశాలీల వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐక్యంగా అన్నిరంగాలలో రాణించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకుని వరంగల్ నగరాన్ని, కోటను అభివృద్ధి చేస్తానన్నారు. కాగా, వనభోజనాలకు 10వేల మంది పద్మశాలి కులబాంధువులు, చేనేత ప్రతినిధులు, సొసైటీ సభ్యులు, పరపతి సంఘసభ్యులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ముందుగా మార్కండేయుడికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద, ఆర్కెస్ట్రా ఆటా-పాటా తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అతిథులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్, అఖిలభారత పద్మశాలి పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం, పద్మశాలి సంఘం నాయకులు సాంబారి సమ్మయ్య, ఆడెపు రవిందర్, కుసుమ సతీష్ బాబు, డీఎస్ మూర్తి, శామంతుల శ్రీనివాస్, గొరంట్ల రాజు, బేతి అశోక్‌బాబు, బైరి శ్యామ్‌సుందర్, చిప్ప వెంకటేశ్వర్లు, ఆడెపు వెంకటేశ్వర్లు, బైరి మురళీకృష్ణ, తుమ్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

శంభునిపేట: విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించటానికి తనవంతు కృషి చేస్తానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దూపకుంట రోడ్‌లో గల మామిడి తోటలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. విశ్వకర్మలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 2 వేల మంది విశ్వబ్రాహ్మణులు తరలిరావటంతో మామిడి తోట ప్రాంగణం జాతరను తలపించింది. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వేములవాడ మదన్మోహన్, పెండోట సురేష్ కుమార్, లాలుకోట వెంకటాచారి, రామోజు నాగరాజారావు, బండ్లోజు నరసింహాచారి, అలుగోజు కృష్ణమూర్తి, పొడిశెట్టి విష్ణువర్ధన్, వీణవంక సదానందం, కాసుల ప్రతాప్, రామోజు నాగసోమేశ్వరాచారి, సిద్దోజు వీరన్న, చిట్టిమళ్ళ రమేష్, శ్రీనివాస్, శ్రీధర్, మహారాజు భరత్, కొక్కొండ విజయ్ కుమార్, సుందర మూర్తి, రమేష్, మోహన్‌రావు, చక్రపాణి, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో..

వరంగల్ కల్చరల్: కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కార్తీక మాసం వనభోజనాలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మహిళలకు పాటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం కార్తీక మాసం వనభోజనాలను ప్రారంభించారు. మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య మహాసభ ఆధ్యర్యంలో వనభోజనాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు.




భద్రకాళి ఆలయ ప్రాంగణంలో వన భోజనాల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

## నేడు బాలసముద్రంలో విద్యుత్ నిలిపివేత

రాంనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు బాలసముద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అడ్వకేట్స్ కాలనీ, భీష్మనగర్, హంటర్‌రోడ్, వరంగల్ పబ్లిక్ స్కూల్ ఏరియా, జూపార్క్ ఏరియా, బాలసముద్రం ఏరియాలో ఉదయం 9.30గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

## కేజీకేఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కాజీపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఆదివారం కాజీపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుర్ర శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండి రంజిత్‌కుమార్ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం యాదగిరి, గౌరవ సలహాదారులుగా బుర్ర సుధాకర్ లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను రాష్ట్ర అధ్యక్షుడు రమణ, గౌడ సంఘం నాయకులు అభినందించారు.



బుర్ర శ్రీనివాస్



బండి రంజిత్ కుమార్

## 'సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం'

ఖిలావరంగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్ అన్నారు. ఆదివారం 37వ, డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్, తూర్పుకోట అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో తూర్పుకోటలోని పోచమ్మ దేవాలయం ఆవరణలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. యువత డ్రగ్స్, మద్యం, గంజాయి, గేమింగ్, ఆన్‌లైన్ గేమ్స్, అపరిచితుల ప్రలోభాలకు లొంగకుండా స్వయంకృషితో రాణించాలన్నారు. వాటి నివారణకు తూర్పుకోటలో ప్రతీరోజు పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. తూర్పుకోట అఖిలపక్షం ఆధ్వర్యంలో ఇటాంటి సమావేశాలను నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు




విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేస్తున్న అతిథులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. భారతి విద్యాభవన్ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 105 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి విద్యాభవన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ తక్కళ్లపల్లి బుచ్చిబాబు మాట్లాడుతూ.. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికి ప్రశంసా పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, మాణిక్యంరావు, మంజుల, సంతోష్‌రెడ్డి, శంకర్, జనార్దన్, రామారావు, వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న ప్రొఫెసర్ అంజయ్య

హనుమకొండ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ 58వ వారోత్సవాలను పురష్కరించుకుని మూడోరోజూ హనుమకొండ జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ కార్యదర్శి కె.శశిజాదేవి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌డీఎల్‌సీఈ ప్రొఫెసర్ అంజయ్య హాజరై మాట్లాడారు. గ్రంథాలయాలను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రచయిత్రి వనిత రచించిన పాలన గ్రంథం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రంథాలయ పాఠకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు సీహెచ్ మనసూర్, ఎం.పురుషోత్తం రాజు, జి.రాజేష్, సీహెచ్ మమత, విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

### పుస్తక పఠనం అలవర్చుకోవాలి

**జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అలివేలు**

మట్టెవాడ (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. అలివేలు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం ఆయన వరంగల్ ఎల్లంబజార్‌లోని జిల్లా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్స్ చిన్నబాబు, పద్మారావు, రామచంద్రం, గ్రంథ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాశిబుగ్గలో పద్మశాలీల ర్యాలీ

వరంగల్ సిటీ, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీ కార్తీకమాసం వన భోజన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం 19, 20, 21వ డివిజన్లలోని పద్మశాలీ సంఘాల నాయకులు వాడవాడలా బైక్ ర్యాలీ నిర్వహించి బన భోజన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాశిబుగ్గ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుల్లపల్లి రాజ్‌కుమార్, నాయకులు గోరంటాల మనోహర్, వేముల నాగరాజు, బాలమోహన్, ములుక సురేష్, క్యాతం రంజిత్, మామిడి ఈశ్వరయ్య, బండారి రాజేశ్వరావు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

**మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్**



మంత్రికి వాకిటి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న మెపా ప్రతినిధులు

వడ్డెపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్థులను బీసీ-ఏలో చేర్చే అంశంపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనర్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని హనుమకొండలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో మెపా ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్థులను బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏలో చేర్పించి సామాజిక న్యాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో మెపా బృందం బోనాల రమేశ్, పులి ప్రభాకర్, మండల సమ్మయ్య, పులి రాజేష్, గోనెల విజేందర్, కె. కోటేశ్వర్, పులి మహేశ్ ఉన్నారు.

## జడ్జి కంచె ప్రసాద్‌కు సన్మానం

శంభునిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల హైదరాబాద్ ప్రిన్సిపల్ కోర్టు, అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన రంగశాయిపేటకు చెందిన జడ్జి కంచె ప్రసాద్‌ను ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. రంగశాయిపేటకు చెందిన మిత్ర బృందం సభ్యులు సత్కరించి భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుండు పూర్ణచందర్, బుక్క సతీష్ కుమార్, మండల హేమంత్, దామెరకొండ కర్ణాకర్, పాలడుగుల హరికుమార్, దేవులపల్లి కమలాకర్, కొక్కొండ భాస్కర్, ముగ్దుంపురం బుచ్చిబాబు, శెంకేసి సుధాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కంచె ప్రసాద్‌ను సన్మానిస్తున్న మిత్ర బృందం

## సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి**



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కమిషనర్, అడిషనల్ కలెక్టర్

పోచమ్మమైదాన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. ఆదివారం 22వ డివిజన్ వాసవికాలనీలో గల ఇన్నర్ వీల్ క్లబ్‌లో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(టీఎస్‌జేయూ) ఆధ్వర్యంలో నేషనల్ ప్రెస్ డే(జాతీయ పత్రిక దినోత్సవాన్ని) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర పరీక్ష, మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కమిషనర్, అడిషనల్ కలెక్టర్ హాజరై వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య శిబిరం నిర్వహించిన టీఎస్‌జేయూ జిల్లా బాధ్యులను అభినందించారు. ప్రజా సమస్యలను వెలికితీసి సమాజాభివృద్ధికి జర్నలిస్టులు కృషి చేయాలని కోరారు. అనంతరం టీఎస్‌జేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందికొండ మోహన్, కుమారస్వామి మాట్లాడుతూ.. జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుల రక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, సీఐలు కరుణాకర్ రావు, షుకూర్, బొల్లం రమేష్‌తో పాటు కోడిమాల శ్రీనివాసరావు, గజ్జె గోవర్ధన్, టీఎస్‌జేయూ నాయకులు నాగరాజు, నరేష్, శ్రీనాథ్, గంగరాజు, కృష్ణ, సత్యం, అవినాష్, శ్రీహరి, సురేష్, రాజు, అశోక్, డాక్టర్ దయాకర్ వైద్య బృందం, ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, శరత్ ఐ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముంపు సమస్యను పరిష్కరించాలి

**బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్**

గిర్మాజిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వరద ముంపు ప్రాంతాల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సత్వరం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన 27వ డివిజన్ ఎల్‌వీఆర్‌నగర్‌లో మాట్లాడారు. భారీ వర్షం పడిన ప్రతీసారి వరంగల్ గుడిసెల కాలనీలతో పాటు శివనగర్, హంటర్ రోడ్డు, కాశిబుగ్గ తదితర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. అంతర్గత రోడ్లు పాడవుతున్నాయని, మెయిన్ రోడ్డు సైతం వరదమయంగా మారుతోందని అన్నారు. సమస్య వచ్చినపుడు తాత్కాలిక చర్యలు చేపట్టడం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు చిలుకల రాజు, గణేష్‌రాజు, వెంకన్న, పద్మ, శ్రీకాంత్, లింగమ్మ, రమాదేవి, స్వరూప, సరిత తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, గ్రామగ్రామాన జెండాలు ఆవిష్కరించాలని ముదిరాజ్ మహాసభ అర్బన్ అధ్యక్షుడు బయ్య స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఏనుమాముల మార్కెట్ వద్ద సుందరయ్య నగర్, ఎన్‌టీఆర్ నగర్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు తవిటి వీరమల్లు ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సురేష్ కుమార్, మేకల కుమార్, రాసమల్ల కుమార్, రంజిత్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

శంభునిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేట నాయుడు పెట్రోల్‌పంపు వద్ద గల వెంకటేశ్వర కాలనీలో ఆలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. రంగశాయిపేట కాలనీల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కర్నె రవీందర్ విన్నపం మేరకు కాలనీలో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి సత్యం కంప్యూటర్స్ ఛైర్మన్ గంటా రవి కుమార్, బండి ప్రవీణ్ స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆ స్థలంలో ఆలయ నిర్మాణానికి పోజోజు భాస్కరాచార్యుల వేద మంత్రాల మధ్య వైభవంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నె రవీందర్ మాట్లాడుతూ.. ఆచారాలు, సంప్రదాయాలను పాటిస్తూ ఆలయ నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో కాలనీల కమిటీ గౌరవ అధ్యక్షులు రామానుజ జగదీశ్వరాచారి, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు బండి శ్రీనివాస గుప్తా, వడిచర్ల ప్రసాద్, రంగరాజు రవి, కొండ బత్తుల అశోక్, సాంబయ్య, తేజావత్ దేవ్, రమేష్, రూబెన్, హరిప్రసాద్, కవిత, శ్రీనివాస్, బొరిగం కుమార్, జె. ప్రహ్లాదరావు, పత్తిపాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి

**పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం**



సమావేశంలో ప్రసంగిస్తున్న ఈగ మల్లేశం

ఖిలావరంగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని అఖిలభారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పద్మశాలి కార్తీకమాస వనభోజనాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ డిజైనర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలో మాత్రమే ఉందని, వరంగల్ జిల్లాలో కూడా నెలకొల్పాలని అన్నారు. దీంతో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అదేవిధంగా పద్మశాలీల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గతంలో అనేకసార్లు వినతిపత్రాలను అందజేశామని, అయినా ఫలితం లేదని, దీంతో పద్మశాలి యువత ఉపాధి అవకాశాలు లేక భీమండి, సూరత్, గుజరాత్ లాంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారని అన్నారు. ఈ వేడుకలకు వేలాది మంది పద్మశాలీలు రావడం సంతోషంగా ఉందన్నారు.

# భక్తిశ్రద్ధలతో చండీ హోమం

**తరలివచ్చిన భక్తులు.. ప్రత్యేక పూజలు..**

వడ్డెపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని వివిధ దేవాలయాల్లో భక్తులు సామూహిక చండీ హోమాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. హనుమకొండ 58వ డివిజన్‌లోని నాగరాజేశ్వరస్వామి దేవాలయంలో కమిటీ చైర్మన్ కె. అనిల్‌రెడ్డి, కార్యదర్శి ఇ.కొండల్‌రావు, కోశాధికారి పి.విద్యాసాగర్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు జీవన్‌శర్మ చండీహోమాలను జరిపించారు. డివిజన్‌లోని స్నేహనగర్‌లో గల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సామూహిక రమాసత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిప్రపత్తులతో రుత్వికులు నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి భక్తులు తరలివచ్చి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి మూలవిరాట్‌ను కొలిచారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు.



నాగరాజరాజేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం చేస్తున్న భక్తులు



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఆంధ్రజ్యోతి 9
నవ్య
కుటుంబం కదంబం

స్ఫూర్తి




**కొన్ని కథలు వింటుంటే ఒళ్లు పులకరిస్తుంది. గుండె గర్వంతో ఉప్పొంగుతుంది. అలాంటి కథే ఇది. ఐదు పదుల వయసులో... రొమ్ము క్యాన్సర్‌తో పోరాడి జయించారు. అరవైకి చేరువలో... దృఢ సంకల్పంతో ఎవరెస్టు పర్వతాన్ని ముద్దాడారు. చికిత్స సమయంలో బాధను భరించలేక మరణమే శరణ్యమనుకున్న ఆమె... ఆ తరువాత ఆత్మస్థైర్యంతో నిలబడి... అసాధ్యమనుకున్నది సాధించారు. 58 ఏళ్ల విశాఖ ఉక్కు మహిళ మున్నీ కైజరేతో 'నవ్య' మాటామంతి.**

# ఆమె ఆత్మస్థైర్యం ఎవరెస్టంత

"జీవితం ఎప్పుడు ఏ మలుపు తీసుకొంటుందో ఊహించలేం. చుట్టూ ప్రేమించే మనుషులు... దేనికీ లోటు లేని పరిస్థితులు... ఎంతో సంతోషంగా రోజులు సాగిపోతున్నాయని అనుకునేలోపు... ఓ కుదుపు. నాకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. అది నన్నే కాదు, మా కుటుంబాన్నీ తీవ్రంగా కలచివేసింది. ఎన్నో నిద్ర లేని రాత్రులను మిగిల్చింది. కానీ ఆ బాధ నుంచి బయటపడి మహమ్మారిపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాను. మా సొంతూరు అమలాపురం. నా చిన్నప్పుడే మా కుటుంబం విశాఖపట్టణం వచ్చి స్థిరపడింది. అమ్మానాన్న వైద్యులు. విశాఖలోని ఆర్‌సీడీ, మానసిక ఆస్పత్రులకు సూపరింటెండెంట్లుగా పని చేశారు.

### బాల్యంలోనే...

నా రొమ్ములో కణితి ఉన్నట్టు చిన్న వయసులోనే అమ్మ గుర్తించింది. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించేది. కణితిలో మార్పులు లేకపోవడంతో ఇబ్బందేమీ ఉండదని అమ్మానాన్న చెప్పారు. చదువు అయ్యాక నేవీలో పని చేసే ఉమేష్‌కు ఇచ్చి నా వివాహం జరిపించారు. తరువాత మాకు బాబు పుట్టాడు. వాడు ప్రస్తుతం మర్చంట్ నేవీలో సెకండ్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. నేను కూడా టింపనీ స్కూల్‌లో టీచర్‌గా పని చేసేదాన్ని. మా అబ్బాయికి పెళ్లయిన తరువాత ఉద్యోగం మానేశాను. మావారు, కొడుకు, కోడలు... హాయిగా సాగిపోతోంది జీవితం. అయితే రొమ్ములో కణితిలో ఏవైనా తేడాలున్నాయా అని నిత్యం పరీక్షించుకొంటూ ఉండేదాన్ని. అలా 2017లో ఒకరోజు... పరిశీలిస్తుండగా ఏదో తేడాగా అనిపించింది. వైద్యుల్ని సంప్రతించగా, రొమ్ము క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారించారు. రెండో దశలో ఉందని, శస్త్రచికిత్స చేయాలని అన్నారు. అంతేకాదు... ఐదేళ్లకు మించి బతికే అవకాశం లేదన్నారు. ఆ వాస్తవాన్ని తొలుత జీర్ణించుకోలేకపోయాను. ఇంట్లోవాళ్లు బాధలో మునిగిపోయారు. ఆ సమయంలో ఒక దృఢ నిర్ణయం తీసుకున్నాను... 'ఏది ఏమైనా సరే క్యాన్సర్‌ను జయించాలని'.

### అదొక నరకయాతన...

చికిత్సకు ధైర్యంగా ముందడుగు వేశాను కానీ... వాస్తవానికి అదొక నరకయాతన. శస్త్రచికిత్స చేసి క్యాన్సర్ సోకిన రొమ్ము తొలగించారు. మూడు నెలలు రేడియేషన్. తొమ్మిది కీమోలు ఇచ్చారు. కీమో సమయంలో నరకయాతన అనుభవించాను. ఒక దశలో దానికంటే చనిపోవడం మంచిదని అనిపించింది. ఏడాదిన్నరపాటు చికిత్స సాగింది. ఈ వేదన నుంచి బయటపడాలని... దేవుడిని ప్రార్థించడం, వంట చేయడం, యోగా, ధ్యానం లాంటి వాటిపై దృష్టి పెట్టాను. కుటుంబ సభ్యులు, స్నేహితులు నాకు అండగా నిలిచారు. అందరి సహకారంతో బలంగా నిలబడ్డాను. తీవ్రమైన కుంగుబాటు నుంచి కోలుకునే ప్రయత్నం చేశాను. చివరకు నా ప్రార్థనలు, పోరాటం ఫలించాయి. రెండేళ్ల తరువాత క్యాన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా బయటపడ్డాను.

### ఆలోచన ఆలా పుట్టింది...

క్యాన్సర్‌కు చికిత్స సమయంలో డిస్కవరీ చానెల్ చూసేదాన్ని. అప్పుడు ఎవరెస్ట్ పర్వతారోహణ చేయాలన్న ఆలోచన కలిగింది. క్యాన్సర్ నుంచి కోలుకున్న తరువాత స్నేహితురాలు యశోద సూచన మేరకు 2019లో బెంగళూరులో నిర్వహించిన గ్రాండ్‌మదర్ పోటీల్లో పాల్గొన్నా. అప్పటికే క్యాన్సర్ ట్రీట్‌మెంట్ వల్ల జుట్టు ఊడిపోయింది. అలాగే పోటీల్లో పాల్గొన్నాను. ద్వితీయ స్థానంలో నిలిచా. ఇది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ తరువాత ట్రెక్కింగ్‌కు వెళతానని మావాళ్లకు చెప్పాను. వద్దంటే వద్దన్నారు. ఎలాగోలా వారిని ఒప్పించాను. 2023లో ఉత్తరాఖండ్‌లోని దయాలా బుగ్యాలాలో తొలిసారి ట్రెక్కింగ్‌కు వెళ్లా. 13,500 ఎత్తులో ఉన్న శిఖరాన్ని అధిరోహించాను. ఈ క్రమంలోనే పూణెకు చెందిన 'గిరి ప్రేమి ఫౌండేషన్' ఆధ్వర్యంలో కొందరు మహిళలు ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళుతున్నారని తెలిసింది. గత నెల మూడో తేదీన మరో ఐదుగురు మహిళలతో కలిసి ట్రెక్కింగ్ ప్రారంభించాను. దాదాపు 18 వేల అడుగుల ఎత్తులో ఉన్న బేస్ క్యాంప్ వరకు వెళ్లాలనేది నా లక్ష్యం. 12వ తేదీ నాటికి అక్కడికి చేరుకున్నాం. 17న వెనక్కి వచ్చాం. అప్పుడు నా ఆనందానికి హద్దులు లేవు. నా మనసు పులకించింది.

### సమస్యలు ఎదురైనా...

ఎవరెస్టు బేస్‌క్యాంప్‌కు వెళ్లే క్రమంలో నాకు ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. మధ్యలో ఆక్సిజన్ అందక ఇబ్బంది పడ్డాను. గడ్డ కట్టే చలిలో మంచు పర్వతంపై వేసే ప్రతి అడుగూ ఓ సవాలే. కానీ ఎలాగైనా సాధించాలన్న పట్టుదల నన్ను ముందుకు నడిపించింది. ఆత్మస్థైర్యంతో తోడు గైడ్లు, సహాయక సిబ్బంది సహకారంతో అనుకున్నది సాధించగలిగాను.

> **ఎన్ని ఇబ్బందులు ఎదురైనా...**
>
> ఎవరికైనా నేను చెప్పేది ఒక్కటే... జీవితంలో కష్టాలు సహజం. వాటికి భయపడి వెనకడుగు వేయవద్దు. ముఖ్యంగా క్యాన్సర్ బాధితులు మహమ్మారి సోకిందనగానే భయకంపితులైపోతారు. నేనూ అందుకు మినహాయింపు కాదు. కానీ త్వరగానే ఆ భయం నుంచి బయటకు వచ్చాను. యోగా, మెడిటేషన్, వ్యాయామం ప్రారంభించాను. వైద్యులు ఐదేళ్లే బతుకుతానని చెప్పారు. ఇప్పుడు క్యాన్సర్ నుంచి కోలుకుని ఎనిమిదేళ్లు అవుతోంది. ఈ వయసులో ఎవరెస్ట్‌ను అధిరోహించాను. అందుకే ఆశ వదులుకోవద్దు. ఆత్మవిశ్వాసంతో దేన్నయినా జయించవచ్చు.

● బి.శ్రీనివాసరావు, విశాఖపట్నం
ఫొటోలు: వై.రామకృష్ణ

---

వినూత్నం



**బాలీవుడ్ గాయని పలక్ ముచ్చల్ ఏకంగా 3,800 మంది నిరుపేద పిల్లల గుండె సర్జరీలకు నిధులు సేకరించి, గిన్నిస్ పుస్తకంలో స్థానం సంపాదించింది. సేవా దృక్పథం కలిగిన ఈ గాయని గురించిన ఆసక్తికరమైన విశేషాలు...**

# పాటతో ప్రాణం పోస్తోంది

గాయని పలక్ ముచ్చల్ తాజాగా ఒక అరుదైన గౌరవాన్ని పొందింది. తన అసాధారణమైన సేవా గుణంతో, 3,800 మంది నిరుపేద పిల్లల గుండె సర్జరీలకు ఆర్థికంగా సహాయపడి, గిన్నిస్ పుస్తకంలో చోటు దక్కించుకుంది. తన సోదరుడు పలష్‌తో కలిసి పలక్ పలష్ చారిటబుల్ ఫౌండేషన్‌ను నడిపిస్తూ, మరో వైపు, తన గాన ప్రదర్శనల్లో వసూలయ్యే డబ్బులో సింహభాగాన్ని దేశ వ్యాప్త నిరుపేద పిల్లల గుండె శస్త్రచికిత్సల కోసం ఖర్చు పెడుతోంది. పలక్‌ది మధ్యతరగతి కుటుంబం. 1992, మార్చి 30న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అమిత ముచ్చల్, రాజ్‌కుమార్‌లకు పుట్టిన పలక్ నాలుగేళ్ల వయసులోనే పాటలు పాడడం మొదలుపెట్టింది. గుండె జబ్బులతో బాధపడే నిరుపేద పిల్లలకు ఆర్థికంగా సహాయపడాలనే సంకల్పంతో, 2000 సంవత్సరం నుంచి తన సోదరుడితో కలిసి మన దేశంతో పాటు విదేశాల్లో గాన ప్రదర్శనలివ్వడం మొదలుపెట్టింది. ఇలా పలక్, గుండె జబ్బులతో బాధపడే పిల్లల చికిత్సే లక్ష్యంగా ఎంచుకోడానికి కారణం లేకపోలేదు.

### కార్గిల్ సైనికులు, గుజరాత్ భూకంప బాధితులు

ఒక సందర్భంలో రైల్లో ప్రయాణిస్తున్న పలక్‌కు భిక్షాటన చేస్తున్న నిరుపేద పిల్లలు కనిపించారు. వాళ్లను చూడగానే ఆమె మనసు కదిలిపోయింది. వాళ్లకు చేతనైనంత సహాయం చేయాలని ఆ క్షణమే నిర్ణయించుకుంది. అందుకోసం తనకు భగవంతుడు ఇచ్చిన స్వరాన్నే వాడుకోవాలని అనుకుంది. మరీ ముఖ్యంగా గుండెజబ్బులతో ప్రాణాలు కోల్పోయే పిల్లలకు తన స్వరాన్ని అంకితం చేయాలనుకుంది. అప్పటి నుంచి గాన ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టింది. 1999లో కార్గిల్ యుద్ధ సైనికుల కోసం ఇంటింటికీ తిరిగి పాటలు పాడి, నిధులను సేకరించింది. గుజరాత్ భూకంప బాధితుల కోసం తన పాటల ద్వారా పది లక్షల రూపాయలను సేకరించి, అందించింది. 2013లో 572 మంది పిల్లల గుండె ఆపరేషన్ల కోసం ఏకంగా రెండున్నర కోట్ల రూపాయల నిధులను సమీకరించింది. ఆర్థిక ఇబ్బందుల మూలంగా ఏ ఒక్క నిరుపేద సంతానం కూడా ప్రాణాలు పోగొట్టుకోకూడదని పలక్ భావించింది. 'ఒక్కోసారి మ్యూజిక్ కన్సర్ట్‌తో సమకూరే సంపాదన నిరంతరం పెరిగే పిల్లల చికిత్సలకు సరిపోదు. అలాంటప్పుడు అత్యవసరంగా సర్జరీ చేయవలసిన పిల్లలకు మొదట సర్జరీలను పూర్తి చేసేస్తూ ఉంటాం. ఒక్కోసారి ప్రదర్శనల కొరత ఏర్పడుతుంది. అలాంటి సందర్భాల్లో, పొదుపు చేసుకున్న సొమ్మునే సర్జరీలకు వాడుతూ ఉంటాం' అంటూ మీడియాకు వివరించిన పలక్, విరాళాలు అందించమని అభిమానులను, ప్రజలను కూడా అర్థిస్తూ ఉంటుంది. విరాళం వేలు, లక్షల్లోనే ఉండాలనే నియమమేమీ లేదు. మీ దగ్గర వంద రూపాయలున్నా, వాటిని కూడా విరాళమివ్వవచ్చు. అలాంటి వందలే కొన్ని వేల మంది పిల్లల ప్రాణాలను కాపాడగలుగుతాయి' అంటూ ప్రజలను, అభిమానులను చైతన్య పరుస్తోంది పలక్.

### హిందీ హిట్స్‌తో...

2006లో ముంబయికి వలస వెళ్లిన పలక్, 2011లో దనాదన్ సినిమాలో పాటలు పాడడం ద్వారా హిందీ నేపథ్య గాయనిగా ఎదిగింది. మేరి ఆషికీ, కౌన్ తుఝె, ప్రేమ్ రథన్ ధన్ పాయో సినిమాల్లో పాటలు పాడి మంచి గుర్తింపు పొందింది.



---

అవగాహన

# బంగారం కొంటున్నారా?

**బంగారం స్వచ్ఛత, నాణ్యత విషయంలో మనకెన్నో అనుమానాలుంటాయి. 14, 18 క్యారెట్ల బంగారం కూడా 22 క్యారెట్ల బంగారంలాగే ధగధగలాడిపోతుంది. కాబట్టి మోసపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి బంగారం స్వచ్ఛతను నిర్ధారించుకోవడం కోసం ఈ చిట్కాలు పాటించాలి.**

అన్నిటికంటే ముఖ్యమైనది బిఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) హాల్‌మార్క్. బంగారం కొనేటప్పుడు, నగ మీద ఈ గుర్తు ఉండేలా చూసుకోవాలి. బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తూ ప్రభుత్వం ధృవీకరించిన గుర్తు ఇది. 22 క్యారెట్ల బంగారం కోసం, 22కె916 అనే హాల్‌మార్క్ గుర్తు కోసం వెతకాలి. అంటే, ఈ నగ తయారీలో 91.6% స్వచ్ఛమైన బంగారాన్ని ఉపయోగించారని అర్థం. ఈ గుర్తు అస్పష్టంగా ఉంటే, నాణ్యతను అనుమానించాల్సిందే! అలాగే 750 లేదా 18కె అనే గుర్తుత 18 క్యారెట్ల బంగారం నాణ్యతను సూచిస్తుంది. ఈ గుర్తుతో పాటు ఇంకొన్ని అంశాల మీద కూడా దృష్టి పెట్టాలి.

**లూమ్ నంబర్:** వినియోగదారులు హాల్‌మార్కింగ్‌తో పాటు, జ్యువెలర్ల గుర్తింపు సంఖ్యను కూడా గమనించాలి. దీన్ని లైసెన్స్ లేదా లూమ్ నంబరు అని అంటారు. హాల్‌మార్క్ ఆభరణాల మీద ఈ నంబరు కూడా ముద్రించి ఉంటుంది. ఆభరణం మీద ఈ నంబరు ముద్రించి ఉంటే, సదరు జువెలర్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నమోదు చేసుకున్నారని అర్థం.

**రసీదు:** కొందరు విక్రేతలు వినియోగదారులను తప్పుదారి పట్టించడం కోసం నకిలీ హాల్‌మార్క్ స్టాంపులను ఉపయోగిస్తూ ఉంటారు. కాబట్టి వినియోగదారులు వివరాలతో కూడిన రసీదును అడిగి తీసుకోవాలి. దాన్లో క్యారెట్ విలువ, బరువు, తయారీ రుసుము, ఇతరత్రా పన్నుల వివరాలు ఉండేలా చూసుకోవాలి.

**బంగారం పరీక్ష:** బంగారం నాణ్యతను నిర్ధారించుకోవడం కోసం పేరున్న జ్యువెలర్స్ బంగారం నాణ్యతను, స్వచ్ఛతను వేగంగా, కచ్చితంగా నిర్ధారించే సర్టిఫైడ్ గోల్డ్ టెస్టింగ్ మెషీన్స్‌ను అందిస్తున్నారు. కాబట్టి వాటిని ఆశ్రయించవచ్చు.



---

సంకల్పం

# నాయకత్వానికి కొత్త అర్థం

**నాయకుడంటే ఎలా ఉండాలి? ప్రజల మధ్యనే ఉంటూ... ప్రజల కోసం పని చేయాలి. అరుదుగా కనిపించే అలాంటి నాయకురాలే నీరూ యాదవ్. మగవారి ఆధిపత్యాన్ని తట్టుకొని... ఆ ఊరి తొలి మహిళా సర్పంచ్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలపడమే కాదు... అమ్మాయిలను హాకీలో మెరికల్లా తీర్చిదిద్దుతున్నారు. మహిళా సాధికారత, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడుతున్న నీరూ యాదవ్ జర్నీ ఇది.**

"హాకీవాలీ సర్పంచ్'... మా గ్రామంలో నాకున్న మరో పేరు. అందుకు ప్రధాన కారణం... బాలికలను హాకీ లాంటి క్రీడల్లో ప్రోత్సహించడం. మైదానంలో వాళ్లని చూస్తుంటే నన్ను నేను చూసుకొంటున్నట్టు ఉంటుంది. నా కల నెరవేరిన అనుభూతి కలుగుతుంది. హరియాణాలోని చాప్రా సాలిమ్‌పూర్ మాది. 2013లో మాస్టర్స్ చేశాను. పెళ్లి తరువాత నా నివాసం రాజస్థాన్ ఝున్‌ఝును జిల్లా లంబియా అహిర్‌కు మారింది. ఇది ఎక్కడో విసిరేసినట్టు ఉండే మారుమూల పల్లె. కనీస వసతులు కూడా లేని ప్రాంతం. ముఖ్యంగా ఇక్కడ మహిళలకు ఏమాత్రం ప్రాధాన్యత లేకపోవడం నన్ను కలవరపెట్టింది. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని అనుకున్నా. కానీ ఎలా? ముందుగా గ్రామం అంతా తిరిగాను. అందరినీ కలిశాను. చర్చించాను. వారితో కొన్నేళ్ల ప్రయాణం తరువాత ఒక నిర్ణయానికి వచ్చాను. అదే... సర్పంచ్‌గా పోటీ చేయాలని.

### మొదటి మహిళను నేనే...

నా నిర్ణయానికి మావారు, కుటుంబ సభ్యులు మద్దతు తెలిపారు. దాంతో 2020లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోటీపడ్డాను. మంచి మెజారిటీతో గెలుపొందాను. విశేషం ఏంటంటే.. లంబియా అహిర్ చరిత్రలో ఒక మహిళ సర్పంచ్‌గా ఎన్నిక కావడం అదే మొదటిసారి. పురుషాధిక్యాన్ని ప్రశ్నించి, సాధించిన విజయం అది. నాకు ఎంతో గర్వంగా అనిపించింది. చదువుకున్న అమ్మాయి సర్పంచ్ అయితే ఆ గ్రామానికి, ముఖ్యంగా మహిళలు, వయోవృద్ధులకు ఎంత ప్రయోజనకరంగా ఉంటుందో చూపించాలని అనుకున్నా. ఊళ్లో ప్రజలు, పరిస్థితులు, సమస్యల గురించి ముందే తెలుసు కాబట్టి, గెలిచిన వెంటనే కార్యాచరణ మొదలుపెట్టాను.

### సామాజిక మాధ్యమాల ద్వారా...

ఒక మహిళ రాజకీయాల్లో రాణించడం అంత సులువు కాదని ఆరంభంలోనే అర్థమైంది. అయితే విద్య, స్థానిక అంశాలపై అవగాహన ఉంటే సమర్థవంతంగా పని చేయగలుగుతాం. ప్రజలు, అధికారుల సహకారంతో సమస్యలు పరిష్కరించుకోగలుగుతాం. ఆ నమ్మకంతోనే ముందుకు కదిలాను. అందరూ ఉపయోగించే సామాజిక మాధ్యమాల ద్వారా గ్రామస్తులకు నిత్యం అందుబాటులో ఉన్నాను. స్థానిక సమస్యలను తెలుసుకోవడానికి, వాటిని ప్రజలు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర డిజిటల్ మాధ్యమాలు ఓ శక్తివంతమైన వేదికగా ఉపయోగపడ్డాయి. అందులో ఎప్పటికప్పుడు మా గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలు కూడా పోస్ట్ చేయడం మొదలుపెట్టాను. ఇంటికే పరిమితమైన మహిళలకు వివిధ పథకాలు, ఉపాధి మార్గాలపై అవగాహన కల్పిస్తున్నాను.


### క్రీడలతో సాధికారత వైపు...

మాది మధ్యతరగతి కుటుంబం. అమ్మానాన్న హరియాణాలో స్కూల్ టీచర్లు. దాంతో ఇంట్లో ఎప్పుడూ చదువుపైనే దృష్టిపెట్టేవారు. నాకేమో చిన్నప్పటి నుంచీ హాకీ అంటే చాలా ఇష్టం. ఆడాలని ఎంతో ప్రయత్నించాను. కానీ అమ్మానాన్నలు అనుమతించలేదు. ఆటల్లోకి దిగితే చదువు దెబ్బతింటుందన్నారు. వారి ఒత్తిడితో హాకీ స్టిక్ పట్టుకోవాలన్న కల... కలగానే మిగిలిపోయింది. ఇప్పటికీ నాలాగా ఎంతోమంది అమ్మాయిలు ఆసక్తి ఉన్నా క్రీడల్లో పాల్గొనలేకపోతున్నారు. అలాంటివారిని ప్రోత్సహించి, క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సంకల్పించాను. తొలుత బాలికల ఇళ్లకు వెళ్లి, వారి తల్లిదండ్రులను కలిశాను. తమ పిల్లలను శిక్షణకు పంపించేలా ఒప్పించాను. అందరి సహకారంతో ఊళ్లో హాకీ శిక్షణ కేంద్రం ప్రారంభమైంది.

### మార్పు కోసం...

గ్రామస్తుల్లో క్రమంగా క్రీడలపై మక్కువ పెరిగింది. తమంతట తామే వారి పిల్లలను, ముఖ్యంగా ఆడబిడ్డలను శిక్షణకు పంపించడం మొదలుపెట్టారు. ఇలాంటి మార్పే నేను కోరుకున్నది. వీరందరికీ ఒక వేదిక ఉండాలనే ఉద్దేశంతో 'అద్రీ ఫౌండేషన్' నెలకొల్పాను. అంతే కాదు... గ్రామంలోని మహిళా రైతులను సాధికారత వైపు నడిపించే ఉద్దేశంతో 'సచ్చీ సహేలీ మహిళా ఆగ్రో లిమిటెడ్' ప్రారంభించాను. వారికి రుణాలు ఇప్పించేలా బ్యాంక్‌తో ఒప్పందం చేసుకున్నాను. దీని ద్వారా ఇప్పుడు ఎంతోమంది లబ్ధి పొందుతున్నారు. అలాగే ప్లాస్టిక్ రహిత సమాజాన్ని సృష్టించడంలో భాగంగా 'స్టీల్ పాత్రల బ్యాంక్' నెలకొల్పాను. తద్వారా ఇప్పటికి పదిహేను టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించగలిగాను. ఇందుకుగానూ పలు అవార్డులు సైతం అందుకున్నాను. ఏదిఏమైనా ప్రజాస్వామ్యానికి అసలైన రూపం గ్రామాల్లోనే ఉంది. ఎందుకంటే.. అక్కడ మాత్రమే ప్రజలు ఎన్నుకున్న నాయకుడు ప్రజల మధ్యనే ఉంటాడు."





> **నా వేతనం ఇచ్చి...**
>
> నా అభ్యర్థన మన్నించి చాలామంది అమ్మాయిలు మైదానానికి వచ్చారు. వాళ్లందరికీ హాకీ స్టిక్‌లు, ఇతర క్రీడా సామగ్రి అందించాను. అందుకోసం రెండేళ్ల నా పూర్తి గౌరవ వేతనాన్ని కేటాయించాను. వాళ్లలో నన్ను నేను చూసుకున్నాను. ఒక్క హాకీలోనే కాదు, ఇతర క్రీడల్లో కూడా బాలికలను ప్రోత్సహించాను. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మరింత మెరుగైన శిక్షణ అవసరమైంది. మా పంచాయతీ పరిధిలో అందుకు తగిన మైదానాలు లేవు. దాంతో దగ్గర్లోని ఓ ప్రైవేటు యూనివర్సిటీ వారిని ఒప్పించి, అక్కడి ఆటస్థలంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాను. కొద్ది కాలంలోనే నా ప్రయత్నాలు సత్ఫలితాలు ఇచ్చాయి. క్రమంగా జిల్లా, రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో మా క్రీడాకారులు పోటీపడ్డారు. సీనియర్ హాకీ టోర్నీల్లోనూ మంచి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆట వారిలో ఉత్సాహాన్నే కాదు, ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచింది.

---

మేకప్

# చల్లని వేళ చమక్కుమనేలా

చలి కాలం చర్మం పొడిబారిపోయి, నిర్జీవంగా తయారవుతుంది. ఇలాంటి చర్మం జీవం ఉట్టిపడేలా మారాలంటే చలికాలానికి తగిన మేకప్ చిట్కాలు పాటించాలి. అవేంటంటే..


**చర్మాన్ని సిద్ధం చేసి :** సున్నితమైన ఫేస్‌వాష్‌తో ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలాంటి ఫేస్‌వాష్‌తో చర్మం పొడిబారిపోకుండా ఉంటుంది. ఆ తర్వాత స్క్రబర్‌తో మృతకణాలను తొలగించుకోవాలి.

**మాయిశ్చరైజర్ :** మేకప్‌కు ముందు నాణ్యమైన హైడ్రేటింగ్ మాయిశ్చరైజర్ తప్పనిసరిగా అప్లై చేసుకోవాలి.

**హైడ్రేటింగ్ ప్రైమర్ :** నాణ్యమైన ప్రైమర్ మేకప్‌ను ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంచుతుంది. అలాగే నునుపుగా మలుస్తుంది. కాబట్టి ప్రత్యేకించి చలికాలంలో మ్యాట్ ప్రైమర్‌కు బదులుగా, హైడ్రేటింగ్ ప్రైమర్‌ను ఎంచుకోవాలి. దీన్ని వాడుకోవడం వల్ల, తర్వాత అప్లై చేసుకునే ఫౌండేషన్‌తో ముఖం మీద గీతలు ఏర్పడకుండా ఉంటాయి. ఫౌండేషన్‌లో పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. ఒకవేళ చర్మం మరింత పొడిబారినట్టు అనిపిస్తే, ప్రైమర్‌లో కొన్ని చుక్కల ఫేసియల్ ఆయిల్ కలుపుకోవాలి.

**తగిన ఫౌండేషన్ :** చలికాలం పౌడర్ ఆధారిత ఫౌండేషన్లను వాడుకోకూడదు. బదులుగా ద్రవ రూపంలోని లేదా క్రీమ్ ఆధారిత ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. వీటితో చర్మం అదనపు మెరుపును సంతరించుకుంటుంది. అలాగే అవసరానికి మించిన మ్యాట్ ఫినిష్‌తో చర్మం పొడిగా, నిర్జీవంగా మారుతుందనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ఫౌండేషన్‌ను చర్మం మీద సమంగా అద్దుకుని, బ్యూటీ స్పాంజ్ తో ముఖమంతా సమంగా పరుచుకోవాలి.

**కన్‌సీలర్ :** కళ్ల దిగువన, మచ్చల మీద కన్‌సీలర్ అప్లై చేసుకుని, చర్మంలో కలిసిపోయేలా బ్లెండ్ చేయాలి. సాధారణంగా కొంతమంది మచ్చలను మాయం చేయాలనే ఆలోచనతో అవసరానికి మించి కన్‌సీలర్లను వాడుకుంటూ ఉంటారు. కానీ ఇలా చేయడం వల్ల మచ్చల స్థానంలో తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మేకప్ పూర్తయిన తర్వాత స్పష్టంగా కనిపించే ఈ తెల్ల మచ్చలను సరిదిద్దడం కష్టం కాబట్టి కన్‌సీలర్‌ను ఆచితూచి అప్లై చేసుకోవాలి.



**బ్లష్ :** క్రీమ్ ఆధారిత బ్లష్‌ను ఎంచుకోవాలి. దీంతో సహజసిద్ధ రంగు సమకూరుతుంది. చీక్‌బోన్స్‌ను బ్లష్‌తో హైలైట్ చేసుకుంటే బుగ్గలు గులాబీల్లా కనిపిస్తాయి

# నిజాయతీ, నిశ్చితాభిప్రాయాలకు పరీక్ష

## సివిల్స్ పర్సనాలిటీ టెస్ట్

**సివిల్స్ 2025 నోటిఫికేషన్‌కు సంబంధించి భర్తీ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. మూడోది, చివరిదైన పర్సనాలిటీ టెస్ట్(వ్యక్తిత్వ పరీక్ష) త్వరలో ప్రారంభం కానుంది. ఒక పోస్టుకు రెండున్నర నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను పర్సనాలిటీ టెస్ట్‌కు యూపీఎస్సీ పిలుస్తుంది. ఈ టెస్ట్‌కు కేటాయించిన మార్కులు 275 కాగా అభ్యర్థి తుది విజయం, సర్వీస్ కేటాయింపులో ఇదే కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో పర్సనాలిటీ టెస్ట్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కొన్ని సూచనలు.**



అభ్యర్థి మానసిక సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు ఉద్దేశించినదే ఈ పర్సనాలిటీ టెస్ట్. అభ్యర్థి మేధా గుణాలకు తోడు సమకాలీన సామాజికాంశాలపై తనకున్న అభిరుచి, మానసిక అప్రమత్తత, స్పష్టతతో కూడిన తార్కిక విశ్లేషణ, నాయత్వ లక్షణాలు, నైతిక సమగ్రతను ఇంటర్వ్యూ బోర్డు పరిశీలిస్తుంది. అభ్యర్థి వ్యక్తిత్వమే గీటురాయి. అనుభవజ్ఞులైన సభ్యులతో కూడిన బోర్డు అభ్యర్థిని సమస్త కోణాల్లో సంపూర్ణంగా పరీక్షిస్తుంది. అభ్యర్థి వ్యక్తిగత వివరాలు, తల్లిదండ్రుల నేపథ్యం, విద్యార్హతలు, అలవాట్లు, అభిరుచులు, గతంలో దక్కిన పురస్కారాలు, ఎంపిక చేసుకున్న ఆప్షనల్ సబ్జెక్టు, పనిచేసిన అనుభవం కూడా ఉంటే వృత్తి నేపథ్యం వంటివన్నీ బోర్డు సభ్యులు అడిగే ప్రశ్నల్లో ఉంటాయి. అభ్యర్థులు ఇచ్చే డీటెయిల్డ్ అప్లికేషన్ ఫారం(డీఏఎఫ్) ఆధారంగానే ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థి ఇచ్చిన సమాధానాలనుబట్టి వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేసి మార్కులు నిర్ణయిస్తారు.

### ఇలా సన్నద్ధమైతే.....

- డీఏఎఫ్ 1, డీఏఎఫ్ 2లో పేర్కొన్న ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా అభ్యర్థి విశ్లేషించగలగాలి. సొంత వివరాలు, జిల్లా, రాష్ట్రం, చదువు సహా అన్నింటిపై అభ్యర్థికి తనదైన అవగాహనే కాదు, వాటిని బోర్డు సభ్యులకు స్పష్టంగా చెప్పగలగాలి.
- వేషధారణలో జాగ్రత్త అవసరం. ముఖ్యంగా పురుషులు సూట్‌తో కూడిన ఫార్మల్ దుస్తులు ధరిస్తే మంచిది.
- శరీర భాష(బాడీ లాంగ్వేజ్) సానుకూలంగా ఉండేలా జాగ్రత్త వహించాలి. భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లందరితో చర్చిస్తున్నట్టుగా ప్రవర్తించాలి. నేరుగా వారి కళ్లలోకి చూస్తూ సూటిగా సమాధానాలు ఇవ్వాలి.
- జవాబివ్వడానికి ముందు కొన్ని సెకన్లు ఆలోచించి చెప్పాలి. సమాధానంలో వాస్తవికత అంతకుమించి నిజాయతీ ప్రతిబింబించాలి.
- సమాధానం తెలియని పక్షంలో మర్యాదపూర్వకంగా ఇది నాకు తెలియదు అని చెప్పేయాలి.
- వరుసగా సమాధానాలు తెలియకున్నా తత్తరపడవద్దు. ఇచ్చిన సమాధానాల్లో స్పష్టత ఉంటే చాలు, మంచి మార్కులు సాధించవచ్చు. ఈ విషయాన్ని నమ్మండి.
- అన్నింటికీ మించి ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యం.

### తరచూ అడిచే ప్రశ్నలు

- బోర్డుకు మిమ్మల్ని పరిచయం చేసుకోండి.
- మీరు సివిల్ సర్వీసెస్‌ను ఎందుకు ఎంచుకున్నారు?
- మిమ్మల్ని ప్రభావితం చేసిన వ్యక్తులు, సంఘటనలు ఏవి?
- మీ బలాలు, బలహీనతలు ఏమిటి? మీలో సవరించుకోవాల్సిన లక్షణాలు ఏమిటి?
- ఎంపిక అయ్యాక మీ ప్రాధాన్యాలు ఏమిటి?
- సివిల్ సర్వీసెస్‌లో పెచ్చుమీరిన అవినీతి, ఆశ్రితపక్షపాతంపై మీ అభిప్రాయం ఏమిటి? వాటిని నిరోధించేందుకు మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
- వరకట్నం/ పరువు హత్యలు/ పేదరికం/ బాలకార్మిక వ్యవస్థ/ అత్యాచారాలు/ గృహహింస/ నిరుద్యోగం/ పితృస్వామ్య వ్యవస్థ/ కుల వ్యవస్థ వంటి సామాజిక, ఆర్థిక సమస్యలపై మీ అభిప్రాయం ఏమిటి? వాటిని రూపుమాపేందుకు మీరు సూచించే చర్యలు ఏమిటి?

### వర్తమాన అంశాలపై అవగాహన

కొన్ని వారాలుగా వార్తా సాధనాల్లో ప్రముఖంగా చర్చిస్తున్న వర్తమాన అంశాలపై సమాచారం సేకరించాలి. వాటిపై స్పష్టమైన అభిప్రాయాలను ఏర్పర్చుకోవడమే కాదు, అదే అడిగితే బోర్డు సభ్యులకు స్పష్టంగా చెప్పగలగాలి. కొన్ని మాదిరి ప్రశ్నలు చూద్దాం.

- సమాఖ్యవాదం - ఆర్థిక సమస్యలు - జీఎస్టీ 2.0
- భారత దేశ శాంతి దౌత్యం - గాజా సంక్షోభం, పశ్చిమాసియా విధానం
- ఇంధన పరివర్తన - గ్రీన్ హైడ్రోజన్ - సోలార్ పవర్
- అంతరిక్ష దౌత్యం - భారత దేశానికి సంబంధించి విస్తరిస్తున్న వ్యవస్థ
- భారత విదేశాంగ విధానం - గ్లోబల్ సౌత్‌లో భారత పాత్ర
- కృత్రిమ మేధస్సు - నియంత్రణ
- వాతావరణ మార్పు, హిమాలయాలు - హిమానీనద తిరోగమనం
- ఆర్థిక సంస్కరణలు - కొత్త ఆదాయపన్ను చట్టం - 2025
- ఎర్రకోటకు సమీపంలో ఉగ్రవాద దాడి, అంతర్గత భద్రతకు ఎదురవుతున్న సవాళ్లు
- ఢిల్లీ కాలుష్యం - పంట వ్యర్థాల దహన సంక్షోభం
- ట్రంప్ సుంకాలు, భారత్‌పై వాటి ప్రభావం
- గవర్నర్ పాత్ర - కేంద్ర, రాష్ట్ర సంబంధాలు
- ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారత పాత్ర.
- ఆపరేషన్ సిందూర్

### విశ్లేషించాల్సిన అంశాలు

- వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న పాత్ర, ప్రజాకర్షక పథకాలు, ఉచిత హామీలు, ఏకకాల ఎన్నికలు, అభ్యర్థులకు స్టేట్ ఫండింగ్, ఎన్నికల్లో పెరిగిపోతున్న ధనం, కులం, మతానికి ప్రాధాన్యం, సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పులు, న్యాయవ్యవస్థలో అవసరమైన సంస్కరణలు, పార్లమెంట్ ఇటీవల చేసిన చట్టాలు, విపత్తు నిర్వహణలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర, రిజర్వేషన్లు - రాజకీయ రిజర్వేషన్లు, మహిళలకు రిజర్వేషన్ తదితరాలు
- అంతర్జాతీయ అంశాల్లో చైనా దురహంకారపూరిత వైఖరి, పాక్ దుస్సాహసం, క్వాడ్, ఇండో-పసిఫిక్ వ్యూహం, సార్క్, ప్రాంతీయ కూటములు, ఐరాస, ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ వంటి మల్టీ లేటరల్ సంస్థల ప్రాధాన్యం, వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సంబంధాలు
- సామాజిక, ఆర్థిక అంశాల పరిధిలో రైతుల సంక్షేమం కోసం అవసరమైన సంస్కరణలు, ఉద్దేశపూర్వక అప్పు ఎగవేతదారులు, ఎక్స్ట్రాడిక్షన్, ఆర్థిక సర్వే, బడ్జెట్, పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ, బ్యాంకుల విలీనం, జాతీయ విద్యా విధానం - 2020. జాతీయ ఆరోగ్య విధానం
- పర్యావరణ అంశాల కింద గ్లోబల్ వార్మింగ్, క్లయిమేట్ చేంజ్ - కారణాలు, వివిధ రంగాలపై దాని ప్రభావం, గాలి/ నీరు/ నేల కాలుష్యం - పరిష్కార మార్గాలు, బీఎస్ - 6 వాహనాలు.
- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరవుతున్న అభ్యర్థులకు స్థానిక అంశాలపై లోతైన అవగాహన ఉండాలి. తెలంగాణ నుంచి హాజరయ్యే అభ్యర్థులు హైదరాబాద్ నగర నేపథ్యం, విశిష్టత, బిర్యానీ, హలీం వంటి సంప్రదాయ వంటకాలు, ముత్యాల నగరంగా హైదరాబాద్‌కు ఉన్న పేరు, సంక్షేమ - అభివృద్ధి పథకాలు, సామాజిక ఆర్థిక సమస్యలపై వివరాలు సేకరించాలి.
- ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులు ప్రత్యేకించి విభజనాంతర సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పెరిగిపోతున్న రెవెన్యూలోటు, తలసరి అప్పు, సంక్షేమ పథకాలు, అమరావతి రాజధాని నిర్మాణం, అభివృద్ధి వికేంద్రీకరణ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, విశాఖకు గూగుల్ డేటా సెంటర్, ప్రజాకర్షక పథకాలు, పొడవైన తీరప్రాంతాల అభివృద్ధికి చేపట్టిన చర్యలు, రాష్ట్రంలోని దర్శనీయ ప్రదేశాలు, వారసత్వ కట్టడాలపై అవగాహన కలిగి ఉండాలి.



**- ఎం.బాలలత**
సివిల్స్ మెంటార్

## ఏఎఫ్‌క్యాట్



ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ప్రకటనతో నియమించుకున్న అభ్యర్థులకు 2027 జనవరి నుంచి కోర్సు ఆరంభమవుతుంది.

- ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ కింద ఫ్లయింగ్ విభాగంలో ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 34, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు.
- గ్రౌండ్ డ్యూటీ కింద ఏఈ(ఎల్) పీసీ - పురుషులు 3, మహిళలు 3; ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 100, మహిళలకు 9; టెక్నికల్ కింద ఏఈ(ఎం) పురుషులకు 9, మహిళలకు 3; ఎస్ఎస్‌సి పరిధిలో పురుషులకు 38, మహిళలకు 9 కేటాయించారు.
- గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్) - వెపన్ సిస్టమ్స్ బ్రాంచ్‌లో పురుషులకు 21, మహిళలకు 5, అడ్మినిస్ట్రేషన్‌లో పురుషులకు 48, మహిళలకు 12; లాగ్స్‌లో పురుషులకు 9, మహిళలకు 2, అకౌంట్స్‌లో పురుషులకు 8, మహిళలకు 2, ఎడ్యుకేషన్‌లో పురుషలకు 2, మహిళలకు 2; మీటీయోరాలజీలో పురుషులకు 1, మహిళలకు 2 ప్రత్యేకించారు.
- ఎన్‌సీసీ కింద ఖాళీలను ప్రటించలేదు. అయితే సీడీఎస్ఈలో పదిశాతం, పీసీకి ఏఎఫ్‌క్యాట్‌లో పదిశాతం సీట్లను ఎస్ఎస్‌సీ వేకెన్సీలుగా ప్రత్యేకించారు.
- అభ్యర్థులు ఫిజిక్స్, మేథ్స్‌తో ఇంటర్‌కు తోడు సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/ బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
- వయస్సు ఫ్లయింగ్ బ్రాంచ్‌కు 20-24 సంవత్సరాలు ఉండాలి. గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్/ నాన్ టెక్నికల్) బ్రాంచ్‌కు వయస్సు 20-26 సంవత్సరాల మధ్య ఉండాలి.
- దీనికి ఉద్దేశించిన పరీక్ష వచ్చే ఏడాది అంటే 2026 జనవరి 31న జరుగుతుంది. పరీక్షకు ముందు వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఏఎఫ్ క్యాట్ పరీక్ష కాలవ్యవధి రెండు గంటల కాగా 100 ప్రశ్నలు ఉంటాయి. గరిష్ఠంగా 300 మార్కుల పరీక్ష. ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలను జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ ఇన్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ అండ్ మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ నుంచి అడగుతారు. జవాబుగా కరెక్ట్‌గా గుర్తిస్తే మూడు మార్కులు ఇస్తారు. తప్పయితే ఒక మార్కు కట్ చేస్తారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ప్రాక్టీసింగ్ టెస్ట్ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతిలో ఈ పరీక్ష జరుగుతుంది.
- ఏఎఫ్‌క్యాట్‌లో విజయం సాధించిన అభ్యర్థులను తదుపరి టెస్టులకు ఏఎఫ్ఎస్‌బి సెంటర్లలో ఒకదానికి పిలుస్తారు. డెహ్రాడూన్, మైసూర్, గాంధీనగర్, వారణాసి, గువాహతిలో ఇవి ఉన్నాయి.
- అర్హులైన అభ్యర్థులు డిసెంబర్ 14 లోపు దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు.
- **వెబ్‌సైట్:** https://afcat.edcil.co.in

## కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో పోస్టులు

కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తి సంస్థలైన కేంద్రీయ విద్యాలయ సంఘటన(కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)లో దేశవ్యాప్తంగా 14,967 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

ఖాళీలు 14,967

**పోస్టులు:** అసిస్టెంట్ కమిషనర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పీజీ టీచర్స్, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, పీఆర్‌టీ(సంగీతం), స్పెషల్ ఎడ్యుకేటర్, లైబ్రేరియన్, కేవీఎస్ నాన్ టీచింగ్ స్టాఫ్, ఎన్‌వీఎస్ నాన్ టీచింగ్ స్టాఫ్

**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, అవసరమైతే నైపుణ్య పరీక్షలు/ ఇంటర్వ్యూలు ఆధారంగా.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 4

**వెబ్‌సైట్:** https://www.cbse.gov.in/, https://kvsangathan.nic.in/ , https://navodaya.gov.in/

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## కొత్త చిత్రం షురూ



తిరువీర్ హీరోగా ఆదివారం ఓ నూతన చిత్రం ప్రారంభమైంది. మహేందర్ కుడుదుల దర్శకత్వంలో పరుచూరి వేంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వివేక్ ఆత్రేయ క్లాప్ ఇచ్చారు. ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదరప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ గౌరవ దర్శకత్వం వహించారు. 'పల్లెటూరి నేపథ్యంలో సాగే అద్భుతమైన ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోంది. వినోదంతో పాటు కదిలించే భావోద్వేగాలు ఉంటాయి' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జగదీశ్ చీకటి.

## ఒకరోజు ముందే విడుదల



రామ్ పోతినేని కథానాయకుడిగా నటించిన 'ఆంధ్రాకింగ్ తాలూకా' చిత్రం విడుదల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈనెల 28న విడుదల కావాల్సి ఉంది. అయితే ఒక రోజు ముందుగా ఈ నెల 27న 'ఆంధ్రాకింగ్ తాలూకా' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఆదివారం ప్రకటించింది. ఈ నెల 18న కర్నూలులో భారీ స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉపేంద్ర కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి మహేశ్‌బాబు పి. దర్శకుడు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. సంగీతం: వివేక్, మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని

## త్రీడీలో అఖండ 2: తాండవం



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2: తాండవం' చిత్రం మేకర్స్ సినీ ప్రియులకు ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. డిసెంబరు 5న విడుదలవుతున్న ఈ సినిమాను 3డీ ఫార్మాట్‌లో తీసుకురానున్నట్లు వెల్లడించారు. సంచలన విజయం సాధించిన 'అఖండ'కు సీక్వెల్‌గా ఇది తెరకెక్కుతోంది. ఆదివారం చిత్ర బృందం నిర్వహించిన విలేకరుల సమావేశంతో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'నందమూరి బాలకృష్ణ అభిమానులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందివ్వాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని త్రీడీలో మీ ముందుకు తెస్తున్నాం. 'భగవద్గీత, రామాయణం, భారతం'.. ఇవి భారతదేశం ఆత్మ. ప్రపంచంలోని మిగతా దేశాల్లో మతం కనిపిస్తుంది. కానీ మన భారత్‌లో మాత్రమే సనాతన ధర్మం కనిపిస్తుంది. ఈ పాయింట్ ఆధారంగానే సినిమాను రూపొందిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులూ ఇష్టపడేలా ఉంటుందీ చిత్రం. ఈ సినిమాను దేశమంతా చూడాలనుకుంటున్నాను. అందుకే ప్రచారాన్ని ముంబై నుంచి మొదలుపెట్టాం' అని చెప్పారు. 'ఈ చిత్రానికి ఉన్న కథా పరిధిని దృష్టిలో పెట్టుకొని త్రీడీలో తీసుకువస్తున్నాం. విజువల్స్ అదిరిపోనున్నాయి' అని గోపి ఆచంట చెప్పారు. బాలకృష్ణ కూతురు తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఆది పినిశెట్టి, సంయుక్త, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



## అలా చేస్తున్నది నేను కాదు

**- అదితి రావు హైదరి**

తన పేరు, ఫొటో ఉపయోగిస్తూ ఓ వ్యక్తి వాట్సాప్‌లో ఫేక్ ఖాతాను వాడుతున్నాడని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని నటి అదితిరావు హైదరి సూచించారు. 'నా దృష్టికి వచ్చిన ఓ ముఖ్యమైన విషయాన్ని మీతో షేర్ చేసి, మీ అందర్నీ అప్రమత్తం చేయాలనుకుంటున్నాను. నా పేరుతో ఓ వ్యక్తి ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు సందేశాలు పంపిస్తున్నాడని తెలిసింది. ఆ పని చేస్తున్నది నేను కాదు. ఫొటోషూట్స్ కోసం నేను వ్యక్తిగత ఫోన్ నెంబరుతో ఎవ్వరినీ సంప్రదించను. నా టీమ్ ద్వారానే నేను ఫొటోగ్రాఫర్స్‌ను సంప్రదిస్తాను. ఎవరైనా నా పేరుతో మీకు ఇలాంటి సందేశాలు పంపితే, వెంటనే మా టీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు తెలియజేయండి' అని విజ్ఞప్తి చేశారు.

## నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పాంచ్‌మినార్'. రాశీ సింగ్ హీరోయిన్. ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి దర్శకుడు తెరకెక్కించారు. నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంటుంది' అని చెప్పారు. రామ్ మాట్లాడుతూ 'రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథ ఇది. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని అన్నారు. కుటుంబంతో కలసి చూసేలా మా సినిమా ఉంటుంది, నా పాత్ర విభిన్నంగా ఉంటుంది' అని రాశీసింగ్ చెప్పారు. మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించాం అని నిర్మాత తెలిపారు.

## ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథతో వస్తున్నాం

**- సాయిలు కంపాటి**



'పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పీరియాడిక్ ప్రేమకథా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమా చేస్తున్నాం. ప్రేమకథకు సామాజిక అంశాలను కలిపిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని సాయిలు కంపాటి అన్నారు. ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. అఖిల్, తేజస్విని జంటగా నటించారు. 'రాజు వెడ్స్ రాంబాయి'. వేణు ఊడుగుల, రాహుల్ మోపీదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకుడు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయిలు కంపాటి మీడియాతో మాట్లాడారు.

- వేణు ఊడుగుల, శ్రీకాంత్ అడ్డాల దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాను. మనదైన నేటివిటీ కనిపించేలా రాసుకున్న కథ ఇది. వేణు అన్నకు కథ నచ్చి దర్శకుడిగా అవకాశం ఇచ్చారు.
- నా చిన్నతనంలో మా ప్రాంతంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో కథ రాసుకున్నాను. స్నేహం, వైరం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకుంది. ఈ కథలో ప్రేమికులకు ఏం జరిగిందనేది మాత్రం తెరపైనే చూడాలి. వరంగల్‌లో షూట్ చేశాం. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్.

## అందరూ మెచ్చేలా...



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. బేబీ చైత్రశ్రీ బాదర్ల, మాస్టర్ యవ్వాంశ్ కృష్ణ బాదర్ల సమర్పణలో ధనలక్ష్మీ బాదర్ల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన పోస్టర్లు, టీజర్లు ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'ఏమైపోతుందో' అంటూ సాగే గీతాన్ని గీత రచయిత చంద్రబోస్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పాట చాలా బాగుంది. అందరూ మెచ్చేలా చిత్రం ఉండబోతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. శ్రీహర్ష ఈమని రాసిన ఈ పాటను పవన్‌చ శృతిక సముద్రాల ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు.

## పేరు తెచ్చే పాత్రలు చేస్తున్నా

**- కామాక్షి భాస్కర్ల**



'విజయ్ సేతుపతి, సుహాస్ లాంటి నటులు హీరోలుగా నటిస్తూనే ఇతర పాత్రల్లోనూ మెప్పిస్తున్నారు. నేను కూడా ఆ తరహాలో ఎందుకు ప్రయత్నించకూడదు అనుకున్నాను. అందుకే కథానాయికగా చేస్తూనే, నటిగా పేరు తెచ్చే సహాయ పాత్రలనూ చేస్తున్నాను' అని కామాక్షి భాస్కర్ల అన్నారు. అల్లరి నరేశ్, కామాక్షి భాస్కర్ల జంటగా నటించిన చిత్రం '12 ఏ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్ కథను అందించడంతో పాటు దర్శకత్వ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కామాక్షి భాస్కర్ల సినిమా విశేషాలను పంచుకున్నారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో ఈ సినిమా రూపొందింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఇందులో నా పాత్ర పేరు ఆరాధన. కథను మలుపు తిప్పే పాత్ర. ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా దర్శకుడు తీర్చిదిద్దారు. ప్రేమవల్ల ఆమె జీవితం ఎలాంటి మలుపు తీసుకుందనేది ఆసక్తికరంగా ఉంటుంది. అలాగే రైల్వే కాలనీలో జరిగిన అనూహ్య సంఘటనలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయనేది ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి.

## గ్రామీణ నేపథ్యంలో



పల్లెల్లో ఉండే అనుబంధాలు, ఆప్యాయతల కలబోతగా సాగే చిత్రం 'మా రాముడు అందరివాడు'. సీనియర్ నటుడు సుమన్ ప్రధాన పాత్ర పోషించారు. శ్రీరామ్, స్వాతి జంటగా నటించారు. యద్దనపూడి మైకేల్ దర్శకత్వంలో అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు, వాణిజ్యాంశాలతో నిండిన భారీ యాక్షన్ చిత్రమిది. పల్లె వాతావరణంలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరించేవిధంగా ఉంటుంది' అని అన్నారు. మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

## ద్విభాషా చిత్రంలో జాబిలి



కోర్ట్ చిత్రంలో జాబిలి పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయిక శ్రీదేవి అపల్లా. తమిళ నటుడు ఏగన్, 'మిన్నల్ మురళీ' ఫేమ్ ఫెమినా జార్జ్‌కు జోడీగా ఆమె నటిస్తున్నారు. తెలుగు తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమాను ఇటీవలె ప్రారంభించారు. యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో 'జో' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న విజన్ సినిమాస్ పతాకంపై డాక్టర్ డీ అరుళనందు, మాథ్యుయో అరుళనందు నిర్మిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు.

# బిజినెస్



## అణు విద్యుత్ ప్రాజెక్టులపై
# ఎన్‌టీపీసీ గురి



**● అనువైన ప్రదేశాల కోసం అన్వేషణ ● పరిశీలనలో ఆంధ్రప్రదేశ్**

న్యూఢిల్లీ: దేశీయ విద్యుదుత్పత్తి దిగ్గజం ఎన్‌టీపీసీ.. దేశ వ్యాప్తంగా విభిన్న ప్రాంతాల్లో అణు విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసే రెడీ అవుతోంది. 2047 నాటికి ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష మెగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యంలో 30% వాటా (30,000 మెగావాట్లు) సాధించాలని ఎన్‌టీపీసీ లక్ష్యంగా ఏర్పరచుకుంది. ఇందులో భాగంగా దేశంలోని భిన్న ప్రాంతాల్లో 700, 1,000, 1,600 మెగావాట్ల అణు విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు కంపెనీ వ్యూహాత్మక ప్రణాళికలో భాగస్వామి అయిన సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఈ ప్రాజెక్టులు చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ సహా మరికొన్ని రాష్ట్రాల్లో అనువైన ప్రాంతాలు, భూముల కోసం అన్వేషిస్తున్నట్టు ఆయన తెలిపారు. వీటిలో అణు ఇంధన రెగ్యులేటరీ బోర్డ్ (ఏఈఆర్‌బీ) గుర్తించి, అనుమతించిన ప్రదేశాల్లో మాత్రమే ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఒక గిగావాట్ (1,000 మెగావాట్లు) అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.15,000-20,000 కోట్లు ఖర్చవుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. అంటే తక్కువ పెట్టుబడిని పరిగణనలోకి తీసుకున్నా 30,000 మెగావాట్ల సామర్థ్యం సాధించేందుకు రూ.4.5 లక్షల కోట్లు అవసరమవుతాయి. అదే గరిష్ఠ పెట్టుబడిని పరిగణనలోకి తీసుకుంటే రూ.6 లక్షల కోట్లు అవసరం. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ఉత్పత్తి స్థాయికి చేరడానికి కనీసం మూడేళ్లు పడుతుందని అంచనా.

### దేశీయ రియాక్టర్లే ఉపయోగిస్తాం

700, 1,000 మెగావాట్ల ప్రాజెక్టుల కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన భార జల రియాక్టర్లనే వినియోగిస్తామని, 1,600 మెగావాట్ల ప్రాజెక్టుల కోసం మాత్రం టెక్నాలజీ భాగస్వాములకు అన్వేషిస్తామని ఆ అధికారి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన ముడిసరుకు లభ్యతపై కూడా ఎన్‌టీపీసీ దృష్టి పెట్టింది. ఇందుకోసం విదేశాల్లో యురేనియం ఆస్తుల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ యురేనియం ఆస్తుల టెక్నో-కమర్షియల్ అధ్యయనం ఉమ్మడిగా చేపట్టేందుకు యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో (యూసీఐఎల్) ఇప్పటికే ముసాయిదా ఒప్పందంపై సంతకాలు చేసినట్టు ఎన్‌టీపీసీ వర్గాలు తెలిపాయి. 1975లో ఏర్పాటైన ఎన్‌టీపీసీ ప్రస్తుతం 84,848 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగి ఉంది.

వీటిలో బొగ్గు, గ్యాస్/ద్రవ ఇంధనం, హైడ్రో, సోలార్ ప్రాజెక్టులున్నాయి. ప్రస్తుతం భారత అణు ఇంధన కార్పొరేషన్‌తో (ఎన్‌పీసీఐఎల్) ఉమ్మడి భాగస్వామ్యంలో రాజస్థాన్‌లో రూ.42,000 కోట్ల వ్యయంతో ఒక అణు ప్రాజెక్టును ఎన్‌టీపీసీ చేపట్టింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ అశ్వినిలో (అణుశక్తి విద్యుత్ నిగమ్ లిమిటెడ్) ఎన్‌టీపీసీ 49% వాటా కలిగి ఉండగా ఎన్‌పీసీఐఎల్ 51% వాటా కలిగి ఉంది.

● స్టార్టప్ యాక్సిలరేటర్ వేల్ ట్యాంక్ (డబ్ల్యూటీ) బయోక్యాటలిస్ట్.. తన మూడో వార్షిక స్టార్టప్-ఇన్వెస్టర్ మీట్‌ను ఐఎస్‌బీలో నిర్వహించింది. భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ రీసెర్చ్ అడ్వైజరీ కౌన్సిల్ (బీఐఆర్‌ఏసీ) సహకారంతో దీన్ని చేపట్టింది. హెల్త్‌కేర్, లైఫ్‌సైన్సెస్, బయో టెక్నాలజీ, ఫుడ్, అగ్రిటెక్ రంగాల్లోని డీప్ టెక్ స్టార్టప్స్‌కు అవసరమైన నిధులను సమకూర్చటంపై డబ్ల్యూటీ 3.0 దృష్టి సారించింది. ఈ సదస్సులో షార్ట్ లిస్ట్ చేసిన 73 స్టార్టప్స్ సహా 46 మంది ఇన్వెస్టర్లు పాల్గొన్నారు.

● తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎన్‌పీడీసీఎల్)తో మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్, వేదాంత ఛత్తీస్‌గఢ్ థర్మల్ పవర్ ప్లాంట్ 500 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఒప్పందంలో భాగంగా మీనాక్షి ఎనర్జీ 300 మెగావాట్లు, ఛత్తీస్‌గఢ్ ప్లాంట్ 200 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేయనున్నాయి.

● హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ).. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ సేఫ్టీ అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మంలో 2,400 మంది విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది.

● భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మ్యూచువల్ ఫండ్, ఎస్ఐఎఫ్, గిఫ్ట్ సిటీ ఎంఎఫ్ పథకాల కోసం కృత్రిమ మేధ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలను ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానం చేసినట్లు కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (కామ్స్) ప్రకటించింది. ఏటా 8 అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలు తమ కార్యకలాపాలు సాగించటంతో పాటు కొత్త పథకాలకు తోడ్పాటు నందించేందుకు ఈ అనుసంధానం తోడ్పాటునందించనుందని కామ్స్ వెల్లడించింది.

## 2030 నాటికి రిటైల్ రంగం
# 87 లక్షల కోట్లకు..

**ఫైర్‌సైడ్ వెంచర్స్ నివేదిక వెల్లడి**

న్యూఢిల్లీ: పెరుగుతున్న ఆదాయాలతో దేశంలో వినియోగ రంగం రాబోయే కాలంలో కొత్త ఉత్తేజం పొందనుంది. దీనికి తోడు వేగంగా విస్తరిస్తున్న డిజిటలైజేషన్, భారీ ఆకాంక్షలున్న వినియోగదారులతో దేశీయ రిటైల్ మార్కెట్ 2030 నాటికి లక్ష కోట్ల డాలర్ల (రూ.87 లక్షల కోట్లు) మైలురాయిని చేరుకోవచ్చని వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఫైర్‌సైడ్ వెంచర్స్ తాజా నివేదికలో వెల్లడించింది. కేవలం పరిమాణంలోనే కాకుండా భారతీయుల షాపింగ్ ధోరణుల్లో మార్పు సైతం రిటైల్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. 2014లో 90% ఉన్న సాంప్రదాయిక వ్యాపారం 2030 నాటికి 70 శాతానికి పడిపోతుందని ఆ నివేదిక తెలిపింది.

● ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ అల్ట్రావయొలెట్ ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా విజయవాడలో కొత్త ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సెంటర్‌లో ఎక్స్-47 క్రాస్‌ఓవర్, ఎఫ్77 సూపర్‌స్ట్రీట్, ఎఫ్77 మాక్ 2 మోటార్‌సైకిల్స్ అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. సంస్థ ఇప్పటికే తిరుపతి, విశాఖపట్నంలో సెంటర్లను నిర్వహిస్తోంది.

## 26,250 పైన బుల్లిష్

**(నవంబరు 17-21 తేదీల మధ్య వారానికి)**

ట్రెండ్ లైన్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 25910 (+417)

నిఫ్టీ గత వారం 26,011-25,481 పాయింట్ల మధ్యన కదలాడి 413 పాయింట్ల లాభంతో 25,910 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,777, 25,324, 25,154, 24,440 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

**బ్రేకౌట్ స్థాయి: 26,250** బ్రేక్‌డౌన్ స్థాయి: 25,750

నిరోధ స్థాయిలు: 26,125, 26,225, 26,325 (26,025 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,800, 25,700, 25,600 (25,900 దిగువన బేరిష్)

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| 17వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 615 | విజయవాడ | 635 |
| వరంగల్ | 617 | గోదావరి | 625 |
| చిత్తూరు | 663 | విశాఖపట్నం | 610 |
| | | దజను గుడ్లు రూ. 84 | |

**ఫామ్‌గేట్ ధర** — **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 117 | విజయవాడ | 111 |
| వరంగల్ | 117 | గుంటూరు | 115 |
| కరీంనగర్ | 117 | ఒంగోలు | 115 |
| మహబూబ్‌నగర్ | 117 | చిత్తూరు | 120 |
| కర్నూలు | 117 | నెల్లూరు | 125 |
| విశాఖపట్నం | 110 | అనంతపురం | 125 |
| గోదావరి | 111 | | |

# ఆచితూచి అడుగేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌కు ముగింపు పలికినప్పటికీ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై సందిగ్ధత, మళ్లీ కరెన్సీ ప్రింట్ చేస్తుండటం ప్రతికూలంగా మారే వీలుంది. మరోవైపు అంతర్జాతీయంగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఎంపిక చేసుకున్న షేర్లలోనే పెట్టుబడులు పెట్టడం మంచిది. ప్రస్తుతం ప్రభుత్వ రంగ బ్యాంకులు, చమురు, ఇన్‌ఫ్రా, తయారీ, కమోడిటీస్ రంగాల షేర్లు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి.

**స్టాక్ రికమండేషన్స్**

**బీడీఎల్:** జీవితకాల గరిష్ఠం తర్వాత 32 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ కౌంటర్‌లో సెప్టెంబరు నుంచి మంచి బేస్ ఏర్పడింది. సెప్టెంబరు త్రైమాసికంలో మంచి ఫలితాలను ప్రకటించటంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్ల బాట పట్టారు. గత శుక్రవారం భారీ వాల్యూమ్‌తో రూ.1,613 ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.1,560.

**జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్:** కొన్ని నెలలుగా పతనమవుతూ వస్తున్న ఈ షేరుకు తాజా త్రైమాసిక ఫలితాలతో మంచి డిమాండ్ ఏర్పడింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.615 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.600 పై స్థాయిలో ప్రవేశించి రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.580.

**స్విగ్గీ:** మే నెల నుంచి సెప్టెంబరు మధ్య 50 శాతం రాబడి ఇచ్చిన ఈ షేరు ప్రస్తుతం డౌన్‌ట్రెండ్‌లో ఉంది. తాజా ఆర్థిక ఫలితాల్లో రెవెన్యూ పెరగటం సానుకూల అంశం. ధర సైతం ఐపీఓ లిస్టింగ్ స్థాయిలో ఉంది. గత శుక్రవారం రూ.393 వద్ద ముగిసిన ఈ షేరును రూ.470/530 టార్గెట్ ధరతో రూ.390 స్థాయిలో అక్యుములేట్ చేసుకోవాలి. స్టాప్‌లాస్ రూ.370.

**భారత్ ఎలక్ట్రానిక్స్:** జీవిత కాల గరిష్ఠం తర్వాత 18 శాతం దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం బుల్లిష్ బాట పట్టింది. రిలేటివ్ స్ట్రెంత్, వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.426 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.410 స్థాయిలో ప్రవేశించి రూ.475 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు స్టాప్‌లాస్ రూ.395.

**జియో ఫైనాన్స్:** ప్రస్తుతం ఈ షేరు స్వల్పకాలిక డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది. గత శుక్రవారం రూ.314 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.380 టార్గెట్ ధరతో రూ.300 పై స్థాయిలో అక్యుములేట్ చేసుకోవాలి. స్టాప్ లాస్ రూ.290.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

# 26,000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ 25,500 వద్ద ప్రారంభమై అన్ని సెషన్లలోనూ అప్‌ట్రెండ్‌లోనే ట్రేడయినా 26,000 వద్ద మైనర్ రియాక్షన్ సాధించింది. చివరికి ముందు వారంతో పోల్చితే 417 పాయింట్ల లాభంతో 25,900 వద్ద ముగిసింది. మరోసారి కీలక స్థాయి 26,000 వద్ద నిలిచి ఉంది. గతంలో ఈ స్థాయిలోనే కన్సాలిడేషన్ లేదా సైడ్‌వేస్ ట్రెండ్, ఆటుపోట్లు ఏర్పడ్డాయి. 26,000 వద్ద పరీక్ష ఎదుర్కొనడం వరుసగా ఇది ఐదోసారి. అమెరికన్ మార్కెట్ శుక్రవారం నాటి ధోరణిని పరిశీలించినట్టయితే మరోసారి అప్రమత్త ట్రెండ్ ఎదుర్కొనే ఆస్కారం ఉంది. మిడ్‌క్యాప్-100 సూచీ సైతం ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 61,000 చేరువలో ఉంది.

**బుల్లిష్ స్థాయిలు:** గత వారంలో "వి" ఆకారంలో రికవరీ సాధించినందు వల్ల 26,000 స్థాయిలో కన్సాలిడేట్ కావచ్చు. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయి 26,300. ఏడాది క్రితం ఏర్పడిన గరిష్ఠ స్థాయి ఇదే.

**బేరిష్ స్థాయిలు:** ప్రస్తుత మద్దతు స్థాయి 25,750 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,450.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ గత వారంలో 640 పాయింట్ల లాభంతో ఆల్‌టైమ్ హై 58,500 వద్ద నిలకడగా క్లోజయింది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన నిరోధం 59,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 58,000. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

**పాటర్న్:** 26,000 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. అప్‌ట్రెండ్ కొనసాగించాలంటే దీన్ని ఛేదించాలి. 25,750 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. గత వారంలో మార్కెట్ స్వల్పకాలిక డీఎంఏల కన్నా పైనే కదలాడుతూ ఉండడం నిలకడ ధోరణిని సూచిస్తోంది.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 26,000, 26,120 |
| మద్దతు | 25,840, 25,780 |

# స్పోర్ట్స్

**15 ఏళ్ల తర్వాత భారత గడ్డపై దక్షిణాఫ్రికా విజయం**

## సఫారీలు అదుర్స్
# సీన్ రివర్స్..

**తొలి టెస్టులో 30 రన్స్‌తో టీమిండియా పరాజయం**



పంత్ (2)

భారత్ ముందు లక్ష్యం 124 పరుగులే.. చేతిలో తొమ్మిది వికెట్లు ఉండగా ఆందోళన అనవసరం అనిపించింది.. పిచ్ క్లిష్టంగా ఉండడంతో ఆదివారం ఆఖరి సెషన్‌లోనైనా మ్యాచ్‌ను ముగిస్తారనే అంతా భావించారు. కానీ బరిలోకి దిగాక ఆడుతోంది స్వదేశంలోనేనా? అన్న సందేహం కలిగింది. సఫారీ బౌలర్ల ప్రతాపం ముందు భారత బ్యాటర్లు చిన్నబోయారు. వారి పేస్.. స్పిన్ బంతులను టచ్ చేసేందుకే వణికిపోయారు. ఏడుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమవడంతో.. జట్టు కనీసం వంద పరుగులైనా చేయకుండానే బ్యాటెత్తేసింది. దీంతో 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత గడ్డపై సౌతాఫ్రికా అద్భుత విజయాన్నందుకుంది.



తిప్పేసిన స్పిన్నర్ హార్మర్

హార్మర్ (4/21)కు సహచరుల అభినందన

**భారత్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా అనూహ్య ఓటమితో ఆరంభించింది. ప్రత్యర్థి జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు ఉంటే భారత బ్యాటర్ల తడబాటు ఎలా ఉంటుందో మరోసారి తెలిసొచ్చింది. గతేడాది న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ మాదిరే.. ఈసారి కూడా మనోళ్లు స్పిన్‌కే బోల్తా కొట్టారు. ఆదివారం మూడో రోజు ఆటలో ప్రత్యర్థి విధించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైన గిల్ సేన 30 పరుగుల తేడాతో ఓడింది. దీంతో పర్యాటక జట్టు సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. భారత్‌ను దెబ్బతీయడంలో స్పిన్నర్ సైమన్ హార్మర్ (4/21) మళ్లీ కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 153 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బవుమా (55 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ సాధించగా, బాష్ (25) సహకరించాడు. స్పిన్నర్ జడేజాకు నాలుగు.. సిరాజ్, కుల్దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 93 పరుగులకే పరిమితమైంది. సుందర్ (31), అక్షర్ (26) ఆకట్టుకున్నారు. అలాగే సఫారీలు తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులు సాధించగా, భారత్ 189 పరుగులు సాధించింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు 8 వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ హార్మర్‌కు దక్కింది. కెప్టెన్ గిల్ మెడ నొప్పితో ఆస్పత్రిలో చేరడంతో బ్యాటింగ్‌కు దూరమయ్యాడు.

**2** భారత్‌లో జరిగిన టెస్టుల్లో స్వల్ప లక్ష్యాన్ని (124) కాపాడుకున్న రెండో జట్టుగా దక్షిణాఫ్రికా. 2004లో ఆసీస్‌పై భారత్ 107 రన్స్‌ను కాపాడుకుంది.

**భళా.. బవుమా:** ఆదివారం దక్షిణాఫ్రికా 93/7 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా, మరో పది ఓవర్లలో ఆలౌట్ అవుతారనిపించింది. కానీ ఈ పిచ్‌పై ఎలా బ్యాటింగ్ చేయాలో కెప్టెన్ బవుమా ఆడి చూపాడు. అతడికి తొమ్మిదో నెంబర్ బ్యాటర్ బాష్ చక్కగా సహకరించగా ఆ జట్టు 12 ఓవర్ల పాటు వికెట్ కోల్పోలేదు. ప్రమాదకర బంతులను అద్భుత డిఫెన్స్‌తో ఎదుర్కొంటూ బవుమా తొలి గంట బౌలర్లను విసిగించాడు. అటు గిల్ స్థానంలో కెప్టెన్సీ చేస్తున్న పంత్ ఆరంభంలో బుమ్రాకు బౌలింగ్ ఇవ్వకపోవడం నష్టపరిచింది. కుల్దీప్ ఓవర్‌లో సిక్సర్‌తో బాష్ జట్టు ఆధిక్యాన్ని వంద పరుగులకు చేర్చాడు. ఇక స్పిన్నర్లు ప్రభావం చూపకపోవడంతో ఎట్టకేలకు బుమ్రాను బరిలోకి దించడంతో తన మూడో ఓవర్‌లోనే బాష్‌ను బౌల్డ్ చేశాడు. దీంతో ఎనిమిదో వికెట్‌కు 44 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెర పడింది. ఇక బుమ్రా ఓవర్‌లోనే ఫోర్‌తో బవుమా ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే సిరాజ్ ఒకే ఓవర్‌లో హార్మర్ (7), కేశవ్ (0)లను అవుట్ చేయడంతో సఫారీల ఇన్నింగ్స్ ముగిసింది.

**ఒక్క పరుగుకు 2 వికెట్లు:** ఈ పిచ్‌పై 124 పరుగుల ఛేదన ఎంత కష్టమో తొలి మూడు ఓవర్లలోనే భారత్‌కు తెలిసొచ్చింది. 6.7 అడుగుల పేసర్ యాన్సెన్ తన ఎత్తును సద్వినియోగం చేసుకుంటూ అదనపు బౌన్స్‌తో బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ జైస్వాల్ (0)ను, మూడో ఓవర్‌లో ఓపెనర్ రాహుల్ (1)ను పెవిలియన్‌కు చేర్చడంతో ఒక్క పరుగుకే జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. ఇక 10/2 స్కోరుతో రెండో సెషన్ ఆరంభించిన భారత్‌ను ఎప్పటిలాగే స్పిన్నర్ హార్మర్ కుదురుకోనీయలేదు. సుందర్, జురెల్ జోడీ మూడో వికెట్‌కు 32 పరుగులతో ఆశలు రేకెత్తిస్తున్న స్థితిలో దెబ్బతీశాడు. జురెల్‌ను అవుట్ చేయడంతో పాటు కాసేపటికే ప్రమాదకర పంత్ (2)ను రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చడం జట్టుపై గట్టి ప్రభావం పడింది. ఆ తర్వాత జడేజా (18)తో కలిసి సుందర్ ఐదో వికెట్‌కు అందించిన 26 పరుగుల భాగస్వామ్యమే చెప్పుకోదగ్గది. జడ్డూను సైతం హార్మర్ ఎల్బీ చేయగా.. కుదురుకున్న సుందర్‌ను మార్క్రమ్ అవుట్ చేయడంతో ఓటమి ఖరారైంది. కానీ చివర్లో అక్షర్ బ్యాట్ ఝుళిపించి ఈడెన్‌లో జోష్ నింపాడు. విజయానికి 47 పరుగుల దూరంలో ఉండగా, కేశవ్ ఓవర్‌లో అతను 4,6,6 బాదడంతో మ్యాచ్‌ను మలుపు తిప్పగలడనిపించింది. కానీ ఐదో బంతినీ భారీషాట్ ఆడేందుకు చూడగా అది గాల్లోకి లేచింది. దీన్ని మిడ్‌వికెట్ నుంచి వెనక్కి సిరాజ్‌ను డకౌట్ చేయడంతో సఫారీలు సంబరాల్లో మునిగిపోయారు.

### అజేయ కెప్టెన్

కెప్టెన్ బవుమా సారథ్యంలో దక్షిణాఫ్రికా ఇప్పటి వరకు టెస్టుల్లో ఓడిపోలేదు. తను సారథ్యం వహించిన 11 మ్యాచ్‌ల్లో పదింట్లో నెగ్గి ఒకటి డ్రా చేసుకుంది. తాజాగా 15 ఏళ్ల తర్వాత భారత్‌లో తమ జట్టుకు టెస్టు విజయాన్ని రుచి చూపించి అదుర్స్ అనిపించుకున్నాడు. ఈ సిరీస్‌కు ముందు పాక్‌తో ఆడిన రెండు టెస్టుల్లో జట్టు ఒకటి ఓడినా.. దానికి మార్క్రమ్ కెప్టెన్‌గా ఉన్నాడు.. మరోవైపు పదేళ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు ఆడిన స్పిన్నర్ హార్మన్ ఎనిమిది వికెట్లతో రాణించాడు. భారత్‌లో ఓ సౌతాఫ్రికా స్పిన్నర్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన.



### బుమ్రా క్షమాపణ?

తొలి టెస్టు ముగిశాక సౌతాఫ్రికా కెప్టెన్ బవుమాను పేసర్ బుమ్రా క్షమాపణ కోరడం కనిపించింది. రెండో రోజు ఆటలో తను బవుమాను మరుగుజ్జుతో పోల్చిన విషయం తెలిసిందే. ఆటగాళ్లంతా పెవిలియన్‌కు చేరుతున్న క్రమంలో బవుమా భుజంపై చేయి వేసిన బుమ్రా అతడితో మాట్లాడడం కనిపించింది. అటు బవుమా మాత్రం ముఖంలో ఎలాంటి భావాలు లేకుండా కనిపించాడు.

**స్కోరుబోర్డు**

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159**
**భారత్ తొలి ఇన్నింగ్స్: 189**

**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** రికెల్టన్ (ఎల్బీ) కుల్దీప్ 11, మార్క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4, ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11, బవుమా (నాటౌట్) 55, జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2, స్టబ్స్ (బి) జడేజా 5, వెరీన్ (బి) అక్షర్ 9, యాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 13, బాష్ (బి) బుమ్రా 25, హార్మర్ (బి) సిరాజ్ 7, కేశవ్ (ఎల్బీ) సిరాజ్ 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 54 ఓవర్లలో 153 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91, 8-135, 9-153, 10-153; **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1, అక్షర్ 14-0-36-1, కుల్దీప్ 8-1-30- 2, జడేజా 20-3-50-4, సిరాజ్ 2-0-2-2.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0, రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1, సుందర్ (సి) హార్మర్ (బి) మార్క్రమ్ 31, జురెల్ (సి) బాష్ (బి) హార్మర్ 13, పంత్ (సి అండ్ బి) హార్మర్ 2, జడేజా (ఎల్బీ) హార్మర్ 18, అక్షర్ (సి) బవుమా (బి) కేశవ్ 26, కుల్దీప్ (ఎల్బీ) హార్మర్ 1, బుమ్రా (నాటౌట్) 0, సిరాజ్ (సి) మార్క్రమ్ (బి) కేశవ్ 0, గిల్ (ఆబ్సెంట్ హర్ట్); **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 93 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-33, 4-38, 5-64, 6-72, 7-77, 8-93, 9-93; **బౌలింగ్:** యాన్సెన్ 7-3-15-2, హార్మర్ 14-1-21-4, కేశవ్ 9-1-37-2, బాష్ 2-0-14-0, మార్క్రమ్ 3-0-5-1.

### పిచ్ బానే ఉంది: గంభీర్

బౌలర్లు ఆధిపత్యం చూపిన ఈడెన్ పిచ్‌పై విమర్శలు వ్యక్తమవుతుండగా, భారత జట్టు కోచ్ గౌతం గంభీర్ మాత్రం భిన్నంగా స్పందించాడు. 'ఈ పిచ్ పూర్తిగా ఆడేందుకు వీల్లేకుండా ఏమీ లేదు. పిచ్ ఎలా వుండాలని మేముకోరుకున్నామో.. అదే లభించినందుకు సంతోషంగానే ఉంది.' అని కోచ్ గంభీర్ తెలిపాడు. అటు బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు గంగూలీ సైతం భారత జట్టు కోరిక మేరకే ఈ పిచ్‌ను రూపొందించినట్టు, క్యురేటర్ ముఖర్జీని తప్పుపట్టాల్సిన అవసరం లేదని తేల్చాడు. అలాగే రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రాకు తొలి ఓవర్ ఇవ్వకపోవడాన్ని మాజీ బౌలర్ కుంబ్లే ప్రశ్నించాడు.

## మన ధనుష్ బంగారం

**బధిర ఒలింపిక్స్‌లో తెలుగు షూటర్‌కు 'రికార్డు' పసిడి**

న్యూఢిల్లీ: మాట్లాడలేకపోవడం, వినికిడిలోపం తన దృష్టిలో వైకల్యాలే కావంటూ.. బరిలోకి దిగితే పతకం సాధించడమే తన లక్ష్యం అని మరోసారి చాటిచెప్పాడు తెలుగు బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్. ఈ హైదరాబాద్ కుర్రాడు ప్రతిష్ఠాత్మక డెఫ్లింక్స్‌లో (బధిర అథ్లెట్లు పోటీపడే ఒలింపిక్స్) స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. అది కూడా.. ప్రపంచ రికార్డు ప్రదర్శనతో చాంపియన్‌గా నిలవడం విశేషం. టోక్యోలో ఆదివారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో ధనుష్ 252.2తో ప్రపంచ రికార్డు స్కోరు చేసి పసిడి దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన ముర్తజా వానియా 250.1 స్కోరుతో రజతం సొంతం చేసుకున్నాడు. ఫైనల్ చేరే క్రమంలో క్వాలిఫికేషన్స్‌లో శ్రీకాంత్ 630.6 స్కోరుతో డెఫ్లింక్స్ రికార్డును నమోదుచేశాడు. 23 ఏళ్ల ధనుష్‌కు ఇది డెఫ్లింక్స్‌లో మూడో స్వర్ణం. 2022 బ్రెజిల్‌లో జరిగిన డెఫ్లింక్స్‌లో అతడు రెండు పసిడి పతకాలు గెలుచుకున్నాడు. ఇక, తాజా డెఫ్లింక్స్‌లో మరో ఇద్దరు భారత షూటర్లు పతకాలు నెగ్గారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో మహిత్ సంధు (250.5) రజతం, వాఫ్ మారె (228.3) కాంస్యం సాధించారు. ఉక్రెయిన్ షూటర్ వికీయొ లిటా (252.4) స్వర్ణం గెలిచింది. 10 మీటర్ల వ్యక్తిగత విభాగంలో పసిడి అందుకున్న ధనుష్ శ్రీకాంత్.. సోమవారం జరిగే ఇదే ఈవెంట్ మిక్స్‌డ్ విభాగంలో మహిత్ సంధుతో కలిసి బరిలోకి దిగనున్నాడు.



### రూ. 1.20 కోట్లు నజరానా

**ప్రకటించిన రాష్ట్ర సర్కారు**

హన్మకొండ: డెఫ్లింక్స్‌లో స్వర్ణం గెలిచిన ధనుష్ శ్రీకాంత్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. రాష్ట్రంలో అమలవుతున్న క్రీడా విధానం ప్రకారం డెఫ్లింక్స్‌లో స్వర్ణం అందుకున్న శ్రీకాంత్‌కు రూ. 1.20 కోట్లు ప్రోత్సాహక బహుమతి కింద ఇవ్వనున్నట్టు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. ఆదివారం ఇక్కడ జరిగిన కొత్త స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి శ్రీహరి.. ఈ రివార్డు ప్రకటించారు.

## హరికృష్ణ ఓటమి

పనాజీ: ఫిడే చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన ప్రీక్వార్టర్స్ టైబ్రేక్ ర్యాపిడ్ 15 నిమిషాల రెండు గేమ్‌లను కూడా జోస్ మార్టినెజ్ (మెక్సికో)తో హరికృష్ణ డ్రా చేసుకున్నాడు. ఆతర్వాత జరిగిన ర్యాపిడ్ 10 నిమిషాల గేమ్‌లో ఓడి, వరల్డ్‌కప్ నుంచి నిష్క్రమించాడు. ఇక, ఇప్పటికే క్వార్టర్స్‌లో బెర్త్ ఖాయం చేసుకున్న తెలుగు జీఎం ఇరిగేసి అర్జున్ పైనే భారత పతక ఆశలు ఆధారపడి ఉన్నాయి. క్వార్టర్స్‌లో అర్జున్ చైనా జీఎం వైయ్ యితో తలపడనున్నాడు.

## నాలుగో స్థానానికి టీమిండియా

న్యూఢిల్లీ: కోల్‌కతా టెస్ట్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడడంతో.. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ 54.17 విజయాల శాతంతో మూడునుంచి నాలుగో స్థానానికి దిగజారింది. 2025-27 డబ్ల్యూటీసీ వలయంలో ఆడిన ఎనిమిది టెస్ట్‌ల్లో టీమిండియాకిది మూడో ఓటమి. అయితే, చిరస్మరణీయ విజయాన్ని సాధించిన దక్షిణాఫ్రికా నాలుగు నుంచి రెండో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌కు ముందు శ్రీలంక, భారత్‌లు రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆడిన మూడింటిలోనూ నెగ్గిన ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. ఇక గువహటిలో జరిగే రెండో టెస్టులో నెగ్గితే భారత్ మళ్లీ మూడోస్థానానికి చేరుతుంది. డ్రా అయితే నాలుగులోనే ఉంటుంది. ఒక వేళ ఓడితే ఐదోస్థానానికి పడిపోతుంది.

## హైదరాబాద్ తడబాటు

**తొలి ఇన్నింగ్స్‌లో 88/6 ● జమ్మూ కశ్మీర్ 170**

జమ్మూ: బౌలర్ల ఆధిపత్యం సాగిన మ్యాచ్‌లో హైదరాబాద్ కష్టాల్లో పడింది. గ్రూప్-డిలో జమ్మూ కశ్మీర్‌తో ఆదివారం ఆరంభమైన రంజీ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 88/6 స్కోరు చేసింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (48) రాణించాడు. తన్మయ్ (0), అభిరత్ (5), హిమతేజ (0), నితీశ్ (3), రాహుల్ రాధేష్ (7) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. ఆకిబ్ నబీ మూడు వికెట్లు పడగొట్టాడు. జమ్మూ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు ఆలౌటైంది. కార్తికేయ, తనయ్ చెరో మూడు వికెట్లు దక్కించుకొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నేడు సుప్రీం కోర్టులో విచారణ

న్యూఢిల్లీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ స్పీకర్‌కు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణకు సుప్రీంకోర్టు గతంలో విధించిన గడువు అక్టోబర్ 31వ తేదీతో ముగిసింది. దీంతో మరో 8 వారాలు గడువు పొడిగించాలని అదేరోజు స్పీకర్ కార్యాలయం కోర్టును కోరింది. రోజువారీ కార్యక్రమాలు, స్పీకర్ల అంతర్జాతీయ సదస్సులు, విదేశీ పర్యటనలు తదితర కార్యక్రమాల్లో స్పీకర్ బిజీగా ఉన్నందున గడువులోగా విచారణ సాధ్యంకాలేదని తెలిపింది. మరోవైపు స్పీకర్ ఉద్దేశపూర్వకంగానే విచారణ ఆలస్యం చేస్తున్నారని, అందువల్ల స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, ఆ పదిమంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మరో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు అన్నింటినీ కలిపి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించనుంది. విచారణకు స్పీకర్‌కు మరికొంత సమయం ఇస్తారా? ఇస్తే ఎంత సమయం ఇస్తారు? అనేదానిపై సోమవారం స్పష్టత రానుంది. కాగా, ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరిలను ఇంతవరకూ స్పీకర్ విచారించలేదనే అంశంపైనే బీఆర్ఎస్ వాదనలు వినిపించే అవకాశం ఉంది. 24న సీజేఐ పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారా? మరో ధర్మాసనం వద్దకు పంపుతారా? అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## రైతులను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వాలు

» మక్క, పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరం: హరీశ్‌రావు



సిద్దిపేట నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి, మక్క రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పెడుతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదివారం సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలం మల్లారంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 6 లక్షల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసిందని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.1400 కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా ధాన్యం డబ్బులు చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 డిగ్రీల తీవ్ర చలిలో రైతులు పడిగాపులు కాస్తున్నారని, కావున ప్రభుత్వం వీలైనంత త్వరగా కొనుగోలులో వేగం పెంచాలని డిమాండ్ చేశారు. గత యాసంగి, ఈ వానకాలం బోనస్ డబ్బులు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మాజీ మంత్రిగా, సిద్దిపేట ఎమ్మెల్యేగా, కాంగ్రెస్ నాయకుడిగా సేవలందించిన దివంగత అనంతుల మదన్‌మోహన్ విగ్రహాన్ని హరీశ్ రావు ఆదివారం సిద్దిపేటలోని విక్టరీ చౌరస్తాలో ఆవిష్కరించారు.

## పత్తి రైతుల సమస్యలను పరిష్కరించండి

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రైతులకు కష్టాలు : కేటీఆర్

మద్దతు ధర దక్కకపోవడంతో రాష్ట్రంలోని పత్తి రైతులు సంక్షోభం ఎదుర్కొంటుంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దునిద్ర వీడటం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇరు ప్రభుత్వాలు తక్షణం స్పందించి పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కుంటిసాకులతో కొనుగోలు నిరాకరిస్తున్న సీసీఐ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో పత్తి రైతులకు కనీస మద్దతు ధర కూడా దక్కడం లేదన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు.

## కారుకూతలకు జూబ్లీహిల్స్ ఫలితమే సమాధానం!

### గత ప్రభుత్వం ఇచ్చిన డబుల్ ఇళ్లలో లక్షకుపైగా పునాది దశలోనే.. అదీ వారి పనితీరు

» మేం రూ.25,500 కోట్లతో నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశాం
» ప్రజాప్రభుత్వానికి అండగా నిలవండి
» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
» ఇల్లెందులో అభివృద్ధి పనులు ప్రారంభం
» ఇళ్ల లబ్ధిదారులకు పత్రాల పంపిణీ

ఇల్లెందుటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై కొందరు చేస్తున్న కారుకూతలకు జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు వంటి సమాధానమని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ ఉప ఎన్నిక ఫలితాలపై కొందరు ఇప్పటికీ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో పర్యటించిన మంత్రి రూ.15 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సుమారు లక్ష ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయని, ఈ పరిస్థితి వారి పనితీరుకు అద్దం పడుతోందని ఎద్దేవా చేశారు. అలాంటి వారు.. నిత్యం పేదల కోసం పని చేస్తున్న తమ ప్రజాప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.25,500 కోట్లు కేటాయించామని, నాలుగున్నర లక్షల ఇళ్లను ఇప్పటికే మంజూరు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరైన 243 మంది ఎస్టీ లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందులో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

# డయాలిసిస్ దోపిడీ


(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యశ్రీ ట్రస్టు చూస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ కేంద్రాల సంఖ్య పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 102 కేంద్రాలను అందుబాటులోకి తీసుకురాగా, వాటిలో 98 కేంద్రాలు ప్రస్తుతం సేవలందిస్తున్నాయి. ఇవన్నీ కూడా ప్రభుత్వ ఆస్పత్రుల ప్రాంగణంలో నడుస్తున్నాయి. వీటికి ప్రభుత్వమే స్థలం, నీళ్లు, కరెంటును ఉచితంగా అందిస్తోంది. యంత్రాల ఏర్పాటు, నిర్వహణ మాత్రం ప్రైవేటు ఏజెన్సీలు చూస్తున్నాయి. ఒక పేషంట్ ఒక్కసారి డయాలిసిస్ చేయించుకుంటే ప్రభుత్వం.. సంబంధిత ఏజెన్సీకి రూ.1820 చెల్లిస్తోంది. విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆరోగ్యశ్రీ కింద ఇవే సేవలను ప్రైవేటు ఆస్పత్రుల్లోని డయాలిసిస్ కేంద్రాలు అందిస్తే వారికి ప్రభుత్వం ఒక డయాలిసిస్‌కు రూ.1350 చొప్పున చెల్లిస్తోంది. అక్కడ నీళ్లు, కరెంటు, స్థలం అంతా సదరు ప్రైవేటు ఆస్పత్రి బాధ్యతే. అయినా, ప్రైవేటు కంటే సర్కారీ కేంద్రాలకే ఒక్కో డయాలిసిస్‌కు అదనంగా రూ.470 చెల్లిస్తున్నారు. రెండూ చోట్ల కూడా సింగిల్ డయాలైజర్స్‌నే వినియోగిస్తున్నారు. కానీ చెల్లిస్తున్న ధరలో మాత్రం భారీ వ్యత్యాసం. ఇది 2022 నుంచి జరుగుతోంది. ఆ ఏడాది అక్టోబరు వరకు డయాలిసిస్‌కు రూ.1375 చొప్పున చెల్లించారు. ఆ తర్వాత నుంచి రేట్లు పెంచేశారు.

క్రమంగా పెరిగిన ధర

2009-2016 మధ్య కాలంలో మల్టీ యూజ్ డయలైజర్‌కు రూ.1250 చొప్పున ధర నిర్ణయించారు. ఆ తర్వాత నుంచి ధర పెరుగుతూ వస్తోంది. 2017 నుంచి 2022 వరకు ఒకే కంపెనీ రాష్ట్రవ్యాప్తంగా డయాలిసిస్ సేవలు అందించింది. అనంతరం, మొత్తం మూడు క్లస్టర్లుగా విభజించి డయాలిసిస్ కేంద్రాలను వాటి పరిధిలోకి తీసుకొచ్చారు. గాంధీ ఆస్పత్రి పరిధిని ఒకటవ క్లస్టర్‌గా విభజించి దాని కిందికి 28 డయాలిసిస్ కేంద్రాలను తీసుకొచ్చారు. నిమ్స్ ఆస్పత్రి పరిధిలో రెండవ క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. దీని కింద 43 కేంద్రాలున్నాయి. ఉస్మానియా పరిధిలో 3వ క్లస్టర్ ఉంది. దాని కిందకు 27 కేంద్రాలను అప్పగించారు. ఒక్కో క్లస్టర్‌ను ఒక్కో ఏజెన్సీకి అప్పగించారు. ఒకటవ క్లస్టర్‌లో ఒక డయాలిసిస్‌కు రూ.1375 ఇవ్వగా, 2వ, 3వ క్లస్టర్లలో రూ.1415 చొప్పున గత ప్రభుత్వం చెల్లించింది. 2022 నాటికి ఏజెన్సీ కాంట్రాక్టు సమయం ముగియడంతో మళ్లీ టెండర్లు పిలిచారు. మూడు కంపెనీలు టెండర్లను దక్కించుకున్నాయి. దాంతోపాటే రేటు కూడా భారీగా పెంచారు. 1వ, 3వ క్లస్టర్లలో ఒక్కో డయాలిసిస్‌కు రూ.1820గా, 2వ క్లస్టర్‌లో రూ.1794గా ధర నిర్ణయించారు. నాడు వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు ఉన్నతాధికారులు, డయాలిసిస్ సేవలందించే కార్పొరేట్ ఏజెన్సీలు మిలాఖత్ అయి రేట్లను భారీగా పెంచేశారన్న ఆరోపణలు వచ్చాయి. కోట్ల రూపాయలు చేతులు మారాయన్న విమర్శలు వచ్చాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద అందించే డయాలిసిస్ రేటు మాత్రం రూ.1350గానే ఉంది. దాంట్లో మార్పు లేదు.





### మూడేళ్లలోనే రూ.560 కోట్ల చెల్లింపు

ప్రస్తుతం మూడు క్లస్టర్ల పరిధిలో 845 డయాలిసిస్ యంత్రాలు పని చేస్తున్నాయి. ఈ మూడు క్లస్టర్ల కింద 7 కేంద్రాల్లో ఐదు షిఫ్టులు, 41 కేంద్రాల్లో నాలుగు షిఫ్టులు, 50 కేంద్రాల్లో 2-3 షిఫ్టుల ప్రకారం డయాలిసిస్ సేవలందిస్తున్నారు. 1వ క్లస్టర్‌లో 1806 డయాలిసిస్ రోగులుండగా, 2వ క్లస్టర్‌లో 3104 మంది, 3వ క్లస్టర్‌లో 1796 మంది మొత్తం 6,706 మంది రోగులు రక్తశుద్ధి చేయించుకుంటున్నట్లు ఆరోగ్యశ్రీ గణాంకాలు చెబుతున్నాయి. ప్రైవేటులో కూడా కలిపితే మొత్తం 11,893 మంది రోగులు డయాలిసిస్ చేయించుకుంటున్నారు. వీరందరికిగాను నెలకు సగటున 94,753 డయాలిసిస్ సెషన్స్ నిర్వహిస్తున్నారు. కాగా తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు ఈ సేవలకు అయిన మొత్తం వ్యయం రూ.1178 కోట్లు కాగా, గడిచిన మూడేళ్లలోనే ఇది దాదాపు సగం (రూ.560 కోట్లు) ఉండటం గమనార్హం. డయాలిసిస్ ధరలను భారీగా పెంచటం వల్లనే ఇది జరిగిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా, దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టి విచారణ జరిపించాలని యోచిస్తున్నట్లు సమాచారం. డయాలిసిస్ ధరను తగ్గించే అవకాశం కూడా ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## ఆధార్ లేకున్నా బడిలో చేరొచ్చు

జనన ధ్రువీకరణ పత్రమూ అవసరం లేదు

అవి లేవని బడిలో ప్రవేశాలను నిరాకరించొద్దు

టీసీ జారీలో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు

రాష్ట్రంలోని అన్ని స్కూళ్లకు విద్యా శాఖ ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆధార్, జనన ధ్రువీకరణ వంటి గుర్తింపు పత్రాలు, బదిలీ సర్టిఫికెట్(టీసీ) వంటివి లేకపోయినా ఇకపై పిల్లలు బడిలో చేరొచ్చు. అవి ఉంటేనే ప్రవేశం కల్పిస్తామని పాఠశాలలు చెప్పడానికి అవకాశం లేదు. గుర్తింపు పత్రాలు లేనికారణంగా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను నిరాకరించడానికి వీల్లేదని తెలంగాణ విద్యా శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆధార్, జనన ధ్రువీకరణ వంటి గుర్తింపు పత్రాలు లేనందున నగరంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన వలస శ్రామికుల పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోవడం లేదు. అందువల్ల వారంతా చదువుకు దూరమవుతున్నారని వివరిస్తూ.. 'అ..ఆ కు అడ్డంకిగా ఆధార్' పేరుతో ఈ నెల 14న ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై తెలంగాణ విద్యా శాఖ స్పందించింది. విద్యా హక్కు చట్టం-2009, సెక్షన్14(2) ప్రకారం జనన ధ్రువీకరణ వంటి గుర్తింపు పత్రాలు లేనికారణంగా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను నిరాకరించడానికి వీల్లేదని ఈ నెల 14న విడుదల చేసిన జీవోలో పాఠశాల విద్యా శాఖ స్పష్టం చేసింది. ఎలాంటి పత్రాలు లేకపోయినా పిల్లలకు ప్రవేశం కల్పించాలని తెలంగాణలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో విద్యార్థి ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు మారుతున్నప్పుడు బదిలీ సర్టిఫికెట్(టీసీ) వెంటనే జారీ చేయాలి. జాప్యం చేసిన పక్షంలో సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని కూడా అందులో హెచ్చరించారు. టీసీ లేకపోయినా పిల్లలను స్కూల్లో చేర్చుకోవాలని ఆదేశించారు.

## పెళ్లి కోసం పసికందు బలి

కాళ్లతో తొక్కి చంపిన నలుగురు యువతులు

» రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘటన



చేతిలో పసికందుతో ఓ నిందితురాలు

జైపూర్, నవంబరు 16: రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. కేవలం 16 రోజుల వయసున్న పసికందును నలుగురు యువతులు కాళ్లతో తొక్కి చంపారు. పెళ్లిళ్లు కావడం లేదనే నిరాశతో, కొడుకు వరుసయ్యే ఆ శిశువును బలిస్తే తమకు సంబంధాలు వస్తాయని నమ్మి వారు ఈ దారుణానికి పాల్పడినట్లు బాలుడి తండ్రి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వైరల్ అవుతున్న వీడియోలో, మహిళల్లో ఒకరు పసికందును ఒడిలో పెట్టుకుని మంత్రాలు జపిస్తోంది. ఆమె చుట్టూ కూర్చున్న మిగతా మహిళలు కూడా ఆ జపంలో పాలుపంచుకున్నారు. స్థానిక దేవత అయిన భైరును ప్రసన్నం చేసుకోవడం కోసం ఈ తంతు చేసినట్లు అధికారులు తెలిపారు. తన కొడుకును చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని బాలుడి తండ్రి డిమాండ్ చేశారు.



సోనిబెన్ రాథోడ్



సాజన్ బారయ్య

## ప్రేమ పాశమే.. యమపాశమై!

ముహూర్తానికి ముందే వధువును చంపిన వరుడు

చీర విషయమై గొడవ.. వరుడు రౌడీషీటర్

గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఘటన

భావ్‌నగర్, నవంబరు 16: కొద్దిసేపట్లో వేద మంత్రాలు.. కుటుంబ పెద్దలు, బంధు మిత్రుల సాక్షిగా.. తాళి కట్టి.. ప్రేమించిన సహచరిని జీవిత భాగస్వామిగా చేపట్టాల్సిన వ్యక్తే కడతేర్చిన ఘటన గుజరాత్‌లోని జిల్లా కేంద్రమైన భావ్‌నగర్ నగరం టెక్రీచౌక్ ప్రాంతంలో శనివారం జరిగింది. సాజన్ బారయ్య (26) అనే యువకుడితో ప్రేమలో పడిన సోనీబెన్ రాథోడ్ (22).. అతడి కోసం కుటుంబాన్ని వదిలిపెట్టింది. ఇద్దరూ 8 నెలలు సహ జీవనం చేశారు. ఇరు కుటుంబాల అంగీకారంతో దాంపత్య జీవితంలో అడుగు పెట్టాలనుకున్నారు. ఈ నెల 15న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. అందమైన జీవితంపై కలలు కన్న సోనీబెన్ పెళ్లికి ముందు ఘనంగా జరిగిన మెహిందీ వేడుకలో ఒక చేతిపై 'సాజన్', మరో చేతిపై 'సదా సౌభాగ్యవతి భవ' అని రాసుకున్నారు. చివరకు ముహూర్తం వేళ సోనీబెన్ రాథోడ్ కట్టుకునే చీరతో పాటు డబ్బు విషయంలో వధూవరుల మధ్య మాటా మాటా పెరిగింది. ఆ కోపంలో వధువు సోనీ తలపై పైపుతో కొట్టిన సాజన్.. గోడకేసి కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందాక పరారయ్యాడు. సాజన్‌పై హత్యాయత్నం, దోపిడీ, భౌతిక దాడి తదితర కేసులతో రౌడ్ షీట్ కూడా ఉండటం గమనార్హం.

# షర్మిల.. కవిత.. రోహిణి..

## రాజకీయ కుటుంబాల్లో.. కుటుంబ రాజకీయాల చిచ్చు

» తేజస్వియాదవ్, ఆయన సన్నిహితులు నన్ను తీవ్రంగా అవమానించారు
» చెప్పుతో కొట్టబోయారు.. పుట్టింటికి దూరం చేసి, అనాథను చేశారు
» లాలూ కుమార్తె, తేజస్వి సోదరి రోహిణి







పట్నా, నవంబరు 16: మరో రాజకీయ కుటుంబంలో కుటుంబ రాజకీయాల చిచ్చు బయటపడింది. మరో ఆడపడుచును పుట్టిల్లు పొమ్మంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సోదరి షర్మిల, తెలంగాణలో కేటీఆర్ సోదరి కవిత తరహాలోనే తాజాగా బిహార్‌లో ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె, తేజస్వియాదవ్ సోదరి రోహిణి ఆచార్య తమ కుటుంబం నుంచి బయటికి వచ్చారు. తేజస్వియాదవ్, ఆయన సహాయకులు కలిసి తనను దారుణంగా అవమానించారంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఇకపై ఆ కుటుంబంతో, ఆర్జేడీ పార్టీతో సంబంధాలు తెంచుకుంటున్నాననీ ప్రకటించారు. అంతేకాదు లాలూ మరో ముగ్గురు కుమార్తెలు కూడా పట్నాలోని లాలూ నివాసాన్ని వదిలేసి.. తమ కుటుంబాలతో ఢిల్లీ వెళ్లిపోయారు. ఇంటి ఆడపడుచులు ఆవేదనతో బయటికి వచ్చిన ఈ మూడు కుటుంబ పార్టీలు కూడా దారుణ పరాజయాల పాలవడం గమనార్హం.

### చెప్పు చూపించి.. అవమానించి..

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ దారుణ పరాజయం పాలైన మరుసటి రోజే.. ఆర్జేడీ పార్టీని, లాలూ కుటుంబాన్ని వీడుతున్నట్టు రోహిణి ఆచార్య ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదివారం ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ 'ఎక్స్'లో సంచలన ఆరోపణలు చేశారు. సోదరుడు తేజస్వియాదవ్, ఆయన సన్నిహితులు తనను మురికిదానివంటూ తీవ్రంగా తిట్టారని, చెప్పుతో కొట్టడానికి సిద్ధమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ దారుణ ఓటమికి తేజస్వియాదవ్ సన్నిహితులు హరియాణాకు చెందిన ఎంపీ సంజయ్ యాదవ్, యూపీకి చెందిన రమీజ్ కారణమని ఆరోపించారు. "నిన్న ఓ సోదరి, ఓ కుమార్తె తీవ్రంగా అవమానం ఎదుర్కొంది. నన్ను మురికిదాన్ని అని అసభ్యంగా తిట్టారు. కొట్టేందుకు చెప్పు ఎత్తారు. నేను నా ఆత్మ గౌరవం విషయంలో రాజీ పడలేదు. సత్యాన్ని వాళ్లకు లొంగనీయలేదు. కేవలం అందుకోసమే అవమానాలను ఎదుర్కొన్నాను. ఏడుస్తున్న తల్లిదండ్రులను, అక్కచెల్లెళ్లను నిస్సహాయ స్థితిలో వీడి బయటికి వచ్చాను. డబ్బులు, పార్టీ టికెట్ కోసం నా మురికి కిడ్నీని మా నాన్నకు ఇచ్చానన్నారు. వివాహమైన ఆడపిల్లలు తమ పుట్టింటిలో సోదరుడు ఉంటే.. మీ తండ్రిని కాపాడటానికి ఎప్పుడూ, ఎలాంటి సాయం చేయకండి. దానికి బదులు మీ సోదరుడినే, సోదరుడి హరియాణా స్నేహితుడినో (ఎంపీ సంజయ్ యాదవ్‌ను ఉద్దేశిస్తూ) కిడ్నీ ఇవ్వాలని చెప్పండి. అందరు అక్కచెల్లెళ్లు, కూతుళ్లు మీ అత్తింటిని, మీ కుటుంబాలను, మీ పిల్లలను బాగా చూసుకోండి. కేవలం మీ గురించే ఆలోచించుకోండి. నేను నా కుటుంబాన్ని, నా ముగ్గురు పిల్లలను చూసుకోకుండా పెద్ద పాపం చేశాను. నా భర్త, అత్తింటి వారి అనుమతి తీసుకోకుండా నా తండ్రికి కిడ్నీ ఇచ్చాను. దేవుడి లాంటి తండ్రి (లాలూ)ను కాపాడుకోవడానికి ఆ పని చేశాను. నాకు శాపం తగిలింది. ఇప్పుడు మురికి దానిని, మురికి కిడ్నీ అని మాటలు పడుతున్నాను. వాళ్లు నన్ను పుట్టింటి నుంచి తరిమేశారు. నన్ను అనాథను చేశారు" అని రోహిణి ఆచార్య ఆవేదన వ్యక్తం చేశారు. 47 ఏళ్ల రోహిణి ఆచార్య లాలూ రెండో కుమార్తె. వైద్యురాలు అయిన ఆమె భర్తతో కలసి తొలుత సింగపూర్‌లో స్థిరపడ్డారు. లాలూ రెండు కిడ్నీలు దెబ్బతినడంతో.. ఆమె తన కిడ్నీని తండ్రికి ఇచ్చారు. కొంతకాలం నుంచి పట్నాలోనే ఉంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో సరణ్ స్థానంలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

### లాలూ ఇంటిని వీడిన మరో ముగ్గురు

లాలూకు ఏడుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో రెండో కుమార్తె రోహిణి తీవ్ర ఆరోపణలతో బయటికి వచ్చారు. ఈ క్రమంలో లాలూ మరో ముగ్గురు కుమార్తెలు రాజ్యలక్ష్మి, రాగిణి, చందా కూడా పట్నాలోని నివాసం నుంచి తమ కుటుంబాలను తీసుకుని ఆదివారమే ఢిల్లీకి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. లాలూ కుమారుల్లో పెద్దవాడైన తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను పలు పరిణామాల నేపథ్యంలో కొన్ని నెలల క్రితం ఆర్జేడీ నుంచి బహిష్కరించారు. దానితో ఆయన జనశక్తి జనతాదళ్ (జేజేడీ) పేరిట పార్టీ స్థాపించారు. ఇటీవలి ఎన్నికల్లో మహువా నుంచి పోటీ చేసి, ఓడిపోయారు. చిన్నవాడైన తేజస్వియాదవ్ ఆర్జేడీని నడిపిస్తున్నారు. కాగా, తన సోదరి రోహిణి ఆవేదన విని తన గుండె తరుక్కుపోయిందని తేజ్‌ప్రతాప్ పేర్కొన్నారు. తనను ఎంతగా ఇబ్బందిపెట్టినా తట్టుకున్నానని, కానీ సోదరిని ఇలా అవమానించడాన్ని సహించలేకపోతున్నానని చెప్పారు.

## వచ్చే మార్చికల్లా మరో 7 ప్రయోగాలు

### 2027లో గగన్‌యాన్.. 2028లో చంద్రయాన్-4: ఇస్రో

కోల్‌కతా, నవంబరు 16: ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి వరకు ఇస్రో మరో ఏడు ప్రయోగాలు చేపట్టనుందని సంస్థ చైర్మన్ నారాయణన్ తెలిపారు. 2027లో చేపట్టనున్న మానవసహిత అంతరిక్ష మిషన్ గగన్‌యాన్‌కు ఏర్పాట్లు చేసుకుంటూనే.. ఈ ప్రయోగాలు చేపట్టేందుకు ప్లాన్ చేస్తున్నట్టు వివరించారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. ఇస్రో ముందున్న లక్ష్యాలను ఆయన వివరించారు. 2026 మార్చిలోగా ఏడు ప్రయోగాలు చేపట్టనున్నామని, వాటిలో ఒక వాణిజ్య కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగంతోపాటు పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మిషన్లు కూడా ఉన్నాయని తెలిపారు. పూర్తిగా భారతీయ సంస్థలే తయారుచేసిన పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం వీటిలో ఒక మైలురాయిగా నిలవనుందన్నారు. చంద్రునిపై దిగడమే కాకుండా అక్కడి నుంచి కొన్ని నమూనాలను తీసుకొచ్చే లక్ష్యంతో చేపట్టనున్న చంద్రయాన్-4 మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపిందని నారాయణన్ చెప్పారు. ఇస్రో చరిత్రలోనే అత్యంత సంక్లిష్టమైన మిషన్‌గా నిలవనున్న ఈ ప్రయోగాన్ని 2028లో చేపడతామని వెల్లడించారు. ఇక చంద్రుని దక్షిణ ధ్రువంలో నీటి మంచును అధ్యయనం చేయడం కోసం జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా)తో కలిసి సంయుక్తంగా చేపట్టనున్న లూపెక్స్ మిషన్ కూడా తమ ప్రణాళికల్లో ఉందని చెప్పారు. దీన్ని 2035 నాటికల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. అంతరిక్ష ప్రయోగాలకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో తదనుగుణంగా రాబోయే మూడేళ్లలో రాకెట్ల ఉత్పత్తిని మూడు రెట్లు పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కాగా.. గగన్‌యాన్ మిషన్‌పై నెలకొన్న సందేహాలపై కూడా ఇస్రో చైర్మన్ స్పష్టతనిచ్చారు. ఈ మిషన్‌ను 2027 నాటికి చేపట్టే ప్రణాళికలో ఎలాంటి మార్పూ లేదన్న ఆయన.. వ్యోమగాములతో కూడిన ఈ యాత్రకు ముందు మూడు మానవరహిత టెస్టింగ్ మిషన్లు ఉంటాయని చెప్పారు. వీటిలో భాగంగా తొలి ప్రయోగాన్ని ఈ ఏడాది పూర్తిచేస్తామన్నారు. మానవసహిత ప్రయాణం 2027లో ఉంటుందని తెలిపారు.

## అంటువ్యాధుల వ్యాప్తిని పసిగట్టే 'హెల్త్ సెంటినెల్'

### ఏఐ టూల్‌తో 2022 నుంచి 5 వేలకుపైగా హెచ్చరిక సందేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 16: వ్యాధులపై నిఘా కోసం జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) 2022లో అందుబాటులోకి తీసుకొచ్చిన 'హెల్త్ సెంటినెల్' అనే కృత్రిమ మేధ (ఏఐ) పరికరం అద్భుతంగా పనిచేసింది. అంటువ్యాధుల వ్యాప్తికి సంబంధించి ఆరోగ్యశాఖ అధికారులకు ఇది 5 వేలకుపైగా హెచ్చరిక సందేశాలు పంపిందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఢిల్లీకి చెందిన ప్రముఖ హెల్త్‌కేర్ సంస్థ వాధ్వానీ ఏఐ అభివృద్ధి చేసిన 'హెల్త్ సెంటినెల్' అనే ఏఐ పరికరం మాన్యువల్ పనిభారాన్ని 98 శాతం తగ్గించడంలో సహాయపడింది. అంటువ్యాధుల వ్యాప్తిని ముందుగానే గుర్తించి అధికారులను అప్రమత్తం చేయడానికి దోహదపడిందని ఈ అధ్యయనం తెలిపింది. భారత్‌లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడీఎస్‌పీ) కింద.. ప్రింట్, ఎలక్ట్రానిక్, ఆన్‌లైన్ మీడియాలోని వార్తా నివేదికలను స్కాన్ చేయడం ద్వారా 'హెల్త్ సెంటినెల్' అసాధారణ ఆరోగ్య సమస్యలను ముందస్తుగానే గుర్తించి ఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేసేందుకు వారికి సందేశాలు పంపించేది. 'హెల్త్ సెంటినెల్' ప్రతిరోజూ 13 భాషల్లోని వార్తా నివేదికలను స్కాన్ చేస్తుందని, 2022 నుంచి ఇప్పటివరకూ 30 కోట్లకుపైగా వార్తా కథనాలను స్కాన్ చేసిందని పరిశోధకులు తెలిపారు.

## నేటి నుంచి శబరిమల యాత్ర ప్రారంభం

పథనంతిట్ట, నవంబరు 16: శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో వార్షిక మండల పూజ యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి 41 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. మలయాళం నెల వృశ్చికం మొదటి రోజు సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయ నూతన మేల్శాంతి హారతినిచ్చి ఆలయ ద్వారాలను తెరిచారు. మండల యాత్రకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) సన్నిధానంలో ప్రత్యేక మౌలిక సదుపాయాలను కల్పించాయి. యాత్ర మార్గంలో బయోటాయిలెట్లతో పాటు అనేక సంఖ్యలో మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని తెలిపింది. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అధికారులు పలుచోట్ల అత్యవసర వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వర్చువల్ క్యూలైన్ వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేశారు. బంగారం అపహరణ వివాదంతో రాజకీయ చర్చలకు శబరిమల కేంద్రబిందువుగా మారిన నేపథ్యంలో ఈ ఏడాది యాత్ర ప్రారంభమవుతోంది.

## పంజాబ్‌లో ఆరెస్సెస్ నేత కుమారుడి హత్య

ఫిరోజ్‌పూర్, నవంబరు 16: పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో స్థానిక ఆరెస్సెస్ నేత కుమారుడిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో కాల్చి చంపారని ఆదివారం పోలీసులు చెప్పారు. షాపు యజమాని అయిన నవీన్ ఆరోరా (32)ను బైక్‌పై వచ్చిన దుండగులు హతమార్చారని తెలిపారు. నవీన్ తండ్రి బల్దేవ్ రాజ్ అరోరా చాలా ఏళ్ల నుంచి ఇక్కడ ఆరెస్సెస్ కార్యకర్తగా పనిచేస్తున్నారు. తాత దివంగత దీనానాథ్ కూడా ఆరెస్సెస్‌లో పనిచేశారు. నవీన్ శనివారం తన షాపు నుంచి ఇంటికి నడుచుకొని వెళ్తుండగా సాధు చంద్ చౌక్ వద్ద గుర్తుతెలియని యువకులు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్పులు జరిపి పరారయ్యారు. వెంటనే అతడ్ని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు తెలిపారు. ఈ హత్యను బీజేపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్వని శర్మ ఖండించారు. శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు.

## ఒడిశా అటవీ గుహలో భారీగా ఆయుధాలు

మల్కాన్‌గిరి, నవంబరు 16: మావోయిస్టులు దాచిపెట్టినట్లుగా అనుమానిస్తున్న భారీ మొత్తంలోని ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా దులగుండి అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించిన బీఎస్ఎఫ్ బలగాలకు ఆదివారం ఓ కొండ గుహలో భారీ శస్త్రాగారం కనిపించింది. గుహలోని వస్తువులను పరిశీలించిన అధికారులు వివిధ రకాల పేలుడు పదార్థాలు, బుల్లెట్లను మావోయిస్టులు ఆ గుహలో దాచినట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న వాటిలో ఒక ఇంప్రువైజ్డ్ డైరెక్షనల్ మైన్, ఒక పిస్టల్, 110 జెలటిన్ స్టిక్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, 150 లైవ్ 7.62 మి.మీ క్యాట్రిజ్‌లు, 170 ఖాళీ షెల్‌లు, 10 బ్లాంక్ రౌండ్‌లు, 125 డెసిబెల్ శబ్దంతో పనిచేసే రెండు ఎలక్ట్రిక్ ట్రంపెట్లు, ఒక సెన్సార్ ఉన్నాయి. ఈ భారీ శస్త్రాగారం స్వాధీనం మావోయిస్టుల కార్యకలాపాలకు పెద్ద దెబ్బగా భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

# మరోమారు కేంద్రంపై ఒత్తిడి తెద్దామా?

» కోర్టు సూచన మేరకు ఎన్నికలకెళ్దామా?
» నేడు క్యాబినెట్ భేటీ.. 'స్థానికం'పై చర్చ
» స్టేటస్‌పై పంచాయతీరాజ్ నోట్ సిద్ధం

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పాలక మండళ్ల గడువు ముగిసి చాలా కాలమైనా.. ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వంపై ఒత్తిడి నెలకొని ఉంది. మరోవైపు ఈ కారణంతో కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ.3 వేల కోట్ల నిధులు పెండింగ్‌లో ఉండిపోయాయని పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వానికి చెబుతూ వస్తోంది. అయితే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోంది. 42 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను నిలిపివేస్తూ హైకోర్టు ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహించాలన్న దానిపై సోమవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకోనుంది. దీంతోపాటు వివిధ అంశాలు, కార్యక్రమాలకు సంబంధించి పాలన, విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. ప్రధానంగా స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణపైనే ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. కాగా, క్యాబినెట్ భేటీ కోసం స్థానిక ఎన్నికల పరిస్థితిపై పంచాయతీరాజ్ శాఖ సవివరమైన నోట్‌ను సిద్ధం చేసి ఉంచింది. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, కేంద్ర నిధులు పెండింగ్‌లో ఉండడం, డిసెంబరు 1 నుంచి పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం తుది ప్రయత్నాలు చేపట్టే అవకాశం వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గం సమీక్షించనుంది.

### అఖిలపక్ష పార్టీలతో ఢిల్లీకి

బీసీల రిజర్వేషన్ కోసం పార్లమెంటు సమావేశాల సందర్భంగా అఖిలపక్ష పార్టీలు, సంఘాలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానిని కలవడం, పార్లమెంటు వేదికగా ఒత్తిడి తేవడం వంటి అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. దీంతోపాటు హైకోర్టు సూచన మేరకు పాత రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లి.. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇచ్చే అంశాన్నీ పరిశీలిస్తున్నారు. పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తొలుత గ్రామపంచాయతీల వరకు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదననూ పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నింటినీ సమీక్షించి.. స్థానిక ఎన్నికలపై క్యాబినెట్ ఓ నిర్ణయానికి రానుంది. కాగా.. డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025, ప్రజా ప్రభుత్వ విజయోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపైనా సమీక్షించనున్నారు. వందేళ్ల ప్రగతికి రోడ్ మ్యాప్ కోసం రూపొందించనున్న తెలంగాణ రైజింగ్ - 2047 డాక్యుమెంట్ రూపకల్పనపైనా చర్చించనున్నారు.



గ్లోబల్ సమ్మిట్ -2025 పనుల నమూన మ్యాప్‌ను పరిశీలించి అధికారులతో ముచ్చటిస్తున్న భట్టి విక్రమార్క

## రెండేళ్లలో అభివృద్ధి చేసి చూపించాం

» 2047 తెలంగాణ రైజింగ్ విన్ డాక్యుమెంట్‌ను ప్రపంచానికి చూపిస్తాం: భట్టి విక్రమార్క

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ను ప్రపంచానికి చూపించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. డిసెంబరు 8, 9వ తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్-2025 వేదికను ఆదివారం ఆయన సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. 2047 వరకు తెలంగాణ ఏ రకంగా ఉండబోతుంది.. ఎలా ఉండాలి? అనే విషయాలను ప్రజాప్రభుత్వం సమ్మిట్‌లో వివరిస్తుందని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో వేదిక ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని, అందులో ఫ్యూచర్ సిటీ, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, దుండిగల్ ప్రాంతాలు ఉన్నట్లు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని, హైదరాబాద్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన స్థలాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## సమ్మె నిర్ణయాన్ని విరమించుకోవాలి

» జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై కేంద్రంతో మాట్లాడా: తుమ్మల



హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు సమ్మె నిర్ణయాన్ని విరమించుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. సీసీఐ తీసుకొచ్చిన నిబంధనలు తమకు నష్టాలు కలిగించే విధంగా ఉన్నాయని, తాము పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తామని జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు హెచ్చరించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. సమస్యలపై కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కార్యాలయ అధికారులతో మాట్లాడానని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నింగ్ మిల్లర్ల ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి మరోసారి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించేవిధంగా కృషి చేయాలని, మిల్లులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరానని పేర్కొన్నారు. సీసీఐ విధించిన ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేసి, ఎకరానికి 12 క్వింటాళ్ల పరిమితితో కొనుగోళ్లు జరిపేలా చొరవ తీసుకోవాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లానన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సమ్మె ఆలోచనలు విరమించాలని ఆయన సూచించారు.

## హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లను వేగంగా నిర్మించండి

» కేంద్ర మంత్రి గడ్కరీకి ఎంపీ ఈటల వినతి

హైదరాబాద్/మేడ్చల్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఫ్లైఓవర్ల పనులను వేగంగా చేపట్టాలని ఎంపీ ఈటల రాజేందర్.. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. హైదరాబాద్-నాగ్‌పూర్ 44వ నంబరు జాతీయ రహదారిపై జరుగుతున్న వంతెన, ఇతర పనులను త్వరగా పూర్తి చేయాలని అభ్యర్థించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పలు ఫ్లైఓవర్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఎంపీ ఈటల, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావు పటేల్ తదితరులు ఆదివారం నాగ్‌పూర్‌లో గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈటల.. పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్ల నిర్మాణాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఉప్పల్, కొంపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న ఫ్లైఓవర్ల పనులను సత్వరం పూర్తిచేయాలని కేంద్రమంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన గడ్కరీ.. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. "బాలానగర్-నర్సాపూర్ హైవేలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగినందున.. ఆ రహదారిపైనా ఫ్లైఓవర్ మంజూరు చేయాలని కోరాం. సాగర్ ఎక్స్ రోడ్డు వైపు ఫ్లైఓవర్ నిర్మించాలని కోరగా.. గడ్కరీ అంగీకరించారు" అని ఈటల తెలిపారు.

## నష్టపోయిన రైతులు పేర్లు నమోదు చేసుకోండి

» మొంథా తుపాను బాధితులకు అవకాశం

హైదరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులు తమ పేర్లను ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సూచించింది. వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మంత్రి తుమ్మలకు పంట నష్టం నమోదులో లోపాలను తెలిపామని కమిటీ వెల్లడించింది. రైతుల జాబితాలను పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించి, నమోదు కాని రైతుల వద్ద మళ్లీ ఫిర్యాదులు తీసుకోవడం స్వాగతిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ కోరింది.

## కాంగ్రెస్‌లో కలుపు మొక్కలను ఏరివేయండి!

» అందరి పనితీరును బేరీజు వేసి ప్రక్షాళన చేపట్టండి
» సీఎం రేవంత్, మీనాక్షిలకు సంపత్‌కుమార్ వినతి
» బండి సంజయ్.. కులమతాల చిచ్చు పెట్టకు: చామల

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్న నేపథ్యంలో అటు ప్రభుత్వంలో, ఇటు పార్టీలో వివిధ బాధ్యతల్లో ఉన్న వారి పనితీరును బేరీజు వేసి ప్రక్షాళన చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లకు ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అక్కడక్కడా కలుపు, గంజాయి మొక్కలు కనపడుతున్నాయని, వాటిని ఏరిపారేసి పచ్చని పంటలాగా ఉన్న కాంగ్రెస్‌ను.. మూడేళ్ల తర్వాత జరిగే ఎన్నికలకు ఇప్పట్నుంచే సిద్ధం చేయాలని సూచించారు. సీఎం రేవంత్, మీనాక్షి తనకు సమయమిస్తే ఎక్కడెక్కడ కలుపు మొక్కలు ఉన్నాయన్నది వివరిస్తానన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఘన విజయంతో అనుకూల వాతావరణం ఉందని, దీన్నే అదునుగా చేసుకుని పార్టీ, ప్రభుత్వంలో పునర్నిర్మాణ ప్రక్రియ చేట్టాలని కోరారు. రాష్ట్రంలోని 42 లక్షల మంది కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు రేవంత్ నాయకత్వంలో పోరాడారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభంజనంలో గెలుస్తామని చెప్పి ఎన్నికల ముందు అనేక మంది వచ్చి పార్టీలో చేరారని, రెండేళ్ల తర్వాత పార్టీ పరిస్థితి మారితే ఎవరెక్కడ ఉంటారో తెలియదన్నారు. ఈ రెండేళ్లలో ఆయా స్థాయుల్లో పదవులు నిర్వహించిన వారి పని తీరును బేరీజు వేసుకుని ప్రక్షాళన చేపట్టాలని కోరారు. ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలన్న సంగతి ప్రజలకు తెలుసని, కేంద్ర మంత్రి బండి సంజయ్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు.. ముందుగా రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులను తేవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. హిందువులు ఏ పార్టీలో ఉన్నా బీజేపీలో చేరాల్సిన పరిస్థితి వచ్చిందంటూ సంజయ్ చేసిన వ్యాఖ్యలపై చామల ఓ ప్రకటనలో స్పందించారు. కులమతాల ప్రస్తావనను పక్కన పెట్టి అభివృద్ధి గురించి మాట్లాడాలని పేర్కొన్నారు.

# రెండు రాష్ట్రాలు కలిసి నడవాలి

**చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం.. తెలంగాణ, ఏపీ అభివృద్ధికి సహకరిస్తా**

రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ వెల్లడి

రాష్ట్ర ప్రభుత్వ జీవోలు, ఉత్తర్వులను ఇకపై తెలుగులోనే ఇస్తాం: సీఎం రేవంత్



సత్తుపతి ప్రసూనశ్రీకి అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న చిన్న చిన్న సమస్యలను ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చునని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కలిసి అడుగులు వేస్తే రెండు రాష్ట్రాలూ అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. ఇరు రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఆదివారం రామోజీ ఫిలింసిటీలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవానికి ఉప రాష్ట్రపతి హాజరయ్యారు. దేశంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజ హితమే లక్ష్యంగా పనిచేస్తున్న వారికి ఈ అవార్డులను రాధాకృష్ణన్ చేతులమీదుగా అందజేశారు. అవార్డు గ్రహీతలకు మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు ఒక్కొక్కరికి రూ.10 లక్షల నగదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ జీవోలు, ఇతర ఉత్తర్వులను ఇకపై తెలుగులోనే ఇస్తామని ప్రకటించారు. తెలుగు భాషను అన్ని శాఖలలో విస్తృతం చేస్తామన్నారు. ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ గతంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా మూడున్నర నెలలపాటు బాధ్యతలు నిర్వహించి రాష్ట్రానికి సంపూర్ణమైన సహకారం అందించారని తెలిపారు. ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా కూడా ఆయన నుంచి అదే సహకారాన్ని ఆశిస్తున్నామన్నారు. కాగా, తెలుగు భాషను కాపాడుకోవడానికి రామోజీరావు స్ఫూర్తితో పనిచేస్తామని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు.

### విశేష కృషికి పురస్కారాలు..

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతల్లో.. చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టి జలసంరక్షణతో 18 లక్షల మంది గ్రామీణ ప్రజల జీవితాలను మార్చిన అమ్లా అశోక్ రుయాకు గ్రామీణాభివృద్ధి విభాగంలో అవార్డు దక్కింది. వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న శ్రీకాంత్ బొల్లాకు యూత్ ఐకాన్‌గా, ప్రపంచంలోనే ఎత్తైన కశ్మీర్‌లోని చినాబ్ వంతెనను డిజైన్ చేసిన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ మాధవీలతకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పురస్కారాలు అందజేశారు. కాగా, మురికివాడల్లో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి.. వారి జీవితాల్లో మార్పు తెచ్చిన ఆకాశ్ టాండన్‌కు మానవతా సేవల విభాగంలో, కళలు-సంస్కృతి విభాగంలో సత్తుపతి ప్రసన్నకు, జర్నలిజంలో కృషికిగాను జైదీప్ హర్దేకర్‌కు, మహిళా సాధికారత కోసం పాటుపడిన పల్లబీ ఘోష్‌కు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో మాట్లాడుతున్న బండి సంజయ్

**జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత..**

## హిందువుల్లో కసి పెరిగింది

» మనమంతా ఓటు బ్యాంకుగా మారాలి: బండి సంజయ్

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం తర్వాత హిందువుల్లో కసి పెరిగిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ ఫలితం హిందువులకు గుణపాఠం అయిందని తెలిపారు. హిందువులంతా ఓటు బ్యాంకుగా మారాల్సిందేనని కోరారు. ఏపీ, తెలంగాణలో ఇతర మతాల్లో చేరిన హిందువులంతా ఘర్ వాపసీ రావాలని పిలుపునిచ్చారు. వారి కోసం హిందూ ధర్మ రక్షణ ద్వారాలు తెరిచే ఉన్నాయని స్పష్టం చేశారు. మతాలను మార్చుకుంటే దేవుళ్లను మోసం చేసినట్టేనని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడారు. అన్ని కులాలు తమ సామాజిక వర్గ సంక్షేమానికి పాటు పడుతూనే హిందూ ధర్మం కోసం పని చేయాలని సూచించారు. రాజకీయాలు, పదవులు, ప్రజల కోసం కుల సంఘాలు వేర్వేరుగా ఉన్నా.. దేశం కోసం, ధర్మం కోసం ఒక్కటి కావాలని కోరారు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మ ప్రచారం వల్ల ఇతర మతాల్లో చేరిన హిందువుల్లో పునరాలోచన వస్తోందని సంజయ్ తెలిపారు.

## దళితుడు కాబట్టే సీజేఐ గవాయ్‌పై దాడి

» సంఘీభావ సభను అడ్డుకోవడం దారుణం: మందకృష్ణ

న్యూఢిల్లీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ గవాయ్ దళితుడు కాబట్టే ఆయనపై లాయర్ దాడి చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. ఈ వ్యవహారంలో పోలీసులు, మానవ హక్కుల కమిషన్ ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. సుమోటోగా కేసు నమోదు చేసే అధికారం ఉన్నప్పటికీ 50 రోజులైనా ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవట్లేదని ఆరోపించారు. కేంద్రం కూడా ఈ అంశంలో వివక్ష చూపుతోందన్నారు. గవాయ్‌కు సంఘీభావంగా జంతర్‌మంతర్ వద్ద నిర్వహించతలపెట్టిన సభను అడ్డుకోవడం దారుణమన్నారు. ఆదివారం ఢిల్లీలో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. సోమవారం సభ నిర్వహించాల్సి ఉండగా.. పోలీసులు అనూహ్యంగా అనుమతిని రద్దు చేసినట్లు చెప్పారు. సీజేఐపై దాడిని దళితుల ఆత్మగౌరవంపై దాడిగానే తాము భావిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు

## కారణజన్ముడి కడుపున పుట్టిన రాక్షసి

» వ్యాపారాలను కాపాడుకునేందుకే రేవంత్‌తో కవిత కుమ్మక్కు
» ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వ్యాఖ్యలు
» నిజామాబాద్‌లో చెల్లని రూపాయి.. ఇక్కడ చెల్లుద్దా: ఎమ్మెల్యే మాణిక్‌రావు
» కాంగ్రెస్ ట్రాప్‌లో కవిత: వివేకానంద

సంగారెడ్డి రూరల్, హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారణజన్ముడి కడుపున కవిత లాంటి రాక్షసి పుట్టడం దురదృష్టకరమని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. తన వ్యాపారాలను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చేతులు కలిపి బీఆర్ఎస్‌పైనా, తన తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్‌లపైనా కవిత విమర్శలు చేయడం తగదన్నారు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లినప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఆమెకు అండగా నిలిచారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి కోసం బీఆర్ఎస్‌ను నిందించడం మానుకుని ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నించాలని ఆయన హితవు పలికారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతిలతో కలిసి చింతా ప్రభాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనం బాట పేరుతో కవిత చేపట్టిన యాత్రలో ప్రజాసమస్యలపై మాట్లాడకుండా మాజీ మంత్రి హరీశ్‌రావుని, బీఆర్ఎస్‌ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గత ఎన్నికల్లో హరీశ్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లాలో పది స్థానాలకు ఏడు సీట్లు గెలిపించారని గుర్తు చేశారు. హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలకు ఆమె బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా అని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రశ్నించారు. కేసీఆర్ కుమార్తెగానే కవితకు గుర్తింపు వచ్చిందనే విషయాన్ని మరవొద్దని మాజీ ఎమ్మెల్యే క్రాంతి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రయోజనం కలిగించేలా.. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలున్నాయని, ఆమె కాంగ్రెస్ పార్టీ ట్రాప్‌లో పడ్డారని బీఆర్ఎస్ విప్ కె.పి.వివేకానంద ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముందు ఒకలా.. తర్వాత మరోలా ఆమె మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలపై కవిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ సర్కారులో పదేళ్లు ఎంపీ, ఎమ్మెల్సీ వంటి పదవుల్లో ఉన్నప్పుడు లేని సమస్యలు ఆమెకు ఇప్పుడెందుకు వస్తున్నాయని వివేకానంద నిలదీశారు.

**గత 12 ఏళ్లలో సీఎంలు**

# ప్రభుత్వ బడుల కోసం ఏం చేయలేదు

నిజమైన భావోద్వేగం ఉండుంటే విద్యా రంగ సమస్యలు పరిష్కారం అయ్యేవి

» కేసీఆర్, రేవంత్‌నుద్దేశించి కవిత వ్యాఖ్య
» ప్రజలు చెప్పిన వాటిపైనే ఆరోపణలు చేశా
» హరీశ్, గంగుల సమాధానం ఇవ్వాలి
» బీఆర్ఎస్ వాళ్ల కామెంట్లకు జాగృతి కౌంటర్ ఉంటుంది: కవిత

హైదరాబాద్/ మధిర రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత 12 ఏళ్లలో తెలంగాణ సీఎంలు ప్రభుత్వ బడుల కోసం ఏమీ చేయలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ సీఎంలుగా చేసిన ఇద్దరూ ప్రభుత్వ బడుల్లో చదువుకొని వచ్చామని మాత్రం చెబుతారని పేర్కొన్నారు. వారికి నిజమైన భావోద్వేగం ఉండుంటే రాష్ట్ర విద్యావ్యవస్థలోని సమస్యలు ఎప్పుడో పరిష్కారం అయ్యేవని చెప్పారు. ఇక తాను చేసిన ఆరోపణలపై మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణ రాష్ట్రం - విద్యావ్యవస్థ' అంశంపై తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో, తర్వాత మీడియా ప్రతినిధులతో కవిత మాట్లాడారు.



శాతవాహన రైల్లో ఓ చిన్నారితో మాట్లాడుతున్న కవిత

### రైలు జనరల్ బోగీలో ప్రయాణం

సోమ, మంగళవారాల్లో ఖమ్మం జిల్లా మధిర, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో నిర్వహించనున్న 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో పాల్గొనేందుకు కవిత ఆదివారం మధిర చేరుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్ డి6 కోచ్‌లో ఆమె ప్రయాణించారు. రైలులోనే పలువురు ప్రయాణికులతో మాట్లాడారు.

### హరీశ్‌రావు, గంగుల వివరణ ఇవ్వాలి..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ ఓటమి అనంతరం 'కర్మ హిట్స్ బ్యాక్ (కర్మ మనకు తిరిగి తగులుతుంది)' అంటూ 'ఎక్స్' వేదికగా కవిత పెట్టిన పోస్టు చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఎవరిని ఉద్దేశించి ఆ ట్వీట్ చేశారని మీడియా ఆమెను ప్రశ్నించగా.. 'జై తెలంగాణ' అని మాత్రమే కవిత సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ నేతలపై ఆమె తరచూ చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించగా.. "జాగృతి జనంబాట కార్యక్రమంలో ప్రజలు చెప్పిన అంశాల ఆధారంగానే నేను ఆరోపణలు చేశాను. నేనేమీ ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదు. నా ఆరోపణలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ వివరణ ఇచ్చినందుకు సంతోషం. అదే సమయంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ కూడా నా ఆరోపణలపై వివరణ ఇవ్వాలి. బాధ్యత కలిగినవారు వివరణ ఇచ్చుకోవాలే తప్ప ఎదురుదాడి చేయటం మంచిదికాదు" అని కవిత పేర్కొన్నారు. తనపై బీఆర్ఎస్ వాళ్లు చేసే కామెంట్లకు జాగృతి కార్యకర్తల నుంచి కౌంటర్ ఉంటుందని హెచ్చరించారు.

### విద్యాశాఖలో మార్పుల కోసం ఒత్తిడి చేస్తాం

విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న సీఎం రేవంత్.. ప్రభుత్వ పాఠశాలల బాగు కోసం ఏం చేశారని కవిత ప్రశ్నించారు. విద్యా కమిషన్ ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమే అయినా.. ఆ కమిషన్ ప్రాధాన్యతలు, పనితీరుపై దృష్టిపెట్టాలని సూచించారు. ప్రస్తుత విద్యావ్యవస్థలో మార్పులకోసం ప్రయత్నిస్తామని కవిత పేర్కొన్నారు.

# 42% బీసీ రిజర్వేషన్ కాదంటే రాష్ట్రం అగ్నిగుండమే

**రన్ ఫర్ సోషల్ జస్టిస్, బీసీల న్యాయ సాధన దీక్షల్లో నేతల హెచ్చరిక.. కేంద్రానికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి: జాజుల**

» రాజ్యాంగ సవరణతోనే పరిష్కారం: ఆర్. కృష్ణయ్య



'రన్ ఫర్ సోషల్ జస్టిస్' ప్రదర్శనలో జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ వీహెచ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్ పెంచిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో రాష్ట్రం అగ్నిగుండమవుతుందని బీసీ జేఏసీ హెచ్చరించింది. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి లోయర్ ట్యాంకుబండ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకూ ఆదివారం ఉదయం 'రన్ ఫర్ సోషల్ జస్టిస్' పేరుతో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ర్యాలీనుద్దేశించి జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. రెండేళ్లుగా బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ సర్కారు కృషి చేస్తున్న మాట వాస్తవమైనా.. దానికి చట్టరూపం కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణ ప్రకటించాలన్నారు. తక్షణం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి, ప్రధాని మోదీతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద చేపట్టిన బీసీల న్యాయ సాధన దీక్షలో జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగ సవరణతోనే బీసీల రిజర్వేషన్లకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బీసీ సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు కార్యాచరణ రూపొందించాలన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి బీసీ రిజర్వేషన్ల సాధనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనకు డిసెంబరు 10న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొగికార్ సుధాకర్ చెప్పారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ- టీఆర్ఎల్డీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ ఆవిష్కరించారు.

## జనవరి 29న ఢిల్లీలో మహాధర్నా

**» ఎన్ఈపీ రద్దు, ఇతర డిమాండ్ల సాధనే లక్ష్యం: ఎస్టీఎఫ్ఐ**

హైదరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) రద్దు, పాతపెన్షన్ పునరుద్ధరణ, టెట్ నుంచి ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) జాతీయస్థాయి ఆందోళన కార్యాచరణను ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 29న ఢిల్లీలో పార్లమెంటు మార్చ్, మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీఎన్ భార్తి, చావ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీఎఫ్ఐ కార్యదర్శి వర్గం, కేంద్ర కార్యవర్గ సమావేశాలు నవంబరు 15 16 తేదీల్లో ఢిల్లీలో భార్తి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అశాస్త్రీయ అంశాలతో కూడిన జాతీయ విద్యావిధానం-2020ని రద్దు చేయాలని, విద్యా రంగ బాధ్యత ప్రభుత్వమే చూడాలని, కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్సీటీఈ నోటిఫికేషన్ ముందు నియామకమైన ఉపాధ్యాయులు కూడా టెట్ అర్హత సాధించాలన్న సుప్రీంకోర్టు తీర్పు అప్రజాస్వామికం, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉందని అన్నారు. దీనిపై కోర్టులో ఎస్టీఎఫ్ఐ ఇప్పటికే రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందని, కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 8, 9 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో, జనవరి 5న రాష్ట్ర కేంద్రాల్లో ధర్నాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. డిసెంబరు 10న 'మానవ హక్కులన్నీ మహిళా హక్కులే' అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డేని నిర్వహించాలని కోరుతూ తీర్మానించారు.

## మతతత్వ ఆర్ఎస్ఎస్‌తో రాజ్యాంగానికి హాని

**» రిజిస్ట్రేషన్, నిబద్ధత, బాధ్యత లేని సంస్థ అది: డీ రాజా**

అమరావతి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగానికి ఆర్ఎస్ఎస్‌తో హాని ఉంది. ఆ సంస్థది మతతత్వ విధానం. ఆర్ఎస్ఎస్ మన రాజ్యాంగాన్ని, త్రివర్ణ పతాకాన్ని అంగీకరించలేదు' అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యూజే నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. 'మా పార్టీకి రిజిస్ట్రేషన్ ఉంది. మాకు బాధ్యత, నిబద్ధత ఉన్నాయి. అదే ఆర్ఎస్ఎస్‌కు రిజిస్ట్రేషన్ లేదు. దాంతోపాటే నిబద్ధత, బాధ్యత కూడా లేదు. బ్రిటీష్, ఫ్రెంచ్ లాంటి సామ్రాజ్యవాదులపై మా పార్టీ పోరాడింది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదు. కేంద్ర ఎన్నికల కమిషన్ విశ్వాసం కోల్పోయింది. స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దేశంలో జరిగే ఎన్నికల్లో నిరంకుశత్వం ఉంది. సీఈసీ నియామకం ప్రధాని కనుసన్నల్లో జరగడమే దీనికి కారణం. దేశంలో సమగ్ర ఎన్నికల విధానం అమలు కావాలని మా పార్టీ డిమాండ్ చేస్తోంది. కార్పొరేట్ల నుంచి డబ్బులు తీసుకున్న ఏకైక పార్టీ' అని అన్నారు.

## ఎంపీడీవోలకు వాహన సదుపాయం కల్పించాలి

**» సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు 15 రోజుల విరామం ఇవ్వాలి: టీఎంపీడీవోస్**

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తున్న ఎంపీడీవోలకు వాహన సదుపాయం లేకపోవడం ఇబ్బందికరమని, తక్షణమే ఎంపీడీవోలకు వాహన సదుపాయం కల్పించాలని తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం(టీఎంపీడీవోస్) ప్రతిపాదించింది. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న వాహన బిల్లులను విడుదల చేయాలని, అర్హులైన ఎంపీడీవోలకు డీపీసీ ద్వారా జెడ్పీ పరిధిలో డిప్యూటీ సీఈవోలుగా పదోన్నతి కల్పించాలని తీర్మానించింది. టీఎంపీడీవోస్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షతన.. రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం టీజీవో భవన్‌లో నిర్వహించారు. ఇందులో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్, జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల మధ్య 15 రోజుల విరామం ఇవ్వాలని తీర్మానించారు. మండల పరిషత్ కార్యాలయాల నిర్వహణకు నిధులు, తలసరి గ్రాంట్, సీనరేజ్ చార్జీలు, స్టాంప్‌డ్యూటీ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు.

## విద్యుత్ కార్యాలయంలో మందు పార్టీ

**» ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్**

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు ఏకంగా తమ కార్యాలయంలోనే మందు పార్టీ చేసుకున్నారు. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు స్పందించి ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో శనివారం రాత్రి అసిస్టెంట్ లైన్‌మెన్లు ప్రభాకర్, బాలకృష్ణ, రాజశేఖర్ మందు పార్టీ చేసుకున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలడంతో వారిని సస్పెండ్ చేసినట్లు జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ గంగారాం తెలిపారు.



భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**» ముగ్గురు మావోయిస్టుల మృతి**

చర్ల/చింతూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని తుమల్‌పాడ్ అడవుల్లో ఆదివారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా, వారిలో ఇద్దరు మహిళలున్నారు. ఘటనా స్థలం నుంచి 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, పేలుడు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. తుమల్‌పాడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం మేరకు జిల్లా రిజర్వ్‌గార్డ్ (డీఆర్‌జీ) కూంబింగ్ చేపట్టింది. ఈ క్రమంలో బలగాలు జరిపిన కాల్పుల్లో జన మిలీషియా సభ్యుడు మడవి దేవా, కుంట ఏరియా కమిటీ సభ్యురాలు పోడియం గంగి, కిష్టారం ఏరియా కమిటీ సభ్యురాలు సోడి గంగి మృతి చెందారు. ఈ ముగ్గురిపై రూ.5లక్షల చొప్పున రూ.15 లక్షల రివార్డు ఉన్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఇటీవల కుంట ఏఎస్పీ ఆకాశ్‌రావ్ గిరిపుంజను హత్య చేసిన ఘటనలో ప్రధాన పాత్ర మడవి దేవాదేనని పోలీసులు చెబుతున్నారు.

## బీడీఎస్ స్ట్రే కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్లు షురూ..

**» నేటి ఉదయం 10 గంటల వరకే ఆప్షన్లకు అవకాశం**

**» నోటిఫికేషన్ జారీచేసిన కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం**

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని దంత వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద మిగిలిపోయిన బీడీఎస్ సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్ట్రే వేకెన్సీ ఫేజ్ నోటిఫికేషన్ (చివరి దశ) విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులు ఆదివారం (16వ తేదీ) ఉదయం 10 గంటల నుంచి 17వ తేదీ ఉదయం పదిగంటల వరకు టఖీటచీర్ఖు.టఖిజి.జీ వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే అడ్మిషన్లు పొందినవారు ఈ కౌన్సెలింగ్‌కు అనర్హులని పేర్కొంది. ఈ విడతలో సీటు పొందాక కోర్సులో చేరకపోయినా, కోర్సు మధ్యలో మానేసినా రూ.20 లక్షల జరిమానా విధించటంతోపాటు మూడేళ్ల పాటు బీడీఎస్‌లో ప్రవేశాల నుంచి డిబార్ చేస్తామని హెచ్చరించింది. సీటు పొందిన వారు వర్సిటీ ఫీజుగా రూ.12 వేలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

# ఎస్సీలకూ క్రీమీలేయర్ ఉండాల్సిందే!

## ఆ తీర్పు ఇచ్చినప్పుడు విమర్శించారు.. అయినా తీర్పునకు కట్టుబడి ఉన్నా

**» ఎస్సీల్లో ఉపవర్గీకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాం**

**» సీజేఐ బీఆర్ గవాయ్**

అమరావతి/గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల్లోని కొందరికి ఇప్పటికీ రిజర్వేషన్ ప్రయోజనాలు దక్కని పరిస్థితులు ఉన్నాయని, అలాంటివారికి ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా ఉపవర్గీకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగిస్తూ తీర్పు ఇచ్చామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ గుర్తుచేశారు. అందులో ఎస్సీలకూ క్రీమిలేయర్ వర్తింపజేయాలని చెప్పిన తనను తీవ్రంగా విమర్శించారని.. అయినప్పటికీ ఆ తీర్పును ఇప్పటికీ సమర్థించుకుంటున్నానని స్పష్టం చేశారు. హైదరాబాద్, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లో విద్యను అభ్యసించే ఐఏఎస్ కుమారుడు, గ్రామంలో ఉండే పేద వ్యవసాయ కూలీ బిడ్డ ఇద్దరూ ఎస్సీ కులాలకు చెందినవారే అయినప్పటికీ.. ఇద్దరినీ సమానంగా చూడలేమన్నారు. అలా చూడడం సమాన అవకాశాలు నిరాకరించడమేనని సీజేఐ తేల్చి చెప్పారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆదివారం ఏపీలోని మంగళగిరిలో సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సీజేఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ 'ఇండియా అండ్ ద లివింగ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ దేశంలోని చివరి పౌరుడి వరకు న్యాయం అందాలని.. ఇది న్యాయవ్యవస్థ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రాథమిక హక్కుల పరిరక్షణలో కోర్టుల పాత్ర కీలకమని.. హక్కుల ఉల్లంఘన జరిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని చేపట్టానంటే.. అందుకు భారత రాజ్యాంగమే కారణమని చెప్పారు.

### రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే..

'రాజ్యాంగం కల్పించిన హక్కుల కారణంగానే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కేఆర్ నారాయణన్, రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా చేశారు. మొదటిసారి మహిళా రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఉన్నారు. ఆమె కేవలం మహిళ మాత్రమే కాదు. గిరిజన సమాజానికి కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజ్యాంగం వల్లే ఒక చాయ్‌వాలా దేశానికి ప్రధాన మంత్రి కాగలిగాడు. మీ సొంత రాష్ట్రం నుంచి ఎస్సీ వర్గానికి చెందిన బాలయోగి లోక్‌సభ స్పీకర్ అయ్యారు. అలానే మహిళా స్పీకర్‌గా మీరాకుమారి బాధ్యతలు నిర్వహించారు. రాజ్యాంగం వల్లే ఎస్సీ వర్గాలకు చెందిన వివిధ రాష్ట్రాల్లో సీఎస్‌లు, డీజీపీలు అయ్యారు' అని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నాలుగు స్తంభాలు మన రాజ్యాంగానికి మూలాధారాలని తెలిపారు. 75 ఏళ్లుగా శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు.. సామాజిక, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు పనిచేస్తున్నాయన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయం సాధించడంలో గత ఐదేళ్లలో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. 'రాజ్యాంగం స్థిరమైన పత్రంగా ఉండకూడదని, వికాసం చెందుతూ సజీవపత్రంగా ఉండాలని అంబేడ్కర్ భావించారు. సామాజిక, ఆర్థిక సవాళ్లకు సమాధానం ఇవ్వడాన్ని అవసరమైనపుడు రాజ్యాంగాన్ని సవరించేందుకు వీలు కల్పించారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే.. అప్పటి మద్రాసు రాష్ట్రం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది 14వ అధికరణకు విరుద్ధమని కొందరు హైకోర్టును ఆశ్రయించగా వారి వాదనతో కోర్టు ఏకీభవించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించగా.. హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఆయా వర్గాలకు రిజర్వేషన్ కల్పించేందుకు 1951లో మొదటిసారి రాజ్యాంగానికి పార్లమెంటు సవరణ చేసింది. సుప్రీంకోర్టు సైతం రాజ్యాంగ సవరణ చేసే అధికారం పార్లమెంటుకే ఉందని చెప్పింది. సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో పార్లమెంటు రాజ్యాంగ సవరణలు చేస్తూనే వస్తోంది' అని జస్టిస్ బీఆర్ గవాయ్ వివరించారు. 'అమరావతిలోని ఒక చిన్న మురికివాడలోని మున్సిపల్ పాఠశాల నుంచి వచ్చిన నేను న్యాయవ్యవస్థలో అత్యున్నత పదవిని చేరుకోగలిగాను. భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత నేను హాజరైన మొదటి కార్యక్రమం నా స్వస్థలమైన మహారాష్ట్రలోని అమరావతి. ఆ కార్యక్రమానికి.. సీజేఐగా విధులు నిర్వహించి రిటైరైన జస్టిస్ ఎన్వీ రమణ వచ్చి ఆశీస్సులు అందజేశారు. మరో రెండ్రోజుల్లో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదవీ విరమణ చేయబోతున్నాను. ఇది నేను హాజరవుతున్న చివరి కార్యక్రమం. అదీ ఇక్కడి అమరావతిలో జరగడం యాదృచ్ఛికం. ఇలా నా ప్రయాణం అమరావతిలో ప్రారంభమై, అమరావతిలోనే ముగుస్తోంది. రెండు అమరావతులకు గొప్ప చారిత్రక ప్రాముఖ్యం ఉంది' అని జస్టిస్ గవాయ్ తెలిపారు.



మంగళగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో సీజేఐ గవాయ్, ఏపీ సీఎం చంద్రబాబు

### ప్రాథమిక హక్కులకు భంగం ఏర్పడితే..

'రాజ్యాంగ సభ ఏర్పడిన తర్వాత రాజ్యాంగ లక్ష్యాలకు సంబంధించి 1946 డిసెంబరు 9న జవహర్‌లాల్ నెహ్రూ తీర్మానం ప్రవేశపెట్టగా.. అందులో లోపాలు ఉన్నాయని అంబేడ్కర్ ఎత్తిచూపారు. పౌరుల హక్కుల గురించి మాత్రమే ప్రస్తావించి, పరిష్కారాలు చూపనప్పుడు హక్కుల కల్పనకు అర్థం ఉండదన్నారు. ఈ నేపథ్యంలోనే పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు సుప్రీంకోర్టు తలుపు తట్టేందుకు వీలుగా రాజ్యాంగంలో 32వ అధికరణను చేర్చారు' అని చెప్పారు.

### జస్టిస్ గవాయ్ గొప్ప మానవతావాది: చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. జస్టిస్ బీఆర్ గవాయ్‌ని గొప్ప మానవతావాదిగా అభివర్ణించారు. సమానవత్వాన్ని మాటల్లోగాక చేతల్లో చూపించే మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. న్యాయమూర్తిగా ఆయన ఇచ్చిన తీర్పులు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. సోషల్ మీడియా వచ్చాక ప్రతీ ఒక్కరూ సంపాదకులు అయిపోతున్నారని.. వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. దేశం ప్రప్రథమమన్న కోణంలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. పేద, ధనిక తారతమ్యాలు తగ్గించేందుకు అందరూ ఆలోచన చేయాలని, అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తే వీటిని రూపమాపవచ్చని చంద్రబాబు చెప్పారు. అందుకే హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రూపకల్పనకు ప్రణాళిక రచిస్తున్నామని.. దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు గజమాలతో సీజేఐ గవాయ్‌ని సత్కరించారు. ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న జస్టిస్ బీఆర్ గవాయ్, ఆ మర్నాడు ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండడం యాదృచ్ఛికం. జస్టిస్ సూర్యకాంత్ తిరుమలేశుడిని దర్శించుకోవడానికి రాష్ట్రానికి వచ్చారు.

## ఏపీ లిక్కర్ స్కామ్‌లో కటక్ కిలేడీ!

**మద్యం ముడుపుల సొమ్ము దొంగల పాలు**

**సిట్ దర్యాప్తులో తాజాగా వెలుగులోకి..**

**త్వరలో 5 కోట్ల విలువైన ఆస్తుల జప్తు**

అమరావతి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడిని తన్నేవాడు ఉంటే.. వాడి తలను తన్నేవాడు ఉంటాడు.. అన్నది పాత సామెత. జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వ్యవహారంలో కేసులో అచ్చం ఇలాగే జరిగింది. గత ప్రభుత్వంలో చౌక మద్యాన్ని జనం నోట్లో పోసి దోచుకున్న సొమ్ములో కొంత దొంగలపాలైంది. దోపిడీదారుల్నే దోపిడీ చేసిన కిలేడీ వ్యవహారం తాజాగా బట్టబయలైంది. జగన్ పాలనలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేసేందుకు ఏర్పాటు చేసుకున్న గ్యాంగ్‌లో సైమన్ ప్రసన్ కీలక వ్యక్తి. విశాఖపట్నానికి చెందిన అతని బామ్మర్ది మోహన్‌ను వసూళ్లలో సహాయకుడిగా హైదరాబాద్‌కు రప్పించుకున్నాడు. ఫిల్మ్‌నగర్‌లోని ఓ ఇంట్లో ఉంచాడు. వసూలు చేసిన ముడుపుల సొమ్మును ప్రత్యేక సైజులో ఉండే అట్టపెట్టెల్లో రూ.100, రూ.200, రూ.500 నోట్ల కట్టలను వేర్వేరుగా దాచేవారు. ఒక్కో బాక్సులో 100 నోట్లు అయితే రూ.24 లక్షలు.. 200 అయితే రూ.48 లక్షలు.. 500 అయితే రూ.1.20 కోట్లు చొప్పున సరిగ్గా సరిపోయేలా పేర్చేవారు. ఈ వ్యవహారం జరుగుతున్న క్రమంలో మోహన్ బామ్మర్ది అనిల్ కాలు విరిగింది. దీంతో అనిల్ ప్రియురాలు ఒడిశాలోని కటక్‌లో బ్యూటీ పార్లర్ నిర్వహించే రషిత బ్యూరో హైదరాబాద్ వచ్చింది. బెడ్‌రూమ్‌లో ఆ బాక్సులేంటి? అని ఆమె ప్రశ్నించగా.. సమాధానం దాటవేశారు. ఆమెకు అనుమానం వచ్చి బాక్సు తీసి చూడగా.. నోట్ల కట్టలు ఉండడంతో ఆశ్చర్యపోయింది. కటక్‌లో ఉంటున్న తన మరో ప్రియుడు ఇర్షాద్ అహ్మద్‌కు ఫోన్ చేసి మొత్తం విషయం చెప్పింది. దీంతో కటక్ నుంచి మరో ఇద్దర్ని తీసుకుని 2023 జనవరి 10న ఇర్షాద్ హైదరాబాద్‌కు వచ్చాడు. ఇర్షాద్ హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే కటక్ నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి ఫిల్మ్‌నగర్‌లో తన పాత మిత్రుడు ముబారక్ అలీని సంప్రదించాడు. తనకు ముగ్గురు చురుకైన యువకులు, మూడు ద్విచక్ర వాహనాలు కావాలని చెప్పాడు. మూడు బైకుల్లో హైదరాబాద్‌కు చెందిన ముగ్గురితో పాటు కటక్ నుంచి తన వెంట వచ్చిన ఇద్దరిని తీసుకుని మొత్తం ఆరుగురు మోహన్ ఇంటి లోపలికి వెళ్లి ఆరు బాక్సులు తీసుకునివెళ్లి ఫిల్మ్‌నగర్‌లోని ముబారక్ అలీ ఇంట్లో మంచం కింద దాచారు. దోపిడీ వ్యవహారం బయటకు రాకుండా సైమన్ గ్యాంగ్ మేనేజ్ చేసింది. ఇటీవల సిట్ ముందు విచారణకు వచ్చిన సైమన్ ఒడిశా కిలేడీ దోచుకున్న వైనాన్ని వివరించాడు. కటక్ వెళ్లిన సిట్ అధికారులు అక్కడ ఇర్షాద్ అహ్మద్, రషిత నివాస స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నట్టు గుర్తించారు. ఈ మేరకు మొత్తం రూ.5.10 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసేందుకు సిట్ అధికారులు రంగం సిద్ధం చేశారు.

## తహసీల్దార్‌కు సెలవిచ్చే అధికారం మీకెక్కడిది?

**» అదనపు కలెక్టర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చిన కలెక్టర్**

**» తహసీల్దార్‌పైనా సస్పెన్షన్ వేటు**

**» ఆందోళనల నేపథ్యంలో తిరిగి వెనక్కి**

**» అధికారాలన్నీ కలెక్టర్లకే ఉన్నాయని అదనపు కలెక్టర్ల ఆవేదన**

హైదరాబాద్, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): ఓ జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్ సెలవు కావాలని అడగ్గా.. అత్యవసరమైతే తీసుకోవాలని అదనపు కలెక్టర్ చెప్పారు. విషయం తెలుసుకున్న ఆ జిల్లా కలెక్టర్.. ఏ అధికారంతో సెలవు ఇచ్చారంటూ మందలించడమే కాకుండా, వివరణ ఇవ్వాలని నోటీసు ఇవ్వడంతో సదరు అదనపు కలెక్టర్ బిత్తరపోయారు. అదే సమయంలో సెలవు తీసుకున్న తహసీల్దార్‌పైనా సస్పెన్షన్ వేటు వేశారు. దీనిపై రెవెన్యూ శాఖ వర్గాల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తం కావడంతో తిరిగి సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. "ఒక సెలవు ఇవ్వలేం.. పనిచేయకపోతే బదిలీ చేయలేం.. తప్పు చేస్తే షోకాజ్ నోటీసు ఇచ్చే అధికారం లేదు.. ఇవేమీ లేకుండా వంద రకాల పనులు అప్పగించి.. కింది స్థాయి వారితో చేయించాలంటే ఎవరూ మాట వినడం లేదు.. కనీసం అడిగిన సమాచారం కూడా సకాలంలో పంపడం లేదు" అని అదనపు కలెక్టర్లు వాపోతున్నారు. తహసీల్దార్ల పోస్టింగ్, బదిలీలు, సెలవుల మంజూరు వంటి అధికారాలన్నీ కలెక్టర్ల చేతిలోనే ఉన్నాయి. అదనపు కలెక్టర్లకు సంబంధిత సమాచారాన్ని సర్క్యులేట్ చేయడమే తప్ప.. ఎలాంటి అధికారాలు ఉండవు. రాష్ట్రంలో జాయింట్ కలెక్టర్ల వ్యవస్థను రద్దు చేసి, అదనపు కలెక్టర్ల వ్యవస్థను ఆచరణలోకి తెచ్చినా.. అధికారాల విషయంలో ఎలాంటి ఆథరైజేషన్ ఇవ్వలేదు. తమకు అధికారాలు కల్పించకపోతే కింది స్థాయి అధికారులు తమను ఎలా ఖాతరు చేస్తారు? అని అదనపు కలెక్టర్లు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. భూ సమస్యలకు సంబంధించి తహసీల్దార్ స్థాయిలోనే 54,456 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్డీవోల స్థాయిలో 18,239, అదనపు కలెక్టర్ల స్థాయిలో 11,323, కలెక్టర్ల స్థాయిలో 11637 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు సమీక్షించి.. పరిష్కరించాల్సిన బాధ్యతలు అదనపు కలెక్టర్లపై పెట్టిన ప్రభుత్వం.. వారికి అధికారాలు కల్పించకపోవడంతో నామమాత్రపు సమీక్షలతో సరిపెడుతున్నారనే విమర్శలున్నాయి. దీంతో పెండింగ్ దరఖాస్తులకు నెలల తరబడి మోక్షం లభించక ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. భూభారతికి సంబంధించిన పెండింగ్ సమస్యలపై ప్రతి వారం నిర్వహించే సమీక్షల్లో అదనపు కలెక్టర్లను రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ తరచూ మందలిస్తూనే ఉన్నారు. అయితే, తమ పరిధిలో లేని విషయాలకు తమను బాధ్యులను చేస్తూ.. కలెక్టర్లను వదిలేస్తున్నారని.. అదనపు కలెక్టర్లు ఆవేదన చెందుతున్నారు.

# తెలుగంటే తక్కువ.. ఆంగ్లంపై మక్కువ

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతోంది. శిక్షణ ఇస్తున్న నిపుణులు తెలుగులో మాట్లాడితే.. అలా వద్దని, ఇంగ్లిషులోనే కొనసాగించాలని అభ్యర్థులు కోరుతున్నారు. తరగతుల్లో ప్రశ్నలు తెలుగులో అడిగినా సమాధానం ఇంగ్లిషులో ఇస్తున్నారని శిక్షకులు చెబుతున్నారు. చాలా మంది ఇంగ్లిషు మీడియం వారే కావడంతో.. కనీసం తెలుగులో మాట్లాడేందుకూ ఇష్టపడటం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో వారు అధికారులుగా బాధ్యతలు చేపట్టాక.. పాలన వ్యవహారాల్లో తెలుగుకు ఎలా న్యాయం చేస్తారు? ప్రజల నుంచి తెలుగులో దరఖాస్తు వస్తే వారు కనీసం చదివి సరిగా అర్థం చేసుకుంటారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### తెలుగుకు ఎందుకీ దుస్థితి?

గతంలో ప్రిలిమ్స్, మెయిన్స్ తర్వాత ఇంటర్వ్యూ నిర్వహించి గ్రూప్-1 పోస్టుల భర్తీ చేపట్టేవారు. ఇంటర్వ్యూలో అభ్యర్థిని తెలుగులో ప్రశ్నలు అడిగి, వారి భాష నైపుణ్యాలను కూడా గుర్తించేవారు. కానీ ఈసారి ఇంటర్వ్యూ రద్దు చేశారు. మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. ఆంగ్ల మాధ్యమం వారు 12,381 మంది, తెలుగు మాధ్యమం వారు 8,694 మెయిన్స్ రాయగా.. ఆంగ్ల మాధ్యమం వారికి 506 ఉద్యోగాలు (90శాతం), తెలుగు మాధ్యమం వారికి 56 ఉద్యోగాలు (10శాతం) వచ్చాయి. ఈ క్రమంలో గ్రూప్-1 ఎంపికలో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందనే ఆందోళన వ్యక్తమైంది. అలాంటిది ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఇస్తున్న శిక్షణలోనూ తెలుగు దూరమవుతోంది.

### తెలుగు ప్రావీణ్యం తప్పనిసరి చేయాలి..

గ్రూప్-1 శిక్షణ పొందుతున్న మొత్తం 563 మంది అధికారుల్లో.. ఎంత మందికి మాతృభాషలో ప్రావీణ్యం ఉందన్న విషయంపై ఉన్నతాధికారులకే స్పష్టత లేదు. ఆ విషయాన్ని గుర్తించే ప్రయత్నమూ జరగలేదు. నిజానికి గ్రూప్-1 అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. వారికి తెలుగు రావడం చాలా అవసరం. కానీ తెలుగు మాధ్యమంలో చదవని, తెలుగులో మాట్లాడటానికి ఇష్టపడని అధికారులు.. ప్రజలకు ఎలా న్యాయం చేస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశంలో నిపుణులు ఓ కొత్త ప్రతిపాదన తెరపైకి తెస్తున్నారు. ఏదైనా రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి సివిల్ సర్వీస్ అధికారులు.. ఆ రాష్ట్ర స్థానిక భాష నేర్చుకోవడం తప్పనిసరి. అంటే తెలంగాణ, ఏపీలకు వచ్చే ఇతర రాష్ట్రాలు, భాషల అధికారులు.. రెండేళ్లలో తెలుగు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం నేర్చుకోవాల్సిందే. దీనిపై వారికి పరీక్ష కూడా నిర్వహిస్తారు. అందులో విఫలమైతే పదోన్నతులు నిలిపేస్తారు. దీనితో ఆయా అధికారులు తెలుగు నేర్చుకుంటారు. రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు జయేశ్ రంజన్ (ఉత్తరప్రదేశ్), యోగితారాణా (జమ్మూకశ్మీర్), నవీన్ మిట్టల్ (పంజాబ్) ఇతర భాషలకు చెందినవారైనా.. తెలుగుపై పట్టు సాధించారు. పాలనలో తెలుగు వినియోగం పెంచేందుకు జయేశ్ రంజన్ తెలుగు సాఫ్ట్‌వేర్, తెలుగు వికీపీడియా వంటి నిర్ణయాలు అమలుచేశారు. ఇలా ఇతర రాష్ట్రాల సివిల్ సర్వెంట్లు తెలుగుపై మక్కువ చూపిస్తుంటే.. తెలుగు రాష్ట్రంలో పుట్టి, పెరిగిన గ్రూప్-1 అధికారులు తెలుగుపై అనాసక్తి చూపిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సివిల్ సర్వెంట్ల తరహాలో గ్రూప్-1 శిక్షణలో ఉన్నవారికీ తెలుగులో శిక్షణ ఇవ్వాలని, తప్పనిసరి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# వణికిస్తున్న చలి


**రాష్ట్రంలో మరింత పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు**

**ఆదివారం అత్యల్పంగా సిర్పూర్‌లో 7.4 డిగ్రీ సెల్సియస్**

**10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఇతర జిల్లాకు యెల్లో అలర్ట్**

**శేరిలింగంపల్లిలో 10 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు**

**రెండుమూడు రోజులు మరింత చలి: వాతావరణ కేంద్రం**



| పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు | | |
|---|---|---|
| ప్రాంతం | జిల్లా | ఉష్ణోగ్రత |
| సిర్పూర్ | ఆసిఫాబాద్ | 7.4 |
| కోహీర్ | సంగారెడ్డి | 8.1 |
| బజారుహత్నూర్ | ఆదిలాబాద్ | 8.4 |
| రుద్రంగి | సిరిసిల్ల | 8.6 |

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఆసిఫాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చలి తీవ్రత పెరుగుతోంది. కొన్ని జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. ఆదివారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్ నగరంలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు 7 - 11 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. రాబోయే మూడు రోజులకుగాను 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్, నిర్మల్, భూపాలపల్లి, మంచిర్యాల, వరంగల్, ములుగు జిల్లాల్లో 6-10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగిలిన అన్ని జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ నగరంలో ఆదివారం పలు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 10 డిగ్రీ సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శివారు ప్రాంతాలు, వృక్షాలు అధికంగా ఉన్న చోట ఉదయం పూట పొగమంచు దట్టంగా అలముకుంటోంది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.